
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సాగర్ స్వాధీనంపై కేంద్రం మళ్లీ సమీక్ష



13

16న ఢిల్లీకి రావాలని సీఎస్‌లకు పిలుపు

అప్పగింతపై తుది నిర్ణయానికి చాన్స్

మేడిగడ్డ కాఫర్ డ్యామ్ ఖర్చు మీదే!

డ్యామ్‌తోపాటు బ్యారేజీ పునరుద్ధరణకు

రూ.450-550 కోట్ల దాకా ఖర్చు..

మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలి

నీటి పారుదల శాఖకు ఎల్‌అండ్‌టీ లేఖ

ఆదివారం | 4-2-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 290 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: నవమి సా. 5.51 తదుపరి దశమి; నక్షత్రం: విశాఖ ఉ. 7.22 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.11.27-1.05; దుర్ముహూర్తం: సా.4.38-5.23; అమృతఘడియలు: రా.9.16-10.54; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారతరత్నం ఆడ్వాణీ

'కమలం' కురు వృద్ధుడికి అత్యున్నత పురస్కారం



రాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన 2 వారాలకే..

'ఎక్స్'లో ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ

అనంతరం రాష్ట్రపతి భవన్ నుంచి సమాచారం

ఒకే ఏడాదిలో ఇద్దరికి భారత రత్న అవార్డు

నా సిద్ధాంతాలకు దక్కిన గౌరవమిది

దశాబ్దాల నిస్వార్థసేవకు ప్రతిఫలం లభించింది

ఈ జీవితం దేశానికి అంకితం

కుటుంబం, కార్యకర్తలకు నా కృతజ్ఞతలు

భారత రత్న ప్రకటన తర్వాత ఆడ్వాణీ స్పందన

అత్యంత వినయంతో భారతరత్న పురస్కారాన్ని స్వీకరిస్తున్నా. ఇదం నమమ (ఈ జీవితం నాది కాదు.. దేశానిది) అన్న సంస్కృత సూక్తే నాకు ప్రేరణ. 14వ ఏట ఆర్ఎస్ఎస్‌లో చేరా. నా దేశం కోసం ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పనిచేశా. కుటుంబం, లక్షలాది మంది పార్టీ, సంఘ్ కార్యకర్తలకు కృతజ్ఞతలు.

\- ఎల్‌కే అడ్వాణీ

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

రాజకీయ కురువృద్ధుడు.. దేశ రాజకీయాలనే మలుపు తిప్పిన రథ యాత్రికుడు.. ఢిల్లీ పీఠంపై కమలం పువ్వును కూర్చోబెట్టిన యోధుడు.. లాల్‌కృష్ణ అడ్వాణీకి కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ప్రకటించింది. ఉప ప్రధానిగా పని చేసి.. ప్రధాని రేసులోనూ ముందంజలో ఉండి.. 'మోదీ' ప్రభంజనంలో పక్కకు తప్పుకొన్న ఆయనకు ఇప్పుడు, ఇలా ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. రాముడే నినాదంగా, రామజన్మభూమి సాధనే ధ్యేయంగా రాజకీయ ప్రస్థానం కొనసాగించిన అడ్వాణీకి.. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన రెండు వారాలకే 'భారత రత్న' ప్రకటించడం గమనార్హం! బిహార్ మాజీ ముఖ్యమంత్రి, వెనుకబడిన వర్గాల నాయకుడు కర్పూరీ

మిగతా 2వ పేజీలో...

ఇది నాకు భావోద్వేగ క్షణం

అత్యంత గౌరవనీయ రాజనీతిజ్ఞుడు

2

అట్టడుగు స్థాయి నుంచి ఉప ప్రధానిగా ఎదిగారు

ఆడ్వాణీపై మోదీ ప్రశంసలు



చాలా ఆలస్యం..

కానీ మేం స్వాగతిస్తున్నాం

ఆడ్వాణీకి అవార్డుపై కాంగ్రెస్ వ్యాఖ్య

ఓట్లు చెదిరిపోకూడదనే..: అఖిలేశ్

'రామ రథ' సారథి!

2

రామజన్మభూమి ఉద్యమానికి రాజకీయ రూపునిచ్చిన ఆడ్వాణీ

'హిందూత్వ'ను ప్రధాన ఎజెండాగా మార్చేసిన బీజేపీ అగ్ర నేత

రెండు సీట్ల నుంచి అధికారంలోకి తెచ్చిన ఘనత.. అరెస్సెస్ ఇష్టుడు

జిన్నాను పొగిడి తెరమరుగు.. నరేంద్ర మోదీ రాకతో మసకబారిన ప్రభ



రికార్డుల్లో చంపేశారు!

60 కోట్ల భూమిని కొట్టేశారు

జిల్లా రిజిస్ట్రార్ బరితెగింపు.. శంకర్‌పల్లిలో ఐదెకరాల దొంగ రిజిస్ట్రేషన్

మాజీ మంత్రి అనుచరుడు సూత్రధారి

చక్రం తిప్పిన హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్

ఆయన భార్యపేరిటా కొంత రిజిస్ట్రేషన్

యజమాని మరణించినట్లు దొంగ పత్రాలు

తెరపైకి నకిలీ వారసుడిని తెచ్చి రిజిస్ట్రేషన్

ఈకేవైసీలో పేరు తేడా ఉన్నా పట్టించుకోలేదు

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

జిల్లా రిజిస్ట్రార్ కోసం సబ్ రిజిస్ట్రార్ అడ్డగోలు

ఒకవైపు 2014లో మరణించాడని సర్టిఫికెట్

మరోవైపు తన పేరిటే 2023లో నాలా ఎలా?

భూమి యజమానిపైనే నకిలీ అంటూ ఫిర్యాదు

పేరులో తేడాలన్నింటికీ సెల్ఫ్ డిక్లరేషన్‌తో సరి

భూ యజమాని నిబంధనలు తప్పని ఒప్పుకోలు

నిజానిజాలు తేల్చాలని పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రాజధాని ల్యాండ్ మాఫియా కొత్త పుంతలు తొక్కింది. బతికి ఉన్న వ్యక్తి చనిపోయాడని చెప్పి, ఆయనకు నకిలీ వారసుడిని సృష్టించి, అతని నుంచి ఏకంగా 60 కోట్ల రూపాయల విలువైన ఐదెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో జరిగిన ఈ వ్యవహారంలో ఏకంగా హైదరాబాద్‌కు చెందిన జిల్లా రిజిస్ట్రార్ భార్య పాత్రధారి కావడం గమనార్హం. ఉన్నతాధికారి కుటుంబం కొనుగోలుదారుల్లో ఉండటంతో శంకర్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయం కూడా రియల్టర్ మాఫియా సమర్పించిన పత్రాల్లో అనేక తేడాలున్నా కళ్లు మూసుకొని గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేసేసింది. సామాన్యుడు రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే చిన్న తేడా కూడా లేకున్నా ఏవేవో అడిగే సబ్ రిజిస్ట్రార్ తాజా వ్యవహారంలో అనేక తేడాలున్నాయని కనిపిస్తున్నా పట్టించుకోలేదు. కేవైసీలో తేడాలున్నా, అసలు రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యక్తే వేరయినా కేవలం ఒక డిక్లరేషన్ తీసుకుని రిజిస్ట్రేషన్ చేసేశాడు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మహబూబ్‌నగర్ జిల్లా నేత ప్రధాన అనుచరుడు కూడా కొనుగోలుదారుల్లో ఉన్నారు. గత ఆగస్టులోనే పథకం ప్రకారం పాన్ కార్డ్ సహా కావాల్సిన నకిలీ పత్రాలన్నీ సృష్టించారు. ప్రభుత్వం మారాక కూడా వెరుపు లేకుండా రిజిస్ట్రేషన్ కానిచ్చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన మరణధ్రువీకరణ పత్రంలో చనిపోయిన వ్యక్తి పేరు

మిగతా 3వ పేజీలో...

అభిమానమా... ఉన్మాదమా?

జగన్మోహన్ రెడ్డి ఏ ముహూర్తంలో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారోగానీ, అప్పటి నుంచి ఆయనకు మద్దతుగా ఉన్మాద మూక పోగైంది. ఇళ్లలోని ఆడవాళ్లను కూడా బజారుకు ఈడ్చే దుష్ట సంస్కృతి జగన్ పాలనలో జరగడం దారుణం! ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వ హననంతో మొదలైన ఈ దాడి... ఇప్పుడు రాజశేఖర రెడ్డి కుటుంబంలోని ఆడవాళ్లకు కూడా చుట్టుకుంది. తల్లితోపాటు చెల్లెళ్ల వ్యక్తిత్వాలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నప్పటికీ ముఖ్యమంత్రి బెల్లం కొట్టిన రాయిలా మౌనంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.



కొత్త పలుకు!

తమ కుటుంబంలోని ఆడపడుచులను ఆదరించి గౌరవించడం రాయలసీమ సంస్కృతి. సీమకు చెందిన రెడ్డి సామాజిక వర్గీయులు తమ ఇంటి ఆడపడుచులనే కాదు, ప్రత్యర్థుల ఇళ్లలోని మహిళలను కూడా గౌరవిస్తారు.

పెళ్లి తర్వాత ఆడపిల్ల ఇంటి పేరు మారుతుంది. అదేమీ రూల్ కాదు. పుట్టింటి వారి ఇంటిపేరునే కొనసాగించుకొనే హక్కు ఆడపిల్లలకు ఉంటుంది. షర్మిలను ఇప్పుడు 'షర్మిల శాస్త్రి' అని కించపరుస్తున్న వారు ఒక విషయం మర్చిపోతున్నారు. జగన్ తరఫున బైబిల్ పట్టుకొని మరీ ప్రచారం చేస్తున్న ఆయన మేనత్త విమల తనను తాను వైఎస్ విమలా రెడ్డిగానే చెప్పుకుంటున్నారు కదా?

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు స్వీకరించాక జగన్‌కు చెందిన కిరాయి మూక ఆమెను టార్గెట్ చేసుకుంది. ఈ దాడి ఎంత దూరం వెళ్లిందంటే, షర్మిల అసలు రాజశేఖర రెడ్డికే పుట్టిందా? అని శంకించే వరకూ వెళ్లారు. షర్మిల పుట్టుకను శంకించడం అంటే రాజశేఖర రెడ్డి భార్య విజయమ్మ శీలాన్ని శంకించడమే కదా? తల్లిని అంతగా అవమానిస్తున్నప్పటికీ జగన్ స్పందించకపోవడాన్ని బట్టి అతనిలో మానవత్వం ఉందా? అన్న అనుమానం కలగడం సహజం.

'శత్రు శేషం ఉండకూడదు! షర్మిల, సునీతలను కూడా లేపెయ్ అన్నా' అని ఉన్మాద మూక జగన్‌ని కోరడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అంటే, జగన్ కనుసన్నల్లో లేదా ఆయనకు తెలిసే వివేకా హత్య జరిగిందని ఉన్మాద మూక కూడా నమ్ముతున్నట్టే కదా? వివేకాను చంపినట్టు షర్మిల, సునీతనూ చంపేస్తే శత్రు శేషం ఉండదనుకోవడం వారి కిరాతక మనస్తత్వానికి నిదర్శనం కాదా? దీనిపై పౌర సమాజం తమకు ఏమీ పట్టనట్టుగా ఉండిపోవడం బాధాకరంగా ఉంది.

పులివెందుల పులి అని జగన్‌ని ఆయన మద్దతుదారులు శ్లాఘిస్తూ ఉంటారు. ఆయన 'పులి కాదు పిల్లి' అని ఇప్పుడు షర్మిల బయటపెట్టిన రహస్యంతో స్పష్టమవుతోంది. సోనియాని ధిక్కరించి మరీ జగన్ అధికారంలోకి వచ్చారని ఇప్పటిదాకా జరిగిన ప్రచారం బోగస్ అని షర్మిల మాటలతో తేలిపోయింది. జైల్లో ఉన్నప్పుడు తనకు బెయిల్ కోసం సోనియా వద్దకు జగన్ రెడ్డి తన భార్య భారతీ రెడ్డిని రాయబారం పంపారని షర్మిల చెప్పకనే చెప్పారు.

4

మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నప్పటికీ ఉన్మాద మూక వైఎస్ కుటుంబాన్ని కూడా వదలకుండా వేధిస్తున్నారంటే జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితి ఏమిటో? పోలీసులను సైతం కిరాయి సైనికులుగా మార్చివేసినందున జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలు ప్రాథమిక హక్కులను మరచిపోవాల్సిందే.

ఇది పశు ప్రవర్తన

స్త్రీలను కించపరచడం అమానుషం

ఇలాంటి పిరికిపందల చర్యలతో కాంగ్రెస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు

షర్మిలకు అండగా నిలుస్తాం: రాహుల్

ఓటమిని ఎదుర్కోలేని పిరికివాళ్లే క్రూరత్వాన్ని ఆశ్రయిస్తారు!

13

జగన్‌పై షర్మిల పరోక్ష వ్యాఖ్యలు

బీజేపీకి కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కాదు

ప్రాంతీయ శక్తులతోనే బీజేపీకి చెక్

రాష్ట్ర సర్కారును ఆగం చేయాలన్న ఆలోచన లేదు: కేటీఆర్

14

బీఆర్ఎస్‌కు బై బై

ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య కేసీఆర్‌కు లేఖ.. 10న కాంగ్రెస్‌లోకి

3



రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి

13

సహకరిస్తాం

సీఎం, డిప్యూటీ సీఎంలతో ఆర్థికవేత్త మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా భేటీ

ఆరు గ్యారెంటీల అమలుపై చర్చ

విద్యుత్, ప్రణాళిక రంగాలపై సూచన

టీఎస్ ఇక టీజీ

నంబరు ప్లేట్లపై తెలంగాణ స్టేట్ బదులు తెలంగాణగా మార్పు!

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.. నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం

200 యూనిట్ల ఉచిత విద్యుత్తుతో పడే భారం, మార్గదర్శకాలపై చర్చ

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు ఆమోదముద్ర!

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వాహనాల నంబరు ప్లేట్లకు సంబంధించి తెలంగాణ స్టేట్ (టీఎస్)గా ఉన్న పేరును తెలంగాణ (టీజీ)గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసి, కేంద్రానికి పంపించాలని ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

13 ఎకరాలు.. 10 అంతస్తులు

హైదరాబాద్‌కు కొత్త కలెక్టరేట్: కోమటిరెడ్డి

11




'రామ రథ' సారథి!



రామజన్మభూమి ఉద్యమానికి రాజకీయ రూపునిచ్చిన అద్వాణీ

లాల్ కృష్ణ అద్వాణీ.. భారత రాజకీయాల్లో పరిచయమే అక్కర్లేని పేరు.. బీజేపీకి అగ్ర నేతగానే కాదు.. రామజన్మభూమి ఉద్యమానికి రాజకీయ రూపం తీసుకొచ్చి.. దేశ లౌకికవాద రాజకీయాల్లోకి 'హిందూత్వ'ను చొప్పించిన నాయకుడిగా విమర్శలపాలైనా.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ శ్రేణుల గౌరవం మాత్రం ఇతోధికంగా సంపాదించారు. 1984లో కేవలం రెండు లోక్‌సభ సీట్లు ఉన్న పార్టీని.. తన కష్టంతో.. వ్యూహచాతుర్యంతో అనతికాలంలోనే బలోపేతం చేసి.. 1996లో ఏకైక అతిపెద్ద పార్టీగా.. 1998, 99ల్లో అధికార పార్టీగా ఎదిగేలా చేశారు. రామజన్మభూమికి సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాదు.. సోమ్‌నాథ్ నుంచి అయోధ్య వరకు రామ రథయాత్ర చేపట్టి.. రామాలయ నిర్మాణాన్ని బీజేపీ ప్రధాన ఎజెండాగా మార్చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారారు. బీజేపీని కాంగ్రెస్, వామపక్షాలు అంటరాని పార్టీగా చూసినా.. సమతా పార్టీ, జనతాదళ్ వంటి సోషలిస్టు పార్టీలు దానిని అక్కున చేర్చుకునేలా చేశారు. తన సారథ్యంలో బీజేపీ గెలిచినా.. ప్రధాని పదవికి అటల్ బిహారీ వాజపేయిని ప్రతిపాదించి.. తనకు పదవీలాలస లేదని.. పదవుల కంటే పార్టీయే మిన్నని చాటారు. హిందీ రాష్ట్రాల్లో సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేయడానికి ఎంతో కృషిచేశారు. మచ్చలేని నాయకుడు. హవాలా కుంభకోణం దేశాన్ని ఊపేసినప్పుడు.. సదరు డైరీల్లో తన పేరు ఉండడంతో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. కోర్టులో కేసు తేలేవరకు ప్రభుత్వానికి దూరంగా ఉన్నారు. పాకిస్థాన్‌లో తన జన్మస్థానమైన కరాచీ వెళ్లి.. ద్విజాతి సిద్ధాంతకర్త, మతప్రాతిపదికన దేశం విడిపోవడానికి కారణమైన ముస్లింలీగ్ వ్యవస్థాపకుడు మహ్మదాలీ జిన్నాను లౌకికవాది అని పొగిడి సంఘ్ ఆగ్రహాన్ని చవిచూశారు. దాని ఫలితంగానే క్రమంగా తెరమరుగయ్యారు. సంఘ్ 2014లో ఆయన్ను కాదని.. ఆయన శిష్యుడైన గుజరాత్ సీఎం నరేంద్ర మోదీని జాతీయ యవనికపైకి తేవడంతో ఆయన ప్రభ మసకబారింది. గత ఐదేళ్లుగా పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయనకు మోదీ ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించి విస్మయానికి గురిచేసింది.

\- సెంట్రల్ డెస్క్



అద్వాణీ రథయాత్ర (ఫైల్ ఫోటో)

జీవిత విశేషాలు..

- ఆద్వాణీ 1927 నవంబరు 8న కరాచీలో పుట్టారు.
- 1942లో 14వ ఏట ఆరెస్సెస్‌లో చేరారు.
- 1947 సెప్టెంబరులో దేశ విభజన విద్వేషాలు ప్రజ్వరిల్లిన సమయంలో కట్టుబట్టలతో పాకిస్థాన్ నుంచి తప్పించుకుని రైలులో ఢిల్లీ చేరుకున్నారు.
- ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా రాజస్థాన్‌లో పనిచేశారు. గాంధీజీ హత్యానంతరం ఆరెస్సెస్‌ను నిషేధించినప్పుడు అజ్ఞాత వాసం గడిపారు.
- తర్వాత సంఘ్ మార్గదర్శకత్వంలో ఏర్పాటైన భారతీయ జనసంఘ్‌లో చేరారు. అప్పటికే జనసంఘ్ తరఫున లోక్‌సభ సభ్యుడిగా ఉన్న అటల్ బిహారీ వాజపేయికి సహాయకుడిగా పనిచేసేందుకు 1957లో ఢిల్లీ వచ్చారు.
- 1965లో కమలను వివాహం చేసుకున్నారు.
- 1972లో జనసంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక.
- ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో 1975 జూన్‌లో వాజపేయితో పాటు అరెస్టు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో జనతా పార్టీ గెలిచాక మొరార్జీ ప్రభుత్వంలో 1977 మార్చి నుంచి 1979 జూలై వరకు కేంద్ర సమాచార మంత్రిగా బాధ్యతలు.
- 1980లో బీజేపీ స్థాపనలో కీలక భూమిక. 1986లో వాజపేయి తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక. 1991 వరకు కొనసాగిన అద్వాణీ.
- 1989 ఎన్నికల్లో బీజేపీ 85 సీట్లలో విజయం. వీపీ సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్‌కు మద్దతు.
- రామాలయ నిర్మాణం డిమాండ్‌తో 1990 సెప్టెంబరు 25న సోమనాథ్ నుంచి అయోధ్యకు రామ రథయాత్రకు శ్రీకారం. రోజుకు 300 కి.మీ. చొప్పున ప్రయాణం.
- 1990 అక్టోబరు 24న బిహార్‌లోని సమస్తిపూర్‌లో అద్వాణీ అరెస్టు. మతకల్లోలాలకు యాత్ర ఆజ్యం పోస్తోందంటూ నాటి సీఎం లాలూప్రసాద్ రథ యాత్రను అడ్డుకున్నారు.
- 1991 లోక్‌సభ ఎన్నికల్లో 120 సీట్లలో బీజేపీ ఘనవిజయం. ప్రధాన ప్రతిపక్షంగా అవతరణ.
- 1992 డిసెంబరు 6న అయోధ్యలో కరసేవ సందర్భంగా.. అద్వాణీ, వాజపేయి, ఇతర బీజేపీ అగ్ర నేతల సమక్షంలోనే బాబ్రీమసీదు కూల్చివేత ఘటన.
- 1993 నుంచి 98 వరకు మళ్లీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నిక. 1996 ఎన్నికల్లో తొలిసారి బీజేపీ 161 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరణ. ప్రధానిగా వాజపేయి ప్రమాణం. సాధారణ మెజారిటీ కూడగట్టుకోలేక పదవికి రాజీనామా.
- 1998 ఎన్నికల్లో 182కి పెరిగిన బీజేపీ ఎంపీ స్థానాలు. ఇతర పార్టీలతో ఎన్డీఏ ఏర్పాటుచేసి గద్దెనెక్కిన వాజపేయి. హోం మంత్రిగా అద్వాణీ బాధ్యతలు.
- 1998-2004 వరకు కేంద్ర హోం మంత్రిగా.. 2002 నుంచి 2004 వరకు దేశ ఉపప్రధానిగా అద్వాణీ.
- 2009-14 నడుమ ప్రధాన ప్రతిపక్ష నేత.
- 2013లో బీజేపీ ఎన్నికల ప్రచార సారథిగా గుజరాత్ సీఎం మోదీని ప్రతిపాదించిన సంఘ్. వ్యతిరేకించిన అద్వాణీ.
- 2014లో బీజేపీకి తొలిసారి లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ. మోదీ ప్రధానిగా ఎన్నిక. అద్వాణీ లోక్‌సభకు ఎన్నికైనా.. ఎలాంటి పదవీ ఇవ్వని మోదీ.
- తాజాగా భారతరత్న పురస్కారం ప్రకటన.

ఈ జీవితం దేశానికి అంకితం

» రాష్ట్రపతి ముర్ము, మోదీకి అద్వాణీ ధన్యవాదాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): "ఈ జీవితం నాది కాదు.. దేశానిది (ఇదం నమమ)" అన్న సంస్కృత సూక్తే నాకు ప్రేరణ. 14వ ఏట ఆర్ఎస్ఎస్‌లో చేరా. నా ప్రియమైన దేశం కోసం ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో సేవలందించా. దశాబ్దాల ఈ నిస్వార్థ సేవకు ప్రతిఫలం లభించింది. వ్యక్తిగతంగానే కాదు.. నా ఆశయాలు, సిద్ధాంతాలకు గౌరవం దక్కింది" అని అన్నారు బీజేపీ కురు వృద్ధుడు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీ. 'భారత రత్న' ప్రకటన అనంతరం ఆయన ఓ ప్రకటనలో స్పందించారు. అత్యంత వినయంతో ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. తాను అత్యంత సన్నిహితంగా పనిచేసిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, మాజీ ప్రధాని వాజపేయిని స్మరించుకున్నారు. కుటుంబం, లక్షలాది మంది పార్టీ, సంఘ్ కార్యకర్తలతో పాటు భార్య దివంగత కమలా అద్వాణీని గుర్తు చేసుకుని కృతజ్ఞతలు తెలిపారు. వారందించిన మానసిక స్థైర్యంతోనే ప్రజాసేవలో కొనసాగినట్లు వివరించారు. అభివృద్ధిలో భారతదేశం వైభవోన్నతంగా ముందుకుసాగాలని అద్వాణీ ఆకాంక్షించారు.

ప్రజా సేవకు గొప్ప గుర్తింపు: అద్వాణీ కుటుంబం

అద్వాణీకి భారతరత్న ప్రకటన పట్ల ఆయన కుటుంబం అత్యంత ఆనందించింది. జీవితాంతం అందించిన ప్రజా సేవకు గొప్ప గుర్తింపు లభించిందని పేర్కొంది. ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపింది. దేశ అత్యున్నత పురస్కారం దక్కిన సంగతి తెలిసి తన తండ్రి కళ్లలో ఆనందభాష్పాలు రాలాయని అద్వాణీ కుమారుడు జయంత్ చెప్పారు. ఢిల్లీలోని నివాసంలో తండ్రికి కుమార్తె ప్రతిభా అద్వాణీ లడ్డూ తినిపించారు. ఈసమయంలో తన తల్లి లేకపోవడం ఒక్కటే లోటని అన్నారు.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వాణీకి దేశ 'భారత రత్న' ప్రకటించడం పట్ల ఆ పార్టీ నేతలు, కేంద్ర మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. దేశానికి ఎనలేని సేవలందించిన తమ మార్గనిర్దేశకుడికి తగిన గౌరవం లభించిందంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. అద్వాణీ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. దేశానికి, పార్టీకి అద్వాణీ అందించిన సేవలు వెలకట్టలేనివని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. భారత రాజకీయాల్లో ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప రాజకీయవేత్త అద్వాణీకి భారతరత్న ప్రకటించడం కోట్లాది మంది దేశ ప్రజలకు దక్కిన గౌరవం అని అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయాల్లో

అంకితభావం అంటే అద్వాణీ

అంకిత భావం అంటే ఎల్‌కే అద్వాణీయేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం అద్వాణీ అందించిన సేవలు చిరస్మరణీయం, స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. స్వాతంత్ర్యం తర్వాత దేశ పునర్నిర్మాణంలో అద్వాణీ పాత్ర కీలకమని, నిష్పక్షపాతానికి అద్వాణీ నిదర్శనమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. దేశ సేవకు జీవితాన్ని అంకితం చేసిన 'నేషనల్ హీరో' అద్వాణీకి భారతరత్నతో తగిన గౌరవం లభించిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హర్షం వ్యక్తం చేశారు. తన లాంటి ఎందరో సామాన్య కార్యకర్తలకు మార్గదర్శి, లక్షలాది మందికి స్ఫూర్తిప్రదాత అయిన అద్వాణీకి భారతరత్న ప్రకటించడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు పేర్కొన్నారు. అద్వాణీ నైతిక విలువలు, నిబద్ధతకు తిరుగులేని నిదర్శనమని బీజేపీ నేత, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ అభిప్రాయపడ్డారు. అద్వాణీ ఓ గొప్ప రాజనీతిజ్ఞుడు అని అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు.

ఇది భావోద్వేగ క్షణం: మోదీ

అద్వాణీకి భారత రత్న ప్రకటించిన సమయం తనకు ఎంతో భావోద్వేగం కలిగించిన క్షణమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ పురస్కారం గురించి అద్వాణీతో స్వయంగా మాట్లాడి అభినందించానని ఎక్స్‌లో పోస్టు చేశారు. మన కాలంలో అత్యంత గౌరవనీయుడైన రాజనీతిజ్ఞుడు, దేశ అభివృద్ధికి చరిత్రాత్మకమైన పాత్ర పోషించిన నాయకుడు అద్వాణీ అని కొనియాడారు. ఆయన జీవితం అట్టడుగు స్థాయి నుంచి దేశానికి సేవ చేయడం ప్రారంభించి ఉప ప్రధానిగా ఎదిగారన్నారు. అద్వాణీ నుంచి నేర్చుకునేందుకు తనకు లెక్కలేనన్ని అవకాశాలు రావడం తన అదృష్టమన్నారు.

భారతరత్నం అద్వాణీ

(మొదటి పేజీ తరువాయి)

ఠాకూర్‌కు ఇప్పటికే 'భారత రత్న' ప్రకటించారు. అనూహ్యంగా... అద్వాణీని కూడా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేస్తూ శనివారం ప్రకటన వెలువడింది. ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఈ ప్రకటన చేశారు. ఆ వెంటనే... రాష్ట్రపతి భవన్ కూడా అధికారికంగా ఈ ప్రకటన చేసింది. 'మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీకి భారత రత్న ప్రదానం చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్ణయించారు' అని అందులో తెలిపారు. ఆ వెంటనే మీడియా ప్రతినిధులు అద్వాణీ నివాసానికి చేరుకున్నారు. వారికి దూరం నుంచే ఆయన అభివాదం చేశారు. 'భారత రత్న' ప్రకటనపై తన తండ్రి ఎంతో సంతోషంగా ఉన్నారని, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారని అద్వాణీ కుమార్తె ప్రతిభ తెలిపారు. బీజేపీ వ్యవస్థాపకులు, ఆ పార్టీ కీలక నేతలందరికీ మోదీ ఈ పదేళ్లలో ఉన్నత పౌర పురస్కారాలు ప్రకటించారు. మరీ ముఖ్యంగా... 'ఇద్దరు విత్రులు' వాజపేయి, అద్వాణీ ఇద్దరినీ 'భారత రత్న'తో సత్కరించారు. వాజపేయికి 2015లో ఆయన అవసాన దశలో ఉన్న కాలంలో భారత రత్న ప్రకటించారు. 2017లో మరో బీజేపీ కురువృద్ధ నేత 89 సంవత్సరాల మురళీ మనోహర్ జోషికి కూడా పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందించారు. ఇటీవల వెంకయ్య నాయుడుకు 'పద్మవిభూషణ్' ప్రకటించారు. ఇలా బీజేపీలోని పాత తరం నేతలందరినీ మోదీ సత్కరించుకున్నారు.



శనివారం ఎక్స్‌లో మోదీ పోస్టు చేసిన ఫొటో

అద్వాణీ మహనీయుడు: కిషన్ రెడ్డి, సంజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అద్వాణీ మార్గదర్శకుడు, మహనీయుడు అని బీజేపీ తెలంగాణ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అన్నారు. అద్వాణీతో నడిచిన ప్రతీ క్షణం కొత్త విషయం నేర్చుకోవచ్చునని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దేశ భక్తుడిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించిన అద్వాణీ... రథయాత్రతో రామమందిర నిర్మాణానికి అంకురార్పణ చేసిన మహనీయుడని బండి సంజయ్ అన్నారు.



అద్వాణీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మనోహర్ జోషి

స్వాగతిస్తున్నాం.. కానీ జాప్యం చేశారు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఎల్‌కే అద్వాణీకి భారతరత్న ప్రకటించడంతో ఆయనకు పలువురు ప్రతిపక్ష నేతలు అభినందనలు తెలిపారు. అద్వాణీకి భారతరత్నను స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ ఢిల్లీ నేత సందీప్ దీక్షిత్ స్పందిస్తూ ప్రధాని మోదీకి, బీజేపీకి అద్వాణీ చాలా ఆలస్యంగా గుర్తుకొచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో తన ఓట్లు చెల్లాచెదురుకాకుండా కాపాడుకునేందుకు బీజేపీ ప్రభుత్వం తన పదవీకాలం చివర్లో అద్వాణీకి భారతరత్న ప్రకటించిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఇది అద్వాణీపై గౌరవంతో ఇచ్చిందికాదన్నారు. అద్వాణీకి భారతరత్నపై శివసేన (ఉద్ధవ్ వర్గం) హర్షం వ్యక్తం చేసింది. అద్వాణీకి ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా, అద్వాణీకి భారత రత్న ప్రకటించడం దురదృష్టకరమని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అద్వాణీ చేపట్టిన రథయాత్రతో దేశ వ్యాప్తంగా మతఘర్షణలు జరిగాయని, అల్లర్లలో అనేక మంది అమాయకులు అసువులు బాసారని గుర్తు చేశారు. వారి సమాధులనే అద్వాణీ మెట్లుగా వినియోగించుకున్నారని ఒవైసీ మండి పడ్డారు.

చందమామ... చిక్కిపోతున్నాడు!

ఇప్పటికే 150 అడుగులు తగ్గిపోయిన చుట్టుకొలత

» ఎండిన ద్రాక్షపై వచ్చినట్లు చంద్రుడిపై ముడతలు

» జాబిల్లి అంతర్భాగంలో శీతలీకరణ ప్రక్రియతోనే...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: 'తెలిసిందిలే... తెలిసిందిలే.. నెలరాజ నీ రూపు తెలిసిందిలే...' అంటూ ఎన్ని పాటలు పాడుకున్నా చంద్రుడి గురించి మనకు తెలిసింది ఆవగింజంత కూడా లేదని తేలిపోయింది. జాబిల్లికి సంబంధించి ఆసక్తికరమైన, సవాలుతో కూడిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే మన చందమామ బక్కచిక్కిపోతోంది. అంతర్భాగంలో శీతలీకరణ ప్రక్రియ ఫలితంగా జాబిల్లి కుంచించుకుపోతున్నట్లు తేలింది. ఈ క్రమంలో ఏర్పడే సంకోచాలతో ఎండిన ద్రాక్ష పండుపై వచ్చినట్లే చంద్రుడి ఉపరితలం పైనా ముడతలు పడుతున్నాయి. సాంకేతిక పరిభాషలో 'పీడన భ్రంశం'గా పిలిచే ఈ ముడతలు ప్రాథమికంగా చంద్రుడి భౌగోళిక స్వరూపాన్నే మార్చేస్తున్నాయి. గత కొన్ని లక్షల సంవత్సరాల కాలంలో చందమామ దాదాపు 150 అడుగుల మేర చిక్కిపోయాడని తాజా అధ్యయనంలో వెల్లడైంది. లోపలి పొరలు చల్లబడుతున్న కొద్దీ పెళుసుగా ఉన్న చంద్రుడి ఉపరితలంపై పగుళ్లు, గుట్టలు, లోయలు వంటివి ఏర్పడుతున్నాయి. కొన్ని పదుల మీటర్లు ఎత్తున ఉండే ఈ గుట్టలు చంద్రుడి మారుతున్న స్వరూపానికి నిదర్శనం. జాబిల్లి ఉపరితలం భౌగోళికంగా నిద్రాణ స్థితిలో ఉంటుందని ఇప్పటి వరకూ ఉన్న భావనలకు ఇది పూర్తి విరుద్ధంగా ఉండటంతో పాటు భవిష్యత్తులో చంద్రుడిపై చేపట్టే అన్వేషణలకు సంబంధించి ఆందోళన రేకెత్తించే అంశంగా మారింది. తాజాగా ఏర్పడిన పగుళ్లు చంద్రుడి ఉపరితలం నేటికీ చురుకుగానే స్పందిస్తోందని చెప్పడానికి ఒక సూచన. వీటి కారణంగానే జాబిల్లి ఉపరితలంపై తరచూ ప్రకంపనాలు వస్తున్నాయని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ చంద్రకంపాలను ఎదుర్కోవాల్సి రావడం వ్యోమగాములకు అదనపు సవాలుగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. చంద్రుడి క్రియాశీల స్వభావానికి విరుద్ధంగా దాని డైనమిక్ స్వభావాన్ని గుర్తించాల్సిన అవసరాన్ని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన థామస్ ఆర్. వాటర్స్ నొక్కిచెప్పారు. ఈ కారణంగానే చంద్రుడి ఉపరితలంపై బలమైన ప్రకంపనలు వస్తున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని వివరించారు. భవిష్యత్తు లూనార్ మిషన్లతో పాటు చంద్రుడిపై కాలనీల ఏర్పాటు గురించి చర్చలు సాగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రకంపనాలపై మరింత లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని థామస్ అభిప్రాయం వ్యక్తం చేశారు.



చంద్రుడిపై ముడతలు

సమన్లకు స్పందించట్లేదు!

» కేజ్రీవాల్‌పై ఢిల్లీ కోర్టులో ఈడీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఢిల్లీ మద్యం కేసు దర్యాప్తులో సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ తమకు సహకరించటం లేదని ఢిల్లీలోని ఓ స్థానిక కోర్టులో ఈడీ శనివారం ఫిర్యాదు చేసింది. పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ విచారణకు రావటం లేదని ఈడీ పేర్కొంది. ఈడీ తొలిదశ వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది. మద్యం పాలసీ కేసులో ఈడీ పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ విచారణకు హాజరుకాని విషయం తెలిసిందే. మరోవైపు, ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభపరిచి తమ ప్రభుత్వాన్ని కూల్చాలని బీజేపీ కుట్ర పన్నిందన్న కేజ్రీవాల్ ఆరోపణలపై బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేజ్రీవాల్ నివాసంలో శనివారం నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఐదు గంటలపాటు హైడ్రామా నెలకొంది. స్వయంగా సీఎంకే నోటీసులు అందిస్తామని పోలీసులు.. తమకు ఇస్తే ఆయనకు అందజేస్తామని సిబ్బంది వాగ్వాదానికి దిగారు. అంతకుముందు రోజు కూడా పోలీసులు నోటీసులు తీసుకురాగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో శనివారం మీడియాను వెంటబెట్టుకొని పోలీసులు వచ్చారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు తమ రాజకీయ బాసుల ఆదేశాల మేరకు ఇటు వంటి పనుల్లో ఉండటం వల్లనే ఢిల్లీలో నేరాలు పెరుగుతున్నాయని కేజ్రీవాల్ ఎక్స్‌లో విమర్శించారు. చివరికి, పోలీసులు సీఎం నివాసం సిబ్బందికి నోటీసులు అందించారు.



కేజ్రీవాల్ నివాసం దగ్గర ఢిల్లీ పోలీసులు

కేజ్రీవాల్ మెడకు మరో ఉచ్చు!

కేజ్రీవాల్ మెడకు మరో ఉచ్చు బిగుసుకుంది. ఆప్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మొహల్లా క్లినిక్స్ కేంద్రంగా భారీ అవినీతి బయటపడింది. గతేడాది 65 వేల మంది రోగులకు టెస్టులు చేసినట్టు ఆయా క్లినిక్‌లలో నమోదు చేశారు. ఈ టెస్టులను ప్రైవేటు ల్యాబుల్లో నిర్వహించినట్టు తెలిపారు. వీటికి సంబంధించి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.4.63 కోట్లను చెల్లించారు. అయితే.. ఈ విషయంపై తమకు అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు విచారణ చేపట్టి అసలు ఎలాంటి టెస్టులూ జరపలేదని, రికార్డుల్లో నమోదు చేసిన 65 వేల మంది రోగులు నకిలీనని తేల్చారు. దీంతో ఈ విషయంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ఎల్జీ వీకే సక్సేనా కేంద్ర హోం శాఖకు సిఫారసు చేశారు. దీనిపై స్పందించిన హోం శాఖ విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది.

సమాచారం ఇవ్వాల్సిందే!

ఆర్టీఐ నుంచి సీబీఐకి పూర్తి మినహాయింపు లేదు

» కేంద్ర దర్యాప్తు సంస్థకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) నుంచి సీబీఐకి పూర్తి మినహాయింపు లేదని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. అవినీతి ఆరోపణలు, హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచార వివరాలను వెల్లడించాల్సిందేనని స్పష్టంచేసింది. ఆర్టీఐ చట్టం పరిధిలోకి రాని సంస్థల జాబితాను సెక్షన్ 24లో పొందుపరిచారు. జాబితాలో సీబీఐ కూడా ఉంది. అయితే, దాని అర్థం సమాచార హక్కు చట్టం పూర్తిగా సదరు సంస్థలకు వర్తించబోదని చెప్పడం కాదని జస్టిస్ సుబ్రహ్మణ్యం ప్రసాద్ వివరించారు. ఎయిమ్స్‌లోని జై ప్రకాశ్ నారాయణ్ అపెక్స్ ట్రామా సెంటరుకు చెందిన మెడికల్ స్టోర్‌ల కోసం అప్పట్లో సొల్యూషన్లు కొనుగోలు చేశారు. అందులో పెద్దఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై సమాచారం ఇవ్వాల్సిందిగా సీబీఐని చదుర్వేది కోరారు. అప్పట్లో ఆయన ఎయిమ్స్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా ఉన్నారు. పైగా ఆయనే ఈ వ్యవహారంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అనంతరం దీనిపై సీబీఐ దర్యాప్తు సాగించింది. ఈ క్రమంలో సీబీఐ దర్యాప్తునకు సంబంధించిన వివరాలను కోరుతూ చదుర్వేది ఆర్టీఐలో దరఖాస్తు చేశారు. దీనిపై సీబీఐ స్పందించకపోవడంతో కేంద్ర సమాచార కమిషన్‌కు వెళ్లారు. చదుర్వేదికి అనుకూలంగా కమిషన్.. సీబీఐకి ఆదేశాలు జారీచేసింది. దీనిపై ఢిల్లీ హైకోర్టును సీబీఐ సంప్రదించింది. సమాచార హక్కు చట్టం సీబీఐకి వర్తించబోదని ఆ సంస్థ వాదించింది. అయితే, ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

మోదీ మళ్లీ వస్తే బానిసత్వమే

రాజ్యాంగ రక్షణకే రాహుల్ పోరాటం: మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర చేపట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ఓడించకపోతే దేశంలోని ప్రతి ఒక్కరినీ ఆయన బానిసలుగా మార్చుతారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులను బెదిరించి తన దారికి తెచ్చుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి అవాంతరాలు ఎదురవుతున్నప్పటికీ అన్ని వర్గాల వారికి న్యాయం దక్కాలన్న లక్ష్యంతోనే రాహుల్ పాదయాత్ర చేస్తున్నారని చెప్పారు. దేశంలోని ఏ రాజకీయ నాయకుడూ ఇలాంటి యాత్ర చేయలేదని అన్నారు. మోదీ నియంతగా మారుతున్నారని వ్యాఖ్యానించారు. అందువల్ల ప్రజల దగ్గరకు వెళ్లి మోదీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలపై అవగాహన కలిగించాలని కార్యకర్తలను కోరారు. బూత్ కమిటీల నిర్వహణపై కార్యకర్తలకు ఖర్గే సూచనలు ఇచ్చారు. నిజాయితీపరులు, సమర్థులనే ఏజెంట్లుగా నియమించాలని అన్నారు. లేకుంటే అధికారుల సాయంతో 'వారు' ఓట్లు వేసుకుంటారని, అందువల్ల దీనిపై దృష్టి పెట్టాలని చెప్పారు. కాగా, యువత, రైతు, మహిళలు సహా దేశంలో అన్ని వర్గాలకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేసిందని.. ఇదే సమయంలో పారిశ్రామికవేత్త అదానీకి మాత్రం న్యాయం చేసిందని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. కేంద్రం గిరిజనులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.



ఝార్ఖండ్‌లోని బాబా బైద్యనాథ్ ఆలయంలో రాహుల్ పూజలు

చనిపోలేదు.. బతికే ఉన్నా!

ముంబై, ఫిబ్రవరి 3: తాను చనిపోలేదని, జీవించే ఉన్నానని నటి, మోడల్ పూనమ్ పాండే ప్రకటించారు. గర్భాశయ క్యాన్సర్‌పై మహిళల్లో చైతన్యం తీసుకురావటం కోసమే తాను సదరు క్యాన్సర్‌తో చనిపోయినట్లు వార్తలు సృష్టించామని తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో శనివారం ఒక వీడియోను, మెసేజీని పోస్ట్ చేశారు. 'ఇతర క్యాన్సర్ల లాగా గర్భాశయ క్యాన్సర్ ప్రాణాంతకం కాదు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించుకోవటం ద్వారా దీని బారిన పడకుండా వి ఎమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు' అని పూనమ్ పాండే పేర్కొన్నారు.



లోకం తీరు



రిలీవింగ్ లెటర్ కావాలా.. కోరిక తీర్చు!

- హెచ్ఆర్ మేనేజర్‌కు ఐటీ కంపెనీ సీఈవో వేధింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- ఆమెపై మనసుపడి అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన నిందితుడు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తన సంస్థలో పని చేసే ఉద్యోగినిపై మనసుపడ్డ ఓ ఐటీ కంపెనీ సీఈవో ఆమె కోసం అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చేశాడు. ఆమెను లోబర్చుకునేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేశాడు. వాటిని తాళలేక ఆమె ఉద్యోగానికి రాజీనామా చేయగా... తన కోరిక తీరిస్తేనే ఎక్స్‌పీరియన్స్, రిలీవింగ్ లెటర్లు ఇస్తానని షరతు పెట్టాడు. దీంతో మరోదారి లేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. నగరంలోని అమీర్‌పేట్‌లో ఉన్న ఇన్‌ఫో గ్రావిటీ అనే ఐటీ సంస్థలో హెచ్ఆర్ లీగల్ మేనేజర్‌గా పని చేస్తున్న యువతిపై అమెరికాలో ఉండే ఆ సంస్థ సీఈవో తొండెపు చంద్ర ఇష్టం పెంచుకున్నాడు. జూమ్ మీటింగ్‌లో యువతిని చూసిన సీఈవో చంద్ర ఆమెకు దగ్గరయ్యేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేశాడు. సెలవు రోజుల్లో కూడా ఫోన్లు చేస్తూ ఆఫీసు పని అని చెప్పి వ్యక్తిగత విషయాలు మాట్లాడేవాడు. వీడియో కాల్ మాట్లాడాలని బలవంతం చేసేవాడు. ఈ క్రమంలో డిసెంబరు 22న హైదరాబాద్ కార్యాలయానికి వచ్చిన సీఈవో చంద్ర ఆమెకు దగ్గరయ్యేందుకు మరింత ప్రయత్నించాడు. స్థానికంగా తానో ఫ్లాట్ తీసుకున్నానని, అక్కడికి వస్తే కలిసి ఉందామని చెప్పి తన కోరిక తీర్చాలని మనసులో మాటను బయటపడ్డాడు. దీంతో విసిగిపోయిన బాధితురాలు ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు మెయిల్ చేసింది. రాజీనామాను ఆమోదించి ఎక్స్‌పీరియన్స్, రిలీవింగ్ లెటర్ తదితర పత్రాలు ఇవ్వాలని కోరింది. తన కోరిక తీరిస్తేనే ఆయా పత్రాలు ఇస్తానని సీఈవో తేల్చిచెప్పడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇండియా కూటమితో సీట్ల సర్దుబాటుకు సీపీఐ కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం 'ఇండియా కూటమి'తో సీట్ల సర్దుబాటు అంశంపై చర్చలు జరిపేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని సీపీఐ ఏర్పాటు చేసింది. ఈ విషయమై శనివారం జరిగిన రెండో రోజు జాతీయ సమితి సమావేశాల్లో నిర్ణయం తీసుకుంది. కమిటీ సభ్యులుగా డి.రాజా, కె.నారాయణ, రామకృష్ణ పాండాలను సీపీఐ జాతీయ సమితి ఎంపిక చేసింది. ఈ నెల 16న కేంద్ర కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టే సమ్మె, గ్రామీణ బంద్‌కు మద్దతు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్ కౌర్ తీర్మానం ప్రవేశపెట్టగా జాతీయ సమితి మద్దతు తెలిపింది. దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ అభివృద్ధి అంశాలపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా నివేదికను సమర్పించారు

చిరంజీవికి పద్మవిభూషణ్ గర్వకారణం

- అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు చిరంజీవి పద్మవిభూషణ్ పురస్కారానికిఎంపికవడం మనందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ అన్నారు. దేశంలో రెండో అత్యున్నత అవార్డు ప్రకటన సందర్భంగా చిరంజీవి తన ఫామ్‌హౌస్‌లో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత తదితరులు హాజరయ్యారు. చిరంజీవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ దాదాపు గంటసేపు ఉన్నారు.



చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

60 కోట్ల భూమిని కొట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)

ముడగుల వీరవెంకట సత్యనారాయణ అని ఉంది. ఆయన 2014లో చనిపోయాడని పేర్కొన్నారు. 2023లో తీసుకున్న నాలా సర్టిఫికెట్లో భూమి అసలు యజమాని పేరు ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ అని ఉంది. అందిన ముడుపులు, ఉన్నతాధికారి భార్య కొనుగోలుదారుల్లో ఉండటం కారణంగా మొత్తం మీద సబ్ రిజిస్ట్రార్ నోరు మూతపడింది. నిబంధనల ప్రకారం ఆపేయాల్సి ఉన్నా అంతా సవ్యమే అన్నట్లు ప్రక్రియ నడిచిపోయింది. గోదావరి జిల్లాలకు చెందిన పారిశ్రామికవేత్తకు చెందిన రూ.60 కోట్ల విలువైన భూమి వివాదంలో పడిపోయింది.

ఇంటిపేరు ముళ్లపూడి

ఈ భూమి నిజానికి ఎస్ఆర్ఎంటీ డైరెక్టర్ ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణది. ఆయన పూర్తి పేరుతో కాకుండా ఎంవీవీ సత్యనారాయణ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం దొంగ రిజిస్ట్రేషన్‌కు తావిచ్చింది. ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ 2006లో మరో అయిదుగురితో కలిసి ప్రొగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, శంకరపల్లిలోని సర్వే నంబరు 334, 335లో 5.12 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. యజమాని బల్జీత్ కౌర్‌కు డీడీ రూపంలో కెనరా బ్యాంకు నుంచి తమ కంపెనీ తరఫున 18-1-2006న రూ.14,93,285 చెల్లించారు. సంస్థ డైరెక్టర్‌గా సదరు భూమిని 2008లో తన పేరిట రిజిస్టర్ చేయించుకున్నారు. ఇటీవల శంకర్‌పల్లిలో విల్లాలకు డిమాండ్ పెరగడంతో 2023లో ఆయన ఓ సంస్థతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఒప్పందాన్ని రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఈ భూమి మీద కన్నేసిన కొందరు స్కామ్‌కు తెరలేపారు. ఎంవీవీ సత్యనారాయణరావు అనే పేరు ఉన్న వ్యక్తిని తెర మీదకు తెచ్చారు. పూర్తి పేరు ముడగుల వీర వెంకట సత్యనారాయణ. తను 2014లోనే చనిపోయాడని డెత్ సర్టిఫికెట్ సంపాదించారు. ఆయన వారసుడిగా ఎం.వరప్రసాద్‌ను రంగంలోకి దించారు. వరప్రసాద్ నుంచి 2024 జనవరిలో నలుగురు దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అందులో రవీంద్రకుమార్, పి.ప్రశాంత్‌తో పాటు మాజీ మంత్రి అనుచరుడు నీలం గౌడ్, హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ భార్య హరి రజని కూడా ఉన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చివరి నిమిషంలో ఇబ్బంది రాకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో అసలు భూమి యజమాని అయిన ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ మీద నకిలీ అంటూ ఫిర్యాదు చేశారు. నిబంధనలను పాటిస్తే ఈ రిజిస్ట్రేషన్ అయ్యేదే కాదు. అసలు ఎంవీవీ సత్యనారాయణ మరణ ధ్రువీకరణ పత్రం సరైందేనా అన్నది సబ్ రిజిస్ట్రార్ చూసుకోలేదు. వారసుడినంటూ పత్రాలు సమర్పించిన ఎం.వరప్రసాద్ ఆధార్, ఈ కేవైసీలను చెక్ చేసినా బండారం బయట పడేది. నిజానికి సబ్ రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్ ఈ కేవైసీ పరిశీలించారు. ఆధార్ కార్డు మీద ఈ కెవైసీ తీస్తే దేవాంగుల వీర వెంకట వర ప్రసాద్ అని వచ్చింది. పేరు తేడా ఉంది కాబట్టి రిజిస్ట్రేషన్ ఆపేయాలి. ఇక్కడే శంకరపల్లి సబ్ రిజిస్ట్రార్ వీళ్లకు ప్రాయశ్చిత్తం చూపించారు. ఎం.వరప్రసాద్ అన్నా దేవాంగుల వీర వెంకట వర ప్రసాద్ అన్నా తానేనని వరప్రసాద్ నుంచి డిక్లరేషన్ తీసుకుని రిజిస్ట్రేషన్ కానిచ్చేశారు. వరప్రసాద్‌ను రంగంలోకి దించిందే హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కావడంతో చెక్‌లిస్ట్‌లేవీ పని చేయలేదు. వ్యక్తి మారినా రూ.60 కోట్ల విలువ చేసే ఆస్తిని బదిలీ చేయడం సంచలనంగా మారింది. అసలు భూమి యజమాని పత్రాలను, నాలా సర్టిఫికెట్‌ను వాడారు. మరణధ్రువీకరణ పత్రానికి వచ్చేసరికి మరో ఎంవీవీ సత్యనారాయణను దించారు. కంపెనీని పోలిన కంపెనీని సృష్టించి, పాన్ కార్డు పెట్టి పని కానిచ్చారు. ఎంవీవీ సత్యనారాయణ మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్న ప్రొగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్‌ను 2005లో కాకినాడలో రిజిస్టర్ చేశారు. ఈ సంస్థను తామే స్థాపించినట్లు వరప్రసాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సర్టిఫికెట్ సమర్పించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం వివరాలు తెప్పించగా 7-4-2006న పాన్ కార్డు జనరేట్ అయినట్లు ఉంది. వరప్రసాద్ ముఠా ఇచ్చిన నకిలీ పాన్‌కార్డు 8-8-2023లో జనరేట్ అయింది. మరణ ధ్రువీకరణ పత్రం కాకినాడ నుంచి ఒకటి, పశ్చిమ గోదావరి జిల్లా తేలప్రోలు నుంచి మరోటి తీసుకున్నట్లు సమర్పించారు. ఆ రెండూ నకిలీవని భూ యజమాని ఆర్టీఐ ద్వారా సంపాదించారు.

మరణించాక నాలా ఎలా?

వ్యవసాయేతర భూమి రిజిస్ట్రేషన్‌కు నాలా సర్టిఫికెట్ తప్పనిసరి. వరప్రసాద్ ముఠా నాలా సర్టిఫికెట్‌ను సమర్పించింది. అసలు ఎంవీవీ సత్యనారాయణ చేయించుకున్న నాలా సర్టిఫికెట్ జిరాక్స్ తీసి పెట్టారు. మడుగుల వీర వెంకట సత్యనారాయణ నాలా సర్టిఫికెట్ తీసుకొని ఉంటే 2014 లోపే చేయించి ఉండాలి. వారసుడిగా వరప్రసాద్ నాలా చేయించాలంటే భూమి తన పేరిట మారాకే చేయించుకోవాలి. ఇంతా చేసి నాలా సర్టిఫికెట్లో పూర్తి పేరు ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ అని ఉంది. ఇది చూసినా సబ్ రిజిస్ట్రార్‌కు అనుమానం రావాలి. రాలేదు.

లేఖ రాసి చేతులు దులుపుకొన్నారు

దొంగ రిజిస్ట్రేషన్ల ముఠా అంతటితో ఆగలేదు. భూమి అసలు యజమాని ఎంవీవీ సత్యనారాయణపై జనవరి 12న శంకరపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆయనే నకిలీ అని, తన తండ్రి భూమిని వేరేవారికి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేశాడని వరప్రసాద్ ఫిర్యాదు చేశారు. రుజువుగా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం అందజేశారు. దాంతో సీఐ జనవరి 17న కాకినాడలో ఉన్న ఎంవీవీ సత్యనారాయణను పిలిపించారు. నకిలీ దస్తావేజులతో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ హెచ్చరించారు. ఈ లోగా జనవరి 20న ముఠాలోని నలుగురి పేరిట భూమి రిజిస్ట్రేషన్ పూర్తయింది. స్టేషన్‌కు పిలిచిన తర్వాత భూమి యజమానికి ఏదో జరుగుతోందని అర్థమైంది. శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ దగ్గరకు వెళ్లి నిలదీశారు. దాంతో పొరపాటు జరిగిందని సబ్ రిజిస్ట్రార్ అంగీకరించారు. విచారణ జరపాలంటూ పోలీసులకు లేఖ రాశారు. రిజిస్ట్రేషన్ జరిగింది తప్పుడు డాక్యుమెంట్‌తో అని చెబుతున్నారని, నిజానిజాలు దర్యాప్తు చేసి చెప్పాలని పోలీసులకు ఫిబ్రవరి1న రాసిన లేఖలో పేర్కొన్నారు.

సాహిల్ ర్యాష్ డ్రైవింగ్ కేసుపై స్టేకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ ర్యాష్ డ్రైవింగ్ కేసు దర్యాప్తుపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. గత ఏడాది డిసెంబర్ 24న బేగంపేట్ ప్రజాభవన్ వద్ద మితిమీరిన వేగంతో బారికేడ్లను ఢీకొట్టిన వ్యవహారంపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు నుంచి ఎమ్మెల్యే కుమారుడ్ని తప్పించి కుట్రపూరితంగా డ్రైవర్ అబ్దుల్ ఆసిఫ్‌ను నిందితుడిగా చేర్చేందుకు ప్రయత్నించిన నిజామాబాద్, పంజాగుట్ట సీఐలు సైతం ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ కేసును కొట్టివేయాలంటూ మాజీ ఎమ్మెల్యే షకీల్, డ్రైవర్ అబ్దుల్ ఆసిఫ్ సహా మొత్తం ఆరుగురు నిందితులు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వివేకానంద వాదనలు వినిపిస్తూ.. చిన్న కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చాలా మందిని పోలీసులు నిందితులుగా చేరుస్తున్నారని, ఇందుకు వారిపై వస్తున్న ఒత్తిళ్లే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ కొంతమంది పోలీసుల సహాయం తీసుకుని చట్టం నుంచి తప్పించుకుని దుబాయికి పారిపోయారని పేర్కొన్నారు. దుబాయిలో ఉండి స్థానిక న్యాయవాదులకు వకాలత్ ఇవ్వడం చెల్లదని తెలిపారు. పీపీ వాదనల్లోని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 9కి వాయిదా వేసింది.

రేవంత్‌ను ప్రశ్నించే నైతికత నీకెక్కడిది?

- భద్రాద్రి శ్రీరాముడికి మీ అన్న కొడుకు ఏ హోదాలో పట్టువస్త్రాలు తీసుకెళ్లాడు?
- ఎమ్మెల్సీ కవితపై కొండాసురేఖ ఆగ్రహం



హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: ఇంద్రవెల్లి సభపై సీఎం రేవంత్‌ను ప్రశ్నించే నైతికత ఎమ్మెల్సీ కవితకు ఎక్కడిదని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. దోపిడీలు, అవినీతితో సాగిన బీఆర్ఎస్ పాలనను, లిక్కర్ కేసు అక్రమాలను జనం మరువలేదని కవిత గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. హనుమకొండలో ఆమె మాట్లాడారు. ఇంద్రవెల్లి సభతో రేవంత్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని కవిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 'ఏ హోదాలో మీ అన్న కొడుకు భద్రాద్రి శ్రీరాముడికి పట్టువస్త్రాలు తీసుకెళ్లాడో సమాధానం ఇవ్వాల'ని కవితను ప్రశ్నించారు. బీజేపీతో ఒప్పందం వల్లే కవిత లిక్కర్ కేసు నుంచి తప్పించుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో మరో రెండింటి ప్రకటన సమయంలో ప్రియాంకా గాంధీ రాష్ట్రానికి వస్తారని రేవంత్‌రెడ్డి చెప్పడంలో కవితకు అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు కవితకు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు సంగతి గుర్తుకు రాలేదా అని అడిగారు.

ప్రియాంకను ఎవరు అడ్డుకుంటారో చూస్తాం: మహేశ్‌గౌడ్

సోనియా, ప్రియాంకా గాంధీ తెలంగాణకు కచ్చితంగా వస్తారని.. వారిని ఎవరు అడ్డుకుంటారో చూస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేస్తే దేశం నిలబడిందని చెప్పారు. ప్రియాంక గురించి మాట్లాడే స్థాయి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు లేదన్నారు. సీఎం రేవంత్‌పై కవిత మాట్లాడిన తీరు.. బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

వైఎస్‌కు మచ్చ తెచ్చేలా జగన్ పాలన: సురేఖ

ఏపీ సీఎం జగన్ పాలన ఆయన తండ్రి రాజశేఖర్‌రెడ్డికి మచ్చ తెచ్చేలా ఉందని కొండా సురేఖ విమర్శించారు. సొంత చెల్లి షర్మిలే జగన్‌ను వ్యతిరేకిస్తోందంటే ఆయన వ్యక్తిత్వం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. అధిష్ఠానం ఆదేశిస్తే ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు.

సొంత చెల్లిని అవమానిస్తుంటే జగన్‌కు పట్టదా?: వీహెచ్

పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు మాట్లాడుతూ.. సొంత చెల్లికి అవమానం జరుగుతుంటే జగన్‌కు పట్టించుకునే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. షర్మిల, సునీతపైన ప్రేమలేని ఆయన.. మహిళా సాధికారిత గురించి మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. 'షర్మిల వైఎస్ కూతురు కాదంటూ ఆమెపై పోస్టర్లు వేస్తుంటే జగన్ ఎందుకు మౌనంగా ఉంటున్నారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు ఒక చెల్లిగా షర్మిల మద్దతుగా నిలబడలేదా..? సొంత బాబాయి కూతురు సునీతను చంపుతామంటూ బెదిరింపులు వస్తున్నా జగన్ చప్పుడు చేయట్లేదు. రాజకీయాల కోసం జగన్ ఇంతగా దిగజారుతారా..' అని ఘాటుగా విమర్శించారు.

అధికారిక కార్యక్రమాలకు ప్రియాంకను ఎలా పిలుస్తారు?

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు

ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం మాకు లేదు: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రూ.500కు గ్యాస్ సిలిండర్ హామీ అమలుకు ప్రభుత్వపరంగా కార్యక్రమా న్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీని ఆహ్వానిస్తామని సీఎం చెప్పారని, ఆమెను ఏ హోదా లో అధికారిక కార్యక్రమాలకు పిలుస్తారని ప్రశ్నించారు. ఝార్ఖండ్ ఎమ్మెల్యేల క్యాంపు కోసం అయ్యే ఖర్చును కాంగ్రెస్ భరిస్తుందా.. లేక ప్రభుత్వ నిధులు వెచ్చిస్తున్నారా? చెప్పాలని డిమాండ్ చేశారు. ఎప్పుడూ కేసీఆర్ కుటుంబంపై ఏడ్చే సీఎం రేవంత్.. రాష్ట్రంలో 22 కుటుంబాలకు చెందిన నేతలకు కాంగ్రెస్ నుంచి టికెట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెసోళ్లు ఇప్పటికైనా తప్పులు తెలుసుకొని ఇంద్రవెల్లి అమరుల కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెప్పడం మంచి పరిణామమని, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులకు కూడా సీఎం రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము పడగొట్టాల్సిన అవసరం లేదన్నారు. నిజామాబాద్ ఎంపీగా తాను పోటీ చేసే అంశంపై పార్టీ నిర్ణయం మేరకు నడుచుకుంటానని కవిత చెప్పారు. సీఎం రేవంత్‌కు ఇంద్రవెల్లి స్తూపం తాకే హక్కు లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కాంగ్రెస్ తీరు చూ స్తుంటే చంపినోళ్లే సంతాప సభ పెట్టినట్టుగా ఉందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు.

బీఆర్ఎస్‌కు బై బై!

- పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా
- జీవితాంతం బీఆర్ఎస్ టికెట్ ఇచ్చినా తక్కువే
- నన్ను పక్కన పెట్టడం తీవ్రంగా బాధించింది
- ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య
- రాజీనామా లేఖను కేసీఆర్‌కు పంపిన నేత



జనగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరా. ఆ త్యాగానికి బతికి ఉన్నంత కాలం నాకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలి. అలాంటిది నన్ను పక్కన పెట్టారు. చాలా రోజులుగా మానసిక సంఘర్షణకు గురవుతున్నా. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో పార్టీని వీడుతున్నా" అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. హనుమకొండలోని నివాసంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో పదవులు ఒక్కొక్కటిగా వచ్చి పోతున్నాయని, అయినప్పటికీ తాను పార్టీకి విధేయుడిగానే ఉన్నానని చెప్పారు. విధేయతకూ ఒక పరిమితి ఉంటుందని, అది దాటాక కూడా పార్టీలో ఉంటే పిచ్చోడిలా చూస్తారని అన్నారు. తన అనుచరులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తాను గతంలో కాంగ్రెస్ గూటి పక్షినేనని, తనకు కాంగ్రెస్ నేతలతో మంచి సంబంధాలున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన రాజయ్య.. ఆ లేఖను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపారు.

త్వరలోనే కాంగ్రెస్ గూటికి..

రాజయ్య కాంగ్రెస్‌లో చేరే అంశంపై ఇప్పటికే టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహను కలిసి చర్చించినట్లు తెలిసింది. ఈ నెల 10న ఆయన సొంత గూటికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ స్థానం నుంచి టికెట్ ఆశించి రాజయ్య భంగపడ్డారు. దీంతో కొంతకాలంగా ఆయన అసంతృప్తితో ఉన్నారు. 'దళితబంధు' లబ్ధిదారుల నుంచి కమీషన్ల వసూలు, జానకీపురం సర్పంచ్ నవ్య చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. రాజయ్యకు టికెట్ నిరాకరించారు. ఆయన స్థానంలో కడియం శ్రీహరికి అవకాశం ఇచ్చారు.రాజయ్యకు రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్ష పదవిని ఇచ్చారు. పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ లేదా వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధికారం లోకి రాకపోవడంతో రాజయ్య ఏ పదవీ లేకుండా ఉండిపోయారు. కడియం ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి పార్టీ కార్యక్రమాలకు రాజయ్య దూరంగా ఉంటున్నారు. ఇదే క్రమంలో రాజయ్య వర్గానికి చెందిన కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. అయితే, కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు నిశ్చయించుకొనే ఆయన వర్గాన్ని ముందుగానే ఆ పార్టీలోకి పంపారనే ప్రచారం జరుగుతోంది.

13 ఏళ్ల అనుబంధంతో తెగదెంపులు..

ఒకప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్‌తో ఉన్న 13 ఏళ్ల అనుబంధంతో తాటికొండ రాజయ్య తెగదెంపులు చేసుకున్నారు. 2009లో స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో 2011లో కాంగ్రెస్‌ను వీడి అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. అదే సమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా 2012లో జరిగిన ఉప ఎన్నికలో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, వైద్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆ రెండు పదవులనూ పోగొట్టుకున్నారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

అభిమానమా... ఉన్మాదమా?

రాజకీయ పార్టీలకు కార్యకర్తలు, అభిమానులు ఉంటారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి వేరు! ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ ముహూర్తంలో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారోగానీ, అప్పటి నుంచి ఆయనకు మద్దతుగా ఉన్మాద మూక పోగైంది. తమ నాయకుడిపై ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టడంలో తప్పు లేదుగానీ అభిమానం కాస్తా ఉన్మాదంగా మారి ఇళ్లలోని ఆడవాళ్లను కూడా బజారుకు ఈడ్చే దుష్ట సంస్కృతి జగన్ పాలనలో జరగడం దారుణం! ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వ హననంతో మొదలైన ఈ దాడి... ఇప్పుడు రాజశేఖర రెడ్డి కుటుంబంలోని అడవాళ్లకు కూడా చుట్టుకుంది. తల్లితోపాటు చెల్లెళ్ల వ్యక్తిత్వాలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నప్పటికీ ముఖ్యమంత్రి బెల్లం కొట్టిన రాయిలా మౌనంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిండు శాసనసభలో తన సతీమణిని కించపరచడంతో ఆ బాధను భరించలేక అప్పట్లో చంద్రబాబు

> వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని రక్షించడం కోసం జగన్ చేసిన ప్రయత్నాలు తెలియనివి కావు. అవినీతి కేసులలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాను, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత సోరెన్‌ను అరెస్టు చేయగలిగిన సీబీఐ అధికారులు వివేకానంద రెడ్డి కేసులో అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయడానికి వెళ్లి ఉత్త చేతులతో తిరిగి వచ్చారంటే జగన్ ప్రయత్నాలు ఎంతగా ఫలించాయో అర్థం చేసుకోవచ్చు. ఆయన మేకవన్నె పులి కనుకే తనను సవాలు చేస్తున్న చెల్లెళ్ల పైకి సోషల్ మీడియాలోని కిరాయి మూకలను ఉసిగొల్పుతున్నారు. నిన్నటి వరకు తెలంగాణలో జగన్ అనుకూల కేసీఆర్ ప్రభుత్వం ఉన్నందున సోషల్ మీడియా వికృతాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున డాక్టర్ సునీత శుక్రవారం నాడు చేసిన ఫిర్యాదుపై తెలంగాణ పోలీసులు స్పందిస్తారని ఆశిద్దాం!

నాయుడు విలపించడాన్ని చూశాం! అప్పుడు కూడా జగన్మోహన్ రెడ్డి నోరు మెదపలేదు. తనకోసం పనిచేస్తున్న సోషల్ మీడియా కిరాయి సైన్యాన్ని నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు జగన్‌కు వ్యతిరేకంగా ఆయన సొంత చెల్లి షర్మిల నోరు విప్పడంతో ఆమెను కూడా టార్గెట్ చేసుకున్నారు. జగన్‌కూ, ఆయన భార్య భారతి రెడ్డికీ వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే ఆగమేఘాలమీద స్పందించే సీఐడీ అధికారులు ఇప్పుడు దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబంలోని మహిళలను కించపరుస్తున్నప్పటికీ నిద్ర నటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంటున్న పోకడలను గమనిస్తే ముఖ్యమంత్రి దంపతులకు మినహా ఆ రాష్ట్రంలో మరెవరికీ పరువు లేదనుకోవాల్సి వస్తుంది. తమ కుటుంబంలోని ఆడపడుచులను ఆదరించి గౌరవించడం రాయలసీమ సంస్కృతి. సీమకు చెందిన రెడ్డి సామాజిక వర్గీయులు తమ ఇంటి ఆడపడుచులనే కాదు, ప్రత్యర్థుల ఇళ్లలోని మహిళలను కూడా గౌరవిస్తారు. కరుడుగట్టిన ఫ్యాక్షనిస్టులు సైతం మహిళలు, పిల్లలకు అపకారం తలపెట్టరు. కానీ, అదే రాయలసీమ నుంచి వచ్చిన జగన్మోహన్ రెడ్డి మాత్రం రక్తం పంచుకుపుట్టిన చెల్లిని కించపరుస్తున్నా, తమ తల్లి శీలాన్నే శంకించే విధంగా పోస్టులు పెడుతున్నా కిమ్మనకపోవడం వింతగా ఉంది.

హద్దుల్లేని అరాచకం...

జగన్‌రెడ్డి రాజకీయాలలోకి వచ్చిన నాటి నుంచే ఆయనకు చెందిన సోషల్ మీడియా సైన్యం హద్దూ అదుపు లేకుండా వ్యవహరిస్తోంది. అతగాడు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ ఉన్మాద మూక వాచాలత్వానికి అంతులేకుండా పోయింది. రాజశేఖర రెడ్డి ఆకస్మిక మరణంతో ప్రజల్లో నెలకొన్న సానుభూతిని సొమ్ము చేసుకొని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి... ఇప్పుడు తన తల్లి శీలాన్ని సైతం శంకించే విధంగా పోస్టులు పెడుతున్నా చర్యలు తీసుకోక పోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు స్వీకరించాక జగన్‌కు చెందిన కిరాయి మూక ఆమెను టార్గెట్ చేసుకుంది. ఈ దాడి ఎంత దూరం వెళ్లిందంటే, షర్మిల అసలు రాజశేఖర రెడ్డికే పుట్టిందా? అని శంకించే వరకూ వెళ్లారు. షర్మిల పుట్టుకను శంకించడం అంటే రాజశేఖర రెడ్డి భార్య విజయమ్మ శీలాన్ని శంకించడమే కదా? తన తల్లిని అంతగా అవమానిస్తున్నప్పటికీ జగన్‌రెడ్డి స్పందించకపోవడాన్ని బట్టి అతనిలో మానవత్వం ఉందా? అన్న అనుమానం కలగడం సహజం. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న హీనమైన దాడిని చూసి షర్మిల కుమిలి పోతున్నారు. ఆమె తెలంగాణలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకొని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్రమైన విమర్శలు చేసినప్పటికీ ఆమె వ్యక్తిత్వం గురించి ఎవరూ పల్లెత్తు మాట అనలేదు. షర్మిల ఎప్పుడైతే తెలంగాణను వదిలేసి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ తరఫున జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టారో... అప్పటి నుంచి ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. జగన్ మద్దతుదారులుగా ఉంటున్న ఉన్మాద మూక ఆమెను హీనాతిహీనంగా కించపరుస్తూ పోస్టులు పెడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ దాడి జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి చీమ కుట్టినట్టయినా లేదు. రాష్ట్ర ప్రజలు అందరూ తనను 'జగనన్నా' అని పిలవాలని కోరుకుంటున్న జగన్‌రెడ్డి, తనను యాభై ఏళ్లుగా 'అన్నా' అని పిలుస్తూ కలసిమెలసి ఆడుతూ పాడుతూ గడిపిన సొంత చెల్లెళ్లు తమను అవమానిస్తున్నారని రోదిస్తున్నప్పటికీ పట్టించుకోకుండా షిక్కటి షిరునవ్వులు చిందించడం ఎలా సాధ్యం? 'ఆదుకో అన్నా!' అని ఆర్తనాదం వినిపించినప్పుడు ఎంతటి పాషాణ హృదయమైనా కరుగుతుంది, స్పందిస్తుంది. ఒక బ్రాహ్మణుడిని పెళ్లి చేసుకున్న షర్మిల 'రెడ్డి' కాబోదనే మరో దిక్కుమాలిన వాదాన్ని కూడా తెరపైకి తెచ్చారు. బ్రాహ్మణులైతే రాజకీయాలకు పనికిరారా? ప్రకాశం పంతులు రాజకీయాల్లో ఎంతటి ఉన్నత విలువలు నెలకొల్పారో ఈ వీధి కుక్కలకు తెలియకపోవడంలో ఆశ్చర్యపోవాల్సింది లేదు. పెళ్లి తర్వాత ఆడపిల్ల ఇంటి పేరు మారుతుంది. అయితే, అదేమీ రూల్ కాదు. పుట్టింటి వారి ఇంటిపేరునే కొనసాగించుకొనే హక్కు ఆడపిల్లలకు ఉంటుంది. షర్మిలను ఇప్పుడు 'షర్మిల శాస్త్రి' అని కించపరుస్తున్న వారు ఒక విషయం మర్చిపోతున్నారు. జగన్మోహన్ రెడ్డి తరఫున బైబిల్ పట్టుకొని మరీ ప్రచారం చేస్తున్న ఆయన మేనత్త విమల తనను తాను వైఎస్ విమలా రెడ్డిగానే చెప్పుకుంటున్నారు కదా? జగన్ తరఫున ప్రచారం చేసే వారు మాత్రమే రెడ్డి అనే తోక తగిలించుకోవడానికి అర్హులా? నిజానికి విమల ఒక దళితుడిని వివాహం చేసుకున్నారు. అయినా, ఆమె తన ఇంటి పేరును వైఎస్ గానే చెప్పుకొంటున్నారు. 'వైఎస్ విమలారెడ్డి'గానే చెలామణి అవుతున్నారు. విమలకు ఒక రూల్, షర్మిలకు మరో రూల్ ఎందుకు? విమలకు వివాహం చేసినప్పుడు ఆ కుటుంబానికి ఇంత సంపద లేదు. అయినప్పటికీ తమ ఏకైక సోదరి విమలకు హైదరాబాద్‌లో ఒక పెద్ద ఇల్లును, విజయవాడలోని రాజ్–యువరాజ్ థియేటర్లలో వాటాను రాజశేఖర రెడ్డి, వివేకానంద రెడ్డి ఆనందంగా పంచి ఇచ్చారు. రాయలసీమ సంస్కృతి అంటే ఇదీ! అదే కుటుంబం నుంచి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? ఆస్తుల్లో తన వాటా పంచి ఇవ్వాలని షర్మిల మొత్తుకుంటున్నప్పటికీ జగన్‌రెడ్డి తిరస్కరించడం నిజం కాదా? ఆస్తుల పంపకంలో మొదలైన వివాదం ఇప్పుడు రాజకీయ వైరంగా మారింది. అంతే, జగన్‌కు వత్తాసు పలుకుతున్న ఉన్మాద మూక ఊర కుక్కల్లా మొరగడం మొదలుపెట్టింది. సీమ పౌరుషం, ప్రతాపం అంటే ఇదేనా జగన్‌రెడ్డీ?

అన్నా... అని పిలిచినా!

నిండు సభలో ద్రౌపది వస్త్రాపహరణాన్ని నిలువరించలేక పోయినందుకు భీష్ముడు జీవితాంతం కుమిలిపోయాడు. చివరకు మరణాన్ని స్వయంగా ఆహ్వానించి ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు. ఇప్పుడు తన తల్లిని, చెల్లిని దారుణంగా అవమానిస్తున్నప్పటికీ నిలువరించే ప్రయత్నం చేయని జగన్ ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు? రాయలసీమ సంస్కృతిని పక్కనపెడితే, ఒక మనిషిగా అయినా జగన్‌రెడ్డి స్పందించాలి కదా! రాజకీయంగా విభేదించినంత మాత్రాన షర్మిల సహోదరి కాకుండా పోతుందా? "తల్లినీ, చెల్లెళ్లనూ తిడుతున్నా చేతులు దులుపుకొంటారా? జగనన్నా, నీకు బాధ్యత లేదా?" అని వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి వేస్తున్న ప్రశ్నల్లో ఆవేదన కనిపిస్తోంది. తన తండ్రిని దారుణంగా చంపించిన వాళ్లను జగన్‌రెడ్డి రక్షిస్తున్నారని తెలిసినా డాక్టర్ సునీత ఆయనను 'అన్నా' అనే పిలుచుకుంటున్నారు. తనకు ప్రాణహాని ఉందని ఆమె మొరపెట్టుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా దాడి జరుగుతున్నా అక్కడి పోలీసులు న్యాయం చేస్తారన్న నమ్మకంలేక డాక్టర్ సునీత సైబరాబాద్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఇది అవమానం కాదా? 'శత్రు శేషం ఉండకూడదు! షర్మిల, సునీతలను కూడా లేపెయ్ అన్నా' అని ఉన్మాద మూక జగన్‌రెడ్డిని కోరడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అంటే, జగన్ కనుసన్నల్లో లేదా ఆయనకు తెలిసే వివేకానంద రెడ్డి హత్య జరిగిందని ఉన్మాద మూక కూడా నమ్ముతున్నట్టే కదా? వివేకాను చంపినట్టు షర్మిల, సునీతను కూడా చంపేస్తే శత్రు శేషం ఉండదనుకోవడం వారి కిరాతక మనస్తత్వానికి నిదర్శనం కాదా? ఇంత జరుగుతున్నా పౌర సమాజం తమకు ఏమీ పట్టనట్టుగా ఉండిపోవడం బాధాకరంగా ఉంది. చంద్రబాబు సతీమణిని అవమానించినప్పుడు అది ఆయన సమస్య అని సరిపెట్టుకున్నారు. ఇప్పుడు దివంగత రాజశేఖర రెడ్డి కుటుంబంలోని ఆడవాళ్లను అవమానిస్తున్నా దాన్ని వారి సమస్యగానే చూస్తున్నారు. మహిళల పట్ల జగన్ ప్రభుత్వానికి ఉన్న నీచాభిప్రాయంగా ఈ సంఘటనలు నిలువడం లేదా? రాజశేఖర రెడ్డిని ఇంద్రుడు, చంద్రుడు అని పొగుడుతున్న వాళ్లు కూడా... ఇప్పుడు ఆయన సతీమణి శీలాన్ని శంకించే విధంగా పోస్టులు పెట్టడాన్ని ప్రశ్నించకపోవడం ఏమిటి? రాజశేఖర రెడ్డి అమితంగా ఇష్టపడే షర్మిలను సైతం చంపేయాలని రెచ్చగొడుతున్నప్పటికీ మౌనంగా ఉండటం ఏమిటి? ఆంధ్రప్రదేశ్ పౌర సమాజం ఇంత నిస్తేజంగా ఎందుకు మారిపోయింది? రాజకీయాల్లోకి ఉన్మాద సంస్కృతిని ప్రవేశపెట్టడాన్ని ప్రతిఘటించాల్సిన అవసరం లేదా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను బలంగా ప్రభావితం చేసిన వారిలో చంద్రబాబు నాయుడు, రాజశేఖర రెడ్డి ముందు వరుసలో ఉంటారు. ఆ కుటుంబాలలోని మహిళలకే రక్షణ లేకుండాపోతే ఇక సామాన్య మహిళల రక్షణ ఎలా? ఇంత జరుగుతున్నప్పటికీ స్పందించని జగన్‌కు తనను అందరూ 'అన్నా' అని పిలవాలని కోరుకునే హక్కు ఉందా? రాజశేఖర రెడ్డిని అభిమానించే వారు ఈ చర్యలను సమర్థిస్తారా?

> రాజశేఖర రెడ్డిని ఇంద్రుడు, చంద్రుడు అని పొగుడుతున్న వాళ్లు కూడా... ఇప్పుడు ఆయన సతీమణి శీలాన్ని శంకించే విధంగా పోస్టులు పెట్టడాన్ని ప్రశ్నించకపోవడం ఏమిటి? రాజశేఖర రెడ్డి అమితంగా ఇష్టపడే షర్మిలను సైతం చంపేయాలని రెచ్చగొడుతున్నప్పటికీ మౌనంగా ఉండటం ఏమిటి? ఆంధ్రప్రదేశ్ పౌర సమాజం ఇంత నిస్తేజంగా ఎందుకు మారిపోయింది?

వైఎస్ వారసుడి లక్షణాలు ఇవేనా?

రాజశేఖర రెడ్డి వారసుడు జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని ఉన్మాద మూక ప్రచారం చేస్తున్న విషయానికి వద్దాం! రాజశేఖర రెడ్డి తన అధికారానికి అడ్డు వస్తారనుకున్న వారిని మాత్రమే ప్రత్యర్థులుగా పరిగణించే వారు. సదరు ప్రత్యర్థులపై విమర్శలు చేసేవారే కానీ ఇలా వాళ్ల ఇళ్లలోని ఆడవారిపైకి తన మద్దతుదారులను ఉసిగొల్పలేదే? ఇప్పుడు తన వారసుడి చర్యల కారణంగా తన సతీమణి శీలపరీక్షకు నిలవాల్సి వస్తుందని రాజశేఖర రెడ్డి కలలో కూడా ఊహించి ఉండరు. షర్మిల రాజశేఖర రెడ్డికే పుట్టిందని విజయమ్మ చెప్పుకోవాలా? ఇంతకంటే అవమానం, అపచారం ఉంటుందా? షర్మిల తన తండ్రి రక్తం పంచుకొని పుట్టలేదని జగన్మోహన్ రెడ్డి చెప్పగలరా? జగన్ నిజంగా రాజశేఖర రెడ్డి రాజకీయ వారసుడే అయితే దివంగత నేత కుటుంబంలోని ఆడవాళ్లకు అతడే పెద్ద దిక్కు అవుతాడు కదా? అయినా తాను ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో తమకు రక్షణ లేదని ఆయన చెల్లెళ్లు రోదించడం ఏమిటి? ఈ పరిస్థితికి కారకుడైన జగన్‌ను ముఖ్యమంత్రిగానే కాదు ఒక మనిషిగా గుర్తించి గౌరవించాలన్నా ఇబ్బందిగా ఉంటోందని ఎవరైనా అంటే ఎందుకు అభ్యంతర పెట్టాలి? రాజకీయాల్లో ఇంతటి నీచ సంస్కృతిని ప్రవేశపెడుతున్న జగన్ చివరకు సాధించబోయేది ఏమిటి? కుటుంబ సభ్యుల ఆర్తనాదాలనే ఆలకించని మనిషి ప్రజల ఆర్తనాదాలను పట్టించుకుంటారని అనుకోవడం అత్యాశే అవుతుంది. తండ్రిని మించిన తనయుడిని అనిపించుకుంటానంటే ఏమో అనుకున్న వాళ్లు ఇప్పుడు ముక్కున వేలేసుకుంటున్నారు. తమకు తెలిసిన జగన్ వేరు, అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ వేరు అన్న షర్మిల వ్యాఖ్యల్లో అర్థం లేకపోలేదు. తన పుట్టుకను సైతం బజారుకీడ్చడంతో తొలుత రోదించిన షర్మిల ఇప్పుడు మనసుకు సర్దిచెప్పుకొని 'ఏం పీక్కుంటారో పీక్కోండి. నేను వెనక్కి తగ్గేది లేదు' అని సవాలు చేసే స్థితికి వచ్చారు. జగన్ ఇంట్లో కూడా ఆడవాళ్లు ఉన్నారు. అధికారంలో ఉన్నందువల్ల ఇప్పుడు సోషల్ మీడియా నుంచి వారికి రక్షణ లభిస్తుండవచ్చు. రేపు అధికారం కోల్పోతే వారి పరువును మాత్రం బజారుకు ఈడ్వరన్న గ్యారంటీ ఏమిటి? రాజశేఖర రెడ్డి జీవించినంత కాలం ఆయన కుటుంబ సభ్యులు తలెత్తుకొని బతికారు. ఇప్పుడు ఆయన భార్య, కూతురు పరువు బజారున పడింది. ఇంతకంటే విషాదం ఉంటుందా? ఆడపడుచుల ఆక్రందనకు ప్రభుత్వం స్పందించకపోయినా పౌరసమాజం అయినా స్పందిస్తుందని కోరుకుందాం!

> రాజశేఖర రెడ్డి తన అధికారానికి అడ్డు వస్తారనుకున్న వారిని మాత్రమే ప్రత్యర్థులుగా పరిగణించే వారు. సదరు ప్రత్యర్థులపై విమర్శలు చేసేవారే కానీ ఇలా వాళ్ల ఇళ్లలోని ఆడవారిపైకి తన మద్దతుదారులను ఉసిగొల్పలేదే? ఇప్పుడు తన వారసుడి చర్యల కారణంగా తన సతీమణి శీలపరీక్షకు నిలవాల్సి వస్తుందని రాజశేఖర రెడ్డి కలలో కూడా ఊహించి ఉండరు. షర్మిల రాజశేఖర రెడ్డికే పుట్టిందని విజయమ్మ చెప్పుకోవాలా? ఇంతకంటే అవమానం, అపచారం ఉంటుందా? షర్మిల తన తండ్రి రక్తం పంచుకొని పుట్టలేదని జగన్మోహన్ రెడ్డి చెప్పగలరా? జగన్ నిజంగా రాజశేఖర రెడ్డి రాజకీయ వారసుడే అయితే దివంగత నేత కుటుంబంలోని ఆడవాళ్లకు అతడే పెద్ద దిక్కు అవుతాడు కదా? అయినా తాను ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో తమకు రక్షణ లేదని ఆయన చెల్లెళ్లు రోదించడం ఏమిటి? ఈ పరిస్థితికి కారకుడైన జగన్‌ను ముఖ్యమంత్రిగానే కాదు ఒక మనిషిగా గుర్తించి గౌరవించాలన్నా ఇబ్బందిగా ఉంటోందని ఎవరైనా అంటే ఎందుకు అభ్యంతర పెట్టాలి?



ఇదీ అసలు స్వరూపం...

పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత షర్మిల తన సోదరుడైన జగన్ పాలనపైన నేరుగా విమర్శలు చేయడంతోపాటు ఆయన నిజ స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నారు. 'రాయలసీమ పౌరుషం, పులివెందుల పులి' అని జగన్‌రెడ్డిని ఆయన మద్దతుదారులు శ్లాఘిస్తూ ఉంటారు. అయితే ఆయన 'పులి కాదు పిల్లి' అని ఇప్పుడు షర్మిల బయటపెట్టిన రహస్యంతో స్పష్టమవుతోంది. ఒకప్పుడు దేశంలోనే అత్యంత బలవంతురాలిగా ఉన్న సోనియాగాంధీని ధిక్కరించి మరీ జగన్ అధికారంలోకి వచ్చారని ఇప్పటిదాకా జరిగిన ప్రచారం బోగస్ అని షర్మిల మాటలతో తేలిపోయింది. జైలులో ఉన్నప్పుడు తనకు బెయిల్ కోసం సహకరించవలసిందిగా సోనియాగాంధీ వద్దకు జగన్‌రెడ్డి తన భార్య భారతీ రెడ్డిని రాయబారం పంపారని షర్మిల చెప్పకనే చెప్పారు. జగన్‌కు బెయిల్ కోసం సోనియా వద్దకే కాదు— అప్పట్లో ఆమెకు సలహాదారుడుగా ఉన్న అహ్మద్ పటేల్‌ను విజయమ్మ, భారతీ రెడ్డి పలుమార్లు కలసి వేడుకున్నట్టు అప్పట్లోనే కొందరికి తెలుసు. అయితే శంఖంలో పోస్తేనే తీర్థం అవుతుందన్నట్టుగా... 'నా భర్తతో కలసి భారతి.. సోనియాగాంధీ వద్దకు వెళ్లలేదా? నన్ను ముఖ్యమంత్రిని చేయాలని అప్పుడు నేను సోనియాకు నా భర్త ద్వారా ప్రతిపాదన పంపానా? సోనియా వద్ద ఏమి జరిగిందో భారతీ రెడ్డి చెప్పగలరా?' అని షర్మిల సూటిగా సవాలు చేయడంతో అప్పుడు తెర వెనుక ఏమి జరిగిందో తెలుస్తోంది. ఆనాడు సోనియా వద్దకు తన కుటుంబ సభ్యులను పంపిన జగన్‌రెడ్డి కాళ్ల బేరానికి దిగారని ఇప్పుడు స్పష్టం అవుతోంది. తనకు బెయిల్ ఇప్పిస్తే తన మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని జగన్ ప్రతిపాదన కూడా పంపారు. కేవలం బెయిల్ కోసం కాళ్ల బేరానికి దిగిన జగన్‌రెడ్డి 'పులివెందుల పులి' ఎలా అవుతారు? అతడొక పిల్లి మాత్రమే! ఇప్పుడు తన బెయిల్ రద్దు కాకుండా ఉండటం కోసం, తన కేసుల విచారణ ముందుకు సాగకుండా ఉండేందుకు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు ఊడిగం చేయడం నిజం కాదా? రాష్ట్ర ప్రయోజనాలు గాలికి పోయినా ఫర్వాలేదు— తనకు రక్షణ కల్పిస్తే చాలు అని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా వద్ద మోకరిల్లడం నిజం కాదా? ఇలాంటి మనిషికి 'పులి' అంటూ భుజకీర్తులు తగిలించడం హాస్యాస్పదంగా ఉంటుంది. మడమ తిప్పడంలో కూడా జగన్ రికార్డు సృష్టించారు. గతంలో సోనియా వద్ద, ఇప్పుడు మోదీ–షాల వద్ద మడమ తిప్పుతూనే ఉన్నారు. అందుకే కాబోలు ఆయన కాలి మడమ తరచూ బెణుకుతూ ఉంటుంది. వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని రక్షించడం కోసం జగన్ చేసిన ప్రయత్నాలు తెలియనివి కావు. అవినీతి కేసులలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాను, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయగలిగిన సీబీఐ అధికారులు వివేకానంద రెడ్డి కేసులో అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయడానికి వెళ్లి ఉత్త చేతులతో తిరిగి వచ్చారంటే జగన్ ప్రయత్నాలు ఎంతగా ఫలించాయో అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ గమనిస్తే జగన్‌రెడ్డి నిజమైన పులి కాదు – మేకవన్నె పులి మాత్రమే అని భావించవచ్చు. ఆయన మేకవన్నె పులి కనుకే తనను సవాలు చేస్తున్న చెల్లెళ్ల పైకి సోషల్ మీడియాలోని కిరాయి మూకలను ఉసిగొల్పుతున్నారు. నిన్నటి వరకు తెలంగాణలో జగన్ అనుకూల కేసీఆర్ ప్రభుత్వం ఉన్నందున సోషల్ మీడియా వికృతాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున డాక్టర్ సునీత శుక్రవారం నాడు చేసిన ఫిర్యాదుపై తెలంగాణ పోలీసులు స్పందిస్తారని ఆశిద్దాం! సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వికృత మూకకు కూడా కుటుంబాలు ఉంటాయి. ఈ వికృత వ్యాఖ్యలు, పోస్టులు, వీడియోలను వాళ్ల ఇళ్లలోని ఆడవారు ఎలా సహిస్తున్నారో తెలియదు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నప్పటికీ ఉన్మాద మూక రాజశేఖర రెడ్డి కుటుంబాన్ని కూడా వదలకుండా వేధిస్తున్నారంటే జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితి ఏమిటో? ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? పోలీసులను సైతం కిరాయి సైనికులుగా మార్చివేసినందున జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలు ప్రాథమిక హక్కులను మరచిపోవాల్సిందే. ఒకప్పుడు థగ్గులు, పిండారీలు గ్రామాలపై పడి దోచుకొనే వాళ్లు. మహిళలను చెరపట్టే వాళ్లు. ఆంధ్రప్రదేశ్‌లో నాటి పరిస్థితులు పునరావృతమైనా ఆశ్చర్యపోవాల్సినది ఉండదు. తస్మాత్ జాగ్రత్త! తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం గద్దె దిగాక పౌర సమాజం ప్రజాస్వామ్య గాలులు పీలుస్తోంది. రానున్న ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రజాస్వామ్య

> నిజానికి విమల ఒక దళితుడిని వివాహం చేసుకున్నారు. అయినా, ఆమె తన ఇంటి పేరును వైఎస్ గానే చెప్పుకొంటున్నారు. 'వైఎస్ విమలారెడ్డి' గానే చెలామణి అవుతున్నారు. విమలకు ఒక రూల్, షర్మిలకు మరో రూల్ ఎందుకు? తమ ఏకైక సోదరి విమలకు హైదరాబాద్‌లో ఒక పెద్ద ఇల్లును, విజయవాడలోని రాజ్–యువరాజ్ థియేటర్లలో వాటాను రాజశేఖర్ రెడ్డి, వివేకానంద రెడ్డి ఆనందంగా పంచి ఇచ్చారు. రాయలసీమ సంస్కృతి అంటే ఇదీ! అదే కుటుంబం నుంచి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? ఆస్తుల్లో తన వాటా పంచి ఇవ్వాలని షర్మిల మొత్తుకుంటున్నప్పటికీ జగన్‌రెడ్డి తిరస్కరించడం నిజం కాదా? ఆస్తుల పంపకంలో మొదలైన వివాదం ఇప్పుడు రాజకీయ వైరంగా మారింది. అంతే, జగన్‌కు వత్తాసు పలుకుతున్న ఉన్మాద మూక ఊర కుక్కల్లా మొరగడం మొదలుపెట్టింది. సీమ పౌరుషం, ప్రతాపం అంటే ఇదేనా జగన్‌రెడ్డీ?

కులగణన విదేశీశక్తుల ఎజెండా!?

ప్రపంచీకరణ నేపథ్యంలో ఏ దేశంలో ఏ సమస్య లేవనెత్తినా దానికి ప్రాంతీయ కారణాలే కాక విదేశీశక్తుల ప్రమేయం ఉంటుంది. ప్రజాస్వామ్య దేశాలు కావచ్చు, నియంతృత్వదేశాలు కావచ్చు వాటిలో జరిగే అనేక సంఘర్షణల వెనుక ఇతరుల పాత్ర ఉంటుంది. మనదేశంలో కులగణన అనే ఆలోచన మన నాయకుల మేధోశిశువా, ఇతరుల పాత్ర ఎంత అని చూడాలి. నేను సామాజిక విశ్లేషకుడిని కాకున్నా ప్రపంచ విషయాల్ని గమనించే వ్యక్తిగా కొన్ని ఆలోచనల్ని ప్రస్తావిస్తున్నాను.


మార్క్సిస్టు సిద్ధాంతంలో వచ్చిన ఒక ముఖ్య పరిణామం సాంస్కృతిక మార్క్సిజం (Cultural Marxism). సంప్రదాయ మార్క్సిజం ఆర్థిక దృష్టి కోణంలో కేవలం వర్గ పోరాటాన్నే ఆయుధంగా వాడుకుంది. కాని అనేక దేశాల్లో ఆర్థిక అసమానతలున్నా వర్గపోరాటాలు జరగలేదు. మార్క్సిస్టు మేధావులు దీనిపై ఆలోచించారు. గ్రాంసీ (Gramsci) అనే ఇటాలియన్ కమ్యూనిస్టు (Cultural hagemony) సాంస్కృతిక పెత్తందారీ అనే భావనను ప్రతిపాదించాడు. ప్రతి సమాజంలోను దాని మూల సంస్కృతిని కాపాడాలనే వర్గం ఒకటి ఉంటుంది. అదే సంస్కృతిలోనే కొంత బడుగువర్గాలు కూడా ఉంటాయి. ఈ బడుగువర్గాల్ని ఆర్థిక దృష్టి కోణం నుంచి వేరు చేయడం కాక సాంస్కృతికంగా మీరంతా పీడితులు, బాధితులు అని చెప్పడం ఇందులోని కొత్త విషయం. మూల సంస్కృతి జాత్యహంకారం, పురుషాధిక్యత లాంటి భావజాలంతో ఉంది. ఆ సంస్కృతిని కూలదోసి కొత్త సంస్కృతిని తీసుకురావాలి అని వీరి వాదన.

జర్మనీ నుంచి తరిమివేయబడ్డ మార్క్సిస్టులు అమెరికా ఉదార విధానాలను ఉపయోగించుకుని క్రమక్రమంగా విశ్వవిద్యాలయాల్లో ఒక శక్తిగా ఎదిగారు. అమెరికాలో వీరికి కావలసిన సాంస్కృతిక వైవిధ్యం ఉంది. నల్లవారు సాంస్కృతికంగా పీడితులు. తెల్లజాతి అమెరికన్లు జాత్యహంకార వాదులు అనే ఒక చట్రంలోకి సరిపోతారు. దీనికితోడు అమెరికాలో ఇతర మతాల వారి (ముఖ్యంగా ఇస్లాం) వలసలు ఎక్కువయ్యాయి. నల్లవారితో పాటు పీడితుల జాబితాలో ఇస్లామిక్ సంస్థలు, రాడికల్ భావాలున్న ఇతరులు చేరగలిగారు. అమెరికాను బలహీనపర్చాలనే లక్ష్యం ఇస్లామిక్ వాదులకు ఉంది. భారతీయుల్లో దళిత వర్గాల వారిని మాత్రం పీడితుల జాబితాలో చేర్చారు. సెక్సు స్వాతంత్ర్యవాదులు, స్వలింగ సంపర్కులు కూడా వీరితో కలిశారు. అందరి లక్ష్యం అమెరికన్ సంస్కృతిని నశింపజేయడమే. ఇలాగే కమ్యూనిజం సాంస్కృతిక మార్క్సిజం అని రూపాంతరం చెంది విశ్వవిద్యాలయాలను ఆక్రమించింది.

Cultural hagemony పేరిట ప్రారంభమైన భావన Critical Race Theory (CRT) అనే సిద్ధాంతంగా మారింది. ప్రతి వ్యక్తీ ఏదో ఒక సాంస్కృతిక వర్గానికి చెందినవాడే కావున వెంటనే వీడు పీడితుడు, వీడు జాత్యహంకారి అని ముద్రవేయబడతాడు. భావజాల ప్రభావంతో అమెరికా విలవిల్లాడుతోంది. ఈ పరిణామాల్ని NIALL FERGUS JOHN ANDERSON మొదలగు వారి రచనల్లో, భాషణల్లో వివరంగా తెలుసుకోగలం. ఇదంతా భారతీయ సమాజానికెలా వర్తిస్తుంది? అమెరికాలో CRITICAL RACE THEORY ప్రయోగంతో విజయం సాధించిన వామపక్షవాదులు, పై సిద్ధాంతాన్ని CRITICAL CASTE THEORY అని మార్చి పశ్చిమ దేశాల్లోని భారతీయుల్ని విడదీశారు. ముఖ్యంగా UK, USAలలో Caste Lawను కూడా తేవడానికి ప్రయత్నించారు. భారతదేశంలో కమ్యూనిజం ప్రారంభం నుంచి దేశ విభజనవాదాలున్నాయి. దేశంలో జాతీయ భావన లేదని ఇది 56 చిన్న రాజ్యాల కలయిక అని, అవి మళ్లీ విడిపోవాలనీ వీరి వాదం. దానితో పాటు వర్గపోరాటాన్ని తేవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఇప్పుడు మిగిలింది సాంస్కృతిక పోరాటం. బ్రిటిష్ పాలన సమయంలో సమాజాన్ని విడగొట్టడానికి మారుమూల ప్రాంతాల్లోని తెగలను కూడా గుర్తించి నాలుగువేలకు పైగా కులాలున్నట్లు నమోదు చేశారు. వాటిలో కొన్ని అగ్రవర్ణాలు, కొన్ని వెనుకబడినవి అని గుర్తించారు. వారి లక్ష్యం అనేక వర్గాల్ని మతమార్పిడి చేయడమే.

హిందూమతం కులాన్ని నిర్మించింది అన్న అసత్య ప్రచారం బ్రిటిష్ వారి పాలన వల్ల మనకు జరిగిన గొప్ప హాని. కులాన్ని మతానికి అంటగట్టడం పూర్తి అసత్యం.

> హిందూమతం కులాన్ని నిర్మించింది అన్న అసత్యప్రచారం బ్రిటిష్ వారి పాలన వల్ల మనకు జరిగిన గొప్ప హాని. కులాన్ని మతానికి అంటగట్టడం పూర్తి అసత్యం. హిందూ మత గ్రంథాల్లో కేవలం నాలుగు వర్ణాల నిర్మాణం గురించి ఉంది కానీ నాలుగు వేల కులాలను ఏ దేవుడూ, ఏ ఋషీ ఆజ్ఞాపించలేదు.
>
> ***
>
> కులగణన వల్ల ఎవరికి లాభం? కొందరికి రాజకీయంగా తాత్కాలిక లాభం ఉండవచ్చు. కాని దేశంలో సాంస్కృతిక మార్క్సిజం బలపడి భారతీయ సంస్కృతి మూలాలు నశించే అవకాశం ఉంది. దీనివల్ల భారతదేశాన్ని విభజించాలనే శక్తుల్ని బలపరచడమే అవుతుంది. దీర్ఘకాలిక దృష్ట్యా దేశ సమగ్రతకు హానికరం.



హిందూ మత గ్రంథాల్లో కేవలం నాలుగు వర్ణాల నిర్మాణం గురించి ఉంది కానీ నాలుగు వేల కులాలను ఏ దేవుడూ, ఏ ఋషీ ఆజ్ఞాపించలేదు. కులాలను సృష్టించడమనేది బ్రాహ్మణులు అనే వర్గం చేయగలిగేది కాదని అంబేడ్కర్ కూడా స్పష్టం చేశాడు. దీన్ని గూర్చి విస్తృతంగా ఇటీవలి నా పుస్తకం (India Religion–Challenges for Survival)లో రాశాను. ఈ వ్యాసంలో ఆ వివరాలు అక్కరలేదు.

ప్రస్తుత చర్చ కులాల గణన గురించి. బ్రిటిష్ పాలకులు కొంత సత్యం, కొంత అసత్యం కలిపి పరిపాలన చేశారు. బడుగువర్గాలకు రాజకీయ రంగంలో ప్రవేశం కల్పించారు. ఇది హర్షించదగిందే. కానీ స్వతంత్రం వచ్చిన తర్వాత క్రమక్రమంగా కులరహిత సమాజానికై ప్రయత్నం చేయకపోగా, కులాల విభజనను రాజకీయ ప్రయోజనాలకు వాడుకొని ఓటు బ్యాంకుగా మార్చుకోవడం శోచనీయం.

కులాల గణన అనే అంశాన్ని నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అందరూ వ్యతిరేకించారు. దేశంలో అద్వానీ రథయాత్ర సమయంలో ఒక సాంస్కృతిక జాగరణ జరిగే సమయంలో వి.పి. సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేసింది. ఇది ఎవరి సలహా వల్లనో తెలియదు. దేశంలో జాతీయ భావన పెరగకూడదనే శక్తులు తెరవెనుక ఉండవచ్చు. రాజీవ్‌గాంధీ కూడా పార్లమెంటులో మండల్ రిపోర్టును వ్యతిరేకించారు. మండల్ కమిషన్ కాలం నుంచి అనేక ప్రాంతీయ పార్టీలు, కులాల సమూహాలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చాయి. జాతీయ భావన బలహీనమైంది.

ఇటీవలి కాలంలో జాతీయ భావన బలపడుతున్న సమయంలో మళ్లీ కులగణన అనే ప్రస్తావన వెనుక ఏ శక్తులున్నాయో తెలియదు. కుల విభజన చేసే ధైర్యం ఉందా అని ఒక నాయకుడు కేంద్రాన్ని ప్రశ్నించాడు. సమాజాన్ని విడగొట్టడంలో ధైర్యమేమిటో తెలియదు. ఒకప్పుడు ఆయా కులాల వారు ఆయా కులవృత్తుల్ని చేసేవారు. ఇవాళ చాలామంది కులవృత్తుల్లో లేరు. హైదరాబాద్‌లో హేర్ కటింగ్ రంగంలో చాలా మంది ముస్లింలే ఉన్నారు. ఇలాగే మిగతా కులాల్లోనూ.

కులం అనేది భారతీయ సమాజంలో హిందువుల్లోనే కాక ఇస్లాంలో, క్రైస్తవంలో కూడా ఉంది. కేవలం హిందూ కులాలను మాత్రం విభజించి హెచ్చుతగ్గుల్ని నిర్ణయించడం క్రిటికల్ క్యాస్ట్ (Critical Caste) సిద్ధాంతానికి అనుకూలంగా ఉంటుంది. భిన్న భిన్న సంస్కృతులుగా వేరుపర్చడానికీ, హిందూ సంస్కృతిపై ఏహ్యభావాన్ని పుట్టించడానికీ వీలవుతుంది.

కులగణన వల్ల ఎవరికి లాభం? కొందరికి రాజకీయంగా తాత్కాలిక లాభం ఉండవచ్చు. కాని దేశంలో సాంస్కృతిక మార్క్సిజం బలపడి భారతీయ సంస్కృతి మూలాలు నశించే అవకాశం ఉంది. దీనివల్ల భారతదేశాన్ని విభజించాలనే శక్తుల్ని బలపరచడమే అవుతుంది. దీర్ఘకాలిక దృష్ట్యా దేశ సమగ్రతకు హానికరం. మార్క్సిస్టులు దేశంలో విప్లవం తేవడంలో విఫలమయ్యారు. తాము సాధించలేనిది సాంస్కృతిక మార్క్సిస్టులు రాజకీయ నాయకుల ద్వారా చేస్తున్నట్లు కనిపిస్తోంది.

• డా. కె. అరవిందరావు
మాజీ డీజీపీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 21.7

అతివేగంతో అదుపు తప్పిన టిప్పర్

● బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరి దుర్మరణం



సత్యనారాయణ(ఫైల్) సతీష్(ఫైల్)

హైదరాబాద్ సిటీ/వనస్థలిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం సుష్మా చౌరస్తాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి విధ్వంసం సృష్టించింది. శనివారం తెల్లవారుజామున ఓ బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా సంపర మండలం పెద్దపూడి గ్రామానికి చెందిన వీరవెంకట సత్యనారాయణ(32) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కూకట్‌పల్లిలోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన సతీష్(30) భార్య, కూతురుతో ప్రగతినగర్‌లో ఉంటున్నారు. వనస్థలిపురం రైతు బజార్ సమీపంలో ఇటుక లారీ లోడ్ దించడానికి శనివారం ఉదయం 7.30 గంటలకు ఎల్‌బీనగర్‌కు నుంచి వనస్థలిపురానికి ద్విచక్ర వాహనం (ఏపీ29ఏ7380)పై ఇద్దరు కలిసి వస్తున్నారు. ఈ క్రమంలో వనస్థలిపురం సుష్మా చౌరస్తా సిగ్నల్ దాటుతుండగా బైక్‌ను యూటర్న్ తీసుకుంటున్నారు. అదే సమయంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్(టీఎస్09 యూడీ 9599) బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న సత్యనారాయణ, సతీష్‌లు టిప్పర్ టైర్ల కింద పడిపోవడంతో తల, ఛాతి, నడుము ఇతర భాగాల్లో తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మేమూ హెల్మెట్ పెట్టుకుంటున్నాం..

'మేమూ హెల్మెట్ పెట్టుకుంటున్నాం.. పెద్దలందరూ ప్రయాణ సమయాల్లో విధిగా పెట్టుకోవాలి' అంటూ చిన్నారులు వచ్చీరాని మాటలతో ముద్దు ముద్దుగా పలికారు. ఖైరతాబాద్ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో రోడ్ ట్రాక్స్ క్లబ్స్ ఆఫ్ తెలంగాణ, ఇండియన్ హెడ్ ఇంజురీ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎన్‌బీ రత్నం, టీటీఐ బేగంపేట ఏసీపీ శంకర్, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ హాజరయ్యారు.

- ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)



క్రీడలతో పోలీసుల్లో నూతనోత్సాహం

యాన్యువల్ స్పోర్ట్స్‌మీట్-2024 ముగింపు కార్యక్రమం శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో జరిగింది. వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, 100, 400, 1,500 మీటర్ల పరుగుపందెం పోటీల్లో పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డీజీపీ రవిగుప్తా, కమిషనర్ అవినాశ్ మహంతి హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

- హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)

23 ఎంఎంటీఎస్‌లు రద్దు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మౌలాలి-సనత్‌నగర్ స్టేషన్ల మధ్య జరుగుతున్న నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఆదివారం నుంచి జంటనగరాల్లో తిరిగే 23 ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో ఈ నెల 9 వరకు మూడు ఎంఎంటీఎస్‌లు, 10వ తేదీ వరకు మరో రెండు, 11 వరకు 18 ఎంఎంటీఎస్‌లను రద్దు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సీఎంతో మేయర్ భేటీ

● జీహెచ్ఎంసీ పాలనా అంశాలపై చర్చ
● స్టాండింగ్ కమిటీ ఎన్నిక, కౌన్సిల్ నిర్వహణకు ఆదేశాలివ్వాలి
● పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని వినతి
● సానుకూలంగా స్పందించిన రేవంత్
● వెంటనే కమిషనర్‌కు ఫోన్ చేసి ఆదేశాలు
● మేయర్ భేటీపై భిన్న ప్రచారం
● రాజకీయ ప్రాధాన్యం లేదు : విజయలక్ష్మి

"కాంగ్రెస్ వలలో పడకండి! పనుల కోసం మీరు రేవంత్‌ను కలిస్తే.. చేయకపోగా బద్నామ్ చేస్తడు జాగ్రత్త!"
- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పార్టీ ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన హెచ్చరిక ఇది.

రెండు రోజులు కూడా తిరగక ముందే.. సీఎం రేవంత్‌రెడ్డిని మేయర్ విజయలక్ష్మి కలిశారు. జీహెచ్ఎంసీ పనితీరుపై చర్చించేందుకే అంటూ ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నా రాజకీయ వర్గాల్లో మాత్రం హాట్ టాపిక్‌గా మారింది.


రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పంచాయితీ సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. స్టాండింగ్ కమిటీ ఎన్నిక, కౌన్సిల్ సమావేశం నిర్వహణ, బడ్జెట్ ప్రవేశపెట్టడంలో జాప్యం తదితర విషయాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు ఫోన్ చేసి ఆయా అంశాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో రేవంత్‌ను మేయర్ కలిశారు. జీహెచ్ఎంసీలో అభివృద్ధి, పాలనాపరమైన అంశాలను ఆయనకు వివరించారు. స్టాండింగ్ కమిటీ పదవీకాలం నవంబర్‌లో ముగిసిందని, కోడ్ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సాధ్యపడలేదని పేర్కొన్నారు. కోడ్ ముగిసి రెండు నెలలైనా ఇప్పటికీ కమిటీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2024-25 బడ్జెట్ ప్రవేశపెట్టలేదని రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ ఎన్నికకు కార్పొరేటర్ల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉందన్నారు. ఆగస్టులో అర్ధాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం కూడా తిరిగి నిర్వహించలేదని చెప్పారు. కమిటీ ఎన్నిక, కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌కు పలుమార్లు సూచించగా.. ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నట్టు ఆయన చెబుతున్నారని సీఎంతో మేయర్ పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలూ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సానుకూలంగా స్పందించిన రేవంత్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో..

9న బుక్ ఫెయిర్

● 320 స్టాళ్లతో పుస్తక ప్రదర్శన
● ప్రారంభోత్సవానికి సీఎం, డిప్యూటీ సీఎం
● విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు, పాత్రికేయులకు ప్రవేశం ఉచితం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న ఎన్టీఆర్ స్టేడియంలో 36వ జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుందని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను ఆహ్వానించనున్నామని సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పది రోజులపాటు సాగే ఈ పుస్తక ప్రదర్శనలో 320కు పైగా స్టాళ్లు కొలువుదీరతాయని చెప్పారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమై రాత్రి 8 గంటలకు ప్రదర్శన ముగుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, పాత్రికేయులకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నామని తెలిపారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవడంలో భాగంగా తాత్కాలిక స్మారక స్థూపాన్ని ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్ మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయడం కోసం 'బాల వికాసం' పేరుతో వారం రోజులపాటు చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

75 గజాల్లోపు ప్లాట్‌కూ..
కమెన్స్‌మెంట్ తప్పనిసరి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో 75 గజాల లోపు ప్లాట్ అయినా నిర్మాణ ప్రారంభ ధ్రువపత్రం(కమెన్స్‌మెంట్ సర్టిఫికెట్) ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సర్టిఫికెట్ పొందిన తర్వాతే నిర్మాణాలు ప్రారంభించాలని తెలిపింది. 75 గజాల్లోపు ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేపడుతున్న తమకు నిర్మాణాలు ఆపాలని నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నేరేడ్‌మెట్ వినాయక్‌నగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆస్తుల పంపకం తర్వాత 40 గజాల చొప్పున రెండు ప్లాట్లు, 54 గజాల ఒక ప్లాట్‌లో ఇళ్ల నిర్మాణాలకు టీఎస్-బీపాస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. చట్టప్రకారం 75 గజాలలోపు ప్లాట్లకు అనుమతులు అవసరం లేదని చెప్పారు. చుట్టుపక్కల వాళ్ల ఫిర్యాదుతో పనులు ఆపాలంటూ జీహెచ్ఎంసీ నోటీసులు ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌లు చేసుకున్న రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్‌కు లోబడి ఉంటుందని, టీఎస్-బీపాస్ చట్టంలోని సెక్షన్-7 ఇదే అంశాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. ధర్మాసనం 75 గజాలలోపు ప్లాట్లకు సైతం కమెన్స్‌మెంట్ సర్టిఫికెట్ వర్తిస్తుందని పేర్కొంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

జవహర్‌నగర్
కార్పొరేటర్ కిడ్నాప్?

● ఇరువర్గాల పరస్పర ఫిర్యాదులు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ కిడ్నాప్ విషయం కలకలం రేపింది. జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాసానికి ఈ నెల 19వ తేదీని ఖరారు చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. మేయర్ వర్గానికి చెందిన జవహర్‌నగర్ 10వ కార్పొరేటర్ గండి రాంచందర్‌ను కిడ్నాప్ చేశారంటూ బీఆర్ఎస్ నాయకులు శిల్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 2న రాత్రి అసమ్మతి కార్పొరేటర్లు క్యాంపునకు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, అసమ్మతి కార్పొరేటర్లు రాంచందర్‌ను కార్లు మారుస్తూ బలవంతంగా తీసుకువెళ్లే ప్రయత్నం చేయడంతో తమకు లొకేషన్ పంపించారని, వెంటనే వెళ్లి కాపాడామని, పూర్తి వివరాలు పోలీసులకు ఇచ్చామని కార్పొరేటర్ ఏకే మురుగేశ్ వివరణ ఇచ్చారు. అసమ్మతి వర్గంలో 18 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ మరో 15 రోజులు క్యాంపులోనే కొనసాగుతారా..? ఇచ్చిన మాట మీదే ఉంటారా? అనేది తేలాలంటే ఈ నెల 19 వరకు వేచి చూడాల్సిందే. అయితే, పోలీసులు మాత్రం కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, రాంచందర్ కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు. కిడ్నాప్ జరిగిందా లేదా అనే విషయంతోపాటు, తాను మేయర్ వర్గంలో ఉన్నాడా లేక అసమ్మతి వర్గంలో ఉన్నారా అనే విషయం ఎవరికీ అంతు చిక్కడం లేదు.

డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరుతో వల

● పని సక్రమంగా లేదంటూ లీగల్ నోటీసులు
● నిరుద్యోగులను బెదిరించి రూ.కోట్లలో దండుకున్న ముఠా
● నగరానికి చెందిన బాధిత మహిళకు రూ.6.18 లక్షల టోకరా
● మహిళ ఫిర్యాదుతో గుజరాత్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్


నలుగురు నిందితులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డేటా ఎంట్రీలో పార్ట్‌టైం జాబ్ ద్వారా బాగా సంపాదించవచ్చని నమ్మబలుకుతూ అమాయకులను దోచుకుంటున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఫ్లోరా సొల్యూషన్ పేరిట సంస్థను స్థాపించిన మోసగాళ్ల డేటా ఎంట్రీ జాబ్ ఫ్రాడ్‌కు తెరలేపారు. తొలుత ఉపాధి కల్పిస్తున్నామని చెప్పి ఉద్యోగార్థుల నుంచి రిజిస్ట్రేషన్ డబ్బులు వసూలు చేశారు. నగరానికి చెందిన ఓ యువతి వీరి మాయలో పడి రూ. 6.18 లక్షలు పోగొట్టుకుంది. పార్ట్‌టైం జాబ్ కోసం వెతుకుతుండగా ఆమెకు వాట్సాప్‌లో ఫ్లోరా సొల్యూషన్ పేరిట మెసేజ్ వచ్చింది. క్యాప్చా టైపింగ్ పని ఉంటుందని తెలుపగా బాధితురాలు డేటా ఎంట్రీ పనికి ఒప్పుకుంది. రిజిస్ట్రేషన్ పేరిట, ఆ తర్వాత వివిధ సాకులతో డబ్బు తీసుకోవడమే కాకుండా ఆమెతో పని చేయించినట్లు నటించారు. ఆమె సంస్థ నిబంధనలను ఉల్లంఘించిందని, ఇతరత్రా ఆరోపణలు మోపి లీగల్ నోటీసులు పంపి రూ.6.18 లక్షలు కాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆధారాలు సేకరించి వారిని గుర్తించారు. గుజరాత్ సూరత్ పట్టణానికి చెందిన రాహుల్ అశోక్ బాయి బావిస్కర్(25) ముఠా నాయకుడు కాగా, అదే ప్రాంతానికి చెందిన సాగర్‌పాటిల్ (24), కల్పేశ్ తొరాట్(26), నీలేశ్‌పాటిల్(24)లు ఈ గ్యాంగ్‌లో ఉన్నారు. వారిని విచారించగా తమ ప్రకటనలకు 25 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వేలాదిమంది నిరుద్యోగులు బోల్తాపడ్డారని, వారి నుంచి

మిగతా 6వ పేజీలో..

ఆన్‌లైన్ కరెన్సీ పేరుతో మోసం
● రూ. 2 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లు
6

ఆన్‌లైన్ కరెన్సీ పేరుతో మోసం

- రూ. 2 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లు
- తెలుగు రాష్ట్రాల్లో 200 మంది బాధితులు
- నిందితుడి ఆటకట్టించిన సైబరాబాద్ పోలీసులు


నిందితుడు సతీష్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ డిజిటల్ కరెన్సీ పేరుతో అమాయకులను ఆకర్షించి రూ.2 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్ల ఆటకట్టించారు సైబరాబాద్ పోలీసులు. ఒకరిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. సైబరాబాద్ ఆర్థిక నేరాల(ఈవోడబ్ల్యూ) విభాగం డీసీపీ శనివారం వివరాలు వెల్లడించారు.

బెంగళూరుకు చెందిన అవల కొండప్ప వెంకటచలపతి, బీఎన్ కొండప్ప కలిసి గ్లిటోకన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 2015లో బెంగళూరులో ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఎక్స్‌సీఎస్‌పీఎల్ డాట్‌కామ్ అనే మోసపూరితమైన వెబ్‌సైట్‌ను క్రియేట్ చేశారు. అదే పేరుతో కేపీహెచ్‌బీలో బ్రాంచిని ఏర్పాటు చేశారు. తన ముఠాలో గదిరాజు, రాజేంద్రప్రసాద్ రాజు, గురుప్రసాద్, పాశం వెంకటప్రసాద్, జ్యోతిలను చేర్చుకున్నారు. ఆన్‌లైన్‌లో గో ఫ్లైయాక్స్ ద్వారా ఆన్‌లైన్ కరెన్సీ(ఎక్స్ కాయిన్స్)ని కొనుగోలు చేసి పెట్టుబడులు పెడితే.. మొదటి మూడు నెలలు పెట్టిన పెట్టుబడికి సమానంగా అంటే 1:1, ఆ తర్వాత ఏడాది పాటు 1:4 (నాలుగు రెట్లు) లాభాలు ఇస్తామని ప్రచారం చేసి ఆకట్టుకున్నారు. వారి మాటలు నమ్మి తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది వరకు వారి ద్వారా పెట్టుబడులు పెట్టారు. ఇన్వెస్టర్స్ పెట్టిన డబ్బుకు సమానంగా ఎక్స్ కాయిన్స్ కొనుగోలు చేసినట్లు చూపించారు. ఎక్స్‌కాయిన్స్ విలువ రోజు రోజుకూ పెరుగుతుందని బురిడీ కొట్టించారు. అలా సుమారు రూ. 2 కోట్లు పెట్టుబడుల రూపంలో చేతికి అందిన తర్వాత ఉడాయించారు. నగరానికి చెందిన రాజేంద్రప్రసాద్ వారి మాటలు నమ్మి రూ. 6.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం 'నా డబ్బులు నాకు తిరిగి ఇవ్వాలి'అని గ్లిటో కన్సల్టెన్సీ వారిని కోరగా వారు స్పందించడం మానేశారు. కార్యాలయం మూసేశారు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. సీపీ ఆదేశాలతో ఆర్థిక నేరాల విభాగం డీసీపీ కె.ప్రసాద్, ఏసీపీ హూస్సేనీనాయుడు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బృందం రంగంలోకి దిగింది. ప్రధాన నిందితుల్లో ఒకరైన సతీష్‌ను అరెస్ట్ చేశారు. మిగతా వారు పరారీలో ఉన్నారు. త్వరలోనే మిగిలిన వారినీ అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరుతో వల

5వ పేజీ తరువాయి

రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడినట్లు వెల్లడించారు.

మోసం జరిగిందిలా..

రాహుల్ అనే నిందితుడు గతంలో నితేశ్ అనే వ్యక్తి నిర్వహించే ఫేక్ డేటా ఎంట్రీ సెంటర్‌లో టెలీకాలర్‌గా పనిచేసేవాడు. అక్కడ పోలీసులు దాడులు నిర్వహించడంతో కాల్ సెంటర్ మూసివేశారు. కానీ, రాహుల్ నిరుద్యోగుల డేటా జాబితాను తస్కరించడంతోపాటు జాబ్ పోర్టళ్ల నుంచి డేటా సేకరించాడు. ఆ తర్వాత టెలీకాలర్‌గా సాగర్‌పాటిల్, కల్పేశ్, నీలేశ్‌లకు ఖాతాల సేకరణ బాధ్యత అప్పగించాడు. నిరుద్యోగులకు వాట్సాప్ మెసేజ్‌లు పంపించడం, వారు స్పందిస్తే బుట్టలో వేయడం వీళ్ల దందా. రిజిస్ట్రేషన్, ఇతరత్రా డబ్బులు సేకరించి పని అప్పగించడం, పని పూర్తయిన తర్వాత పని సరిగా జరగలేదని బెదిరించడమే కాకుండా లీగల్ నోటీసులు పంపి బ్లాక్‌మెయిల్ చేయసాగారు. భయపడే నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి నగరానికి తరలించారు. వారి వద్ద నుంచి 6 సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్, 5 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. మోసపోయిన వారిలో దేశవ్యాప్తంగా 358 మంది ఫిర్యాదులు చేయగా వాటిలో తెలంగాణ నుంచి 28, సైబరాబాద్ నుంచి 11 ఫిర్యాదు అందినట్లు పోలీసులు చెప్పారు.

అలరించిన కూచిపూడి నాట్యం


నాట్యం చేస్తున్న నర్తకి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన యువ నర్తకి కనగల నిఖిల ప్రేక్షకులకు నయనానందాన్ని పంచింది. శనివారం రవీంద్రభారతిలో నాట్య గురువు బాలాజీ కుమార్ దొడ్డా శిష్యురాలైన నిఖిల కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేసింది. తొలి బహిరంగ ప్రదర్శనలోనే ప్రేక్షకుల్ని అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్‌కుమార్, డా.సుబ్రహ్మణ్యం తదితరులు నర్తకి నిఖిలను సత్కరించి అభినందించారు. అనంతరం గురువు బాలాజీకుమార్‌కు గురుసత్కారం నిర్వహించారు.


ఎస్.బుచ్చిరెడ్డి, ఎం.ఫణీందర్, శివశంకర్‌ను సత్కరిస్తున్న బాస్ ప్రతినిధులు రాధాకృష్ణ, విజయ్ భాస్కర్, రాకేశ్

అయోధ్యలో అన్నదానంపై సమీక్ష

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలోని రామ మందిరం ప్రాంగణంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రతిరోజూ 30 వేల మంది రామ భక్తులకు ఉచితంగా అల్పాహారం, అన్నదానం, మంచినీటి సేవ కార్యక్రమాలను అందించేందుకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని బాస్ అధ్యక్షులు కె.రాధాకృష్ణ, ప్రధానకార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి మెడిశెట్టి రాకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ ప్రధాన కార్యాలయంలో హనుమాన్‌ఘడ్ రామ మందిరం వద్ద నిర్వహించే అన్నదానంపై రాష్ట్ర కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల రామున్ని తిలకించడానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ అయోధ్యకు వేలాదిగా రామ భక్తులు తరలివస్తున్నారని... వారందరికీ బాస్ తమ వంతు సహాయంగా అన్నదానం చేయడానికిముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి వివిధ ప్రాంతాలకు చెందిన 12మంది ప్రముఖులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎం.ఫణీందర్, శివశంకర్, వై.నాగరాజు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పహిల్వాన్ల సమావేశం

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు పహిల్వాన్‌తో సత్సంబంధాలు లేకున్నా.. అతడు చేసే ఈవెంట్లతో దానికి పహిల్వాన్ అని ట్యాగ్‌లైన్‌తో సోషల్ మీడియాలో హైప్ తేవడంతో నిజమైన పహిల్వాన్లు తీవ్ర అవమానానికి గురవుతున్నారని జై భవానీ వ్యాయామశాల నిర్వాహకులు, ఇంటర్నేషనల్ రెజ్లర్ ఐ.అభిమన్యు యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం పురానాపూల్ గొల్లకిడికి జై భవానీ వ్యాయామశాలలో పహిల్వాన్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమాన్యు యాదవ్ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో మంది రెజ్లర్లు ఉన్నారని.. ఇలాంటి ఘటనలతో నిజమైన పహిల్వాన్లకు చెడ్డ పేరు వస్తోందన్నారు. ఇలాంటి వారి పట్ల సోషల్, ఎలక్ట్రానిక్ మీడియా అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండ రాంను శనివారం ఎంజే మార్కెట్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శ్రీ జంగల్ విఠోబా దేవాలయం అధ్యక్షులు వి.కిషన్ యాదవ్ పూలబొకేతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం జన సమితి పార్టీ ఇన్‌చార్జి బట్టల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.
- అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రమైన గాయాలు

నార్సింగ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టిప్పుఖాన్‌పూల్ వంతెన అప్పా రేడియల్ రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పా రేడియల్ రోడ్డులో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మధుర బార్ వద్ద 40 సంవత్సరాల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఇతడిని ఢీకొట్టి పోయింది. అతను తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న నార్సింగ్ పోలీసులు బాధితుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రెడ్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ఇతని శరీరంపై ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

నార్సింగ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దారిదోపిడీ కేసులో ఓ వ్యక్తిని నార్సింగ్ పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1వ తేదీన స్నేహితాహిల్స్‌లో నివాసం ఉంటున్న సాహిల్‌దల్ అనే వ్యక్తి ఇంటి బయట కూర్చొని ఉన్నాడు. హిమాయత్‌సాగర్ గ్రామానికి చెందిన ముఖేశ్ అటుగా వెలుతూ ఒంటరిగా కూర్చున్న ఇతడిని బెదిరించి, బయటపెట్టి, ఒక సెల్‌ఫోన్, 20 వేలు నగదు దోచుకొని పారిపోయాడు. దీంతో ఇతను ఈ నెల 2న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో నార్సింగ్ ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో రంగంలోకి దిగిన నార్సింగ్ పోలీసులు శనివారం పట్టుకొని అరెస్టు చేశారు. ఇతని నుంచి సెల్‌ఫోన్, రూ.18 వేల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నార్సింగ్ పోలీసులు తెలిపారు.

జీవో నెం. 55 దిష్టిబొమ్మ దహనం


జీవో నెంబర్ 55 దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనేక వృక్ష, జంతు జాతులకు ఆవాసమైన జీవ వైవిధ్యం కలిగిన 100 ఎకరాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయం భూములను హై కోర్టుకు ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన జీవో నెంబర్ 55 దిష్టిబొమ్మను శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు రాజ్‌కుమార్, సురేందర్, మీసాల శ్రీజ, దీక్షిత్, విక్రమ్, అరవింద్, సత్యమూర్తి, వంశీదర్‌రెడ్డి, భానుచందర్ మాట్లాడారు. రైతాంగానికి ఉపయోగపడే సుగంధ ఔషధ మొక్కల పరిశోధనా కేంద్రం, అగ్రో ఫారెస్ట్రీ, అగ్రో బయోడైవర్సిటీ పార్కు, డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌లను కలిగి ఉన్న 100 ఎకరాల భూములను హై కోర్టుకు ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో రైతాంగానికి, వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు, జీవ వైవిధ్యానికి, పక్షి, జంతు జాతుల ఆవాసాలకు, వాతావరణ సమతుల్యతకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. వేలాది చెట్లు ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హై కోర్టు రావడం వల్ల చెట్లన్నీ నరకబడి, వ్యవసాయ విశ్వవిద్యాలయాన్నీ కాంక్రీట్ జంగిల్‌గా మార్చే ప్రమాదం ఉందన్నారు.

ప్రత్యామ్నాయ భూముల్లో హైకోర్టును నిర్మించాలి

శంషాబాద్ మండలంలోని సాతంరాయి సర్వేనెంబర్725లో హెచ్‌ఎండీఏకు చెందిన 121 ఎకరాల భూమి ఉందని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. తమ సర్వేలో ఇది తెలుసుకున్నామన్నారు. ఆ భూములను కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా అవి హెచ్‌ఎండీఏ భూములని తీర్పు చెప్పాయని గుర్తు చేశారు. ఆ భూములను హై కోర్టుకు కేటాయిస్తే ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు రాదన్నారు. ప్రస్తుతం హైకోర్టుకు కేటాయించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం భూముల నుంచి ఆ భూముల వద్దకు 10 నిమిషాల్లో వెళ్లవచ్చన్నారు. 44వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఈ భూములు ఉన్నాయన్నారు. శంషాబాద్ విమానాశ్రాయానికి కూడా అతి సమీపంలో ఈ భూములు ఉండటం వల్ల హైకోర్టుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి, నిపుణుల అభిప్రాయాలు, వర్సిటీ విద్యార్థుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని హైకోర్టుకు భూములను కేటాయించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన లెనిన్‌బాబు


పార్టీ కండువా కప్పుతున్న రాజేశ్‌కుమార్

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పూల్‌బాగ్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యదర్శి లెనిన్‌బాబు శనివారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఆలియాబాద్‌లోని శ్రీ భవానీ శంకర్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెనిన్‌బాబుతోపాటు 30 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శులు వెంకటేశ్ ముదిరాజ్, జి.కన్నయ్యలాల్, సీనియర్ నాయకులు సయ్యద్‌షా ముజాహిద్, మహ్మద్ ఇక్బాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

సీటీసీ పూర్వ విద్యార్థి గుర్తింపే ఆనందం

● త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి


మీర్ జుల్ఫీఖార్ అలీ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వ

చార్మినార్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్నప్పటికీ, సిటీ కళాశాల (సీటీసీ) పూర్వ విద్యార్థినని చెప్పుకోవడంలోనే తనకు ఎంతో ఆనందం కల్గుతుందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీఖార్ అలీ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిపుర గవర్నర్ పాల్గొని, మాట్లాడుతూ సిటీ కళాశాలకు సంబంధించిన ప్రతి కార్యక్రమంలో పాలు పంచుకోవడం వల్ల తనకు నిజమైన సంతృప్తి కల్గుతుందన్నారు. కళాశాలకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తాను ముందుటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య, పి.బాలభాస్కర్, వైస్‌ప్రిన్సిపాల్ డా.ఐజాజ్ సుల్తానా, డా.విప్లవ దత్ శుక్ల, డా.యాదయ్య, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి విద్యాధర భట్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫాస్ట్ డ్రైవ్‌తో లాస్ట్ డ్రైవ్ : డీసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ మహ్మద్ షాకీర్ హుస్సేన్

రవీంద్ర భారతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫాస్ట్ డ్రైవ్ చేస్తే అది మన లాస్ట్ డ్రైవ్ అయ్యే అవకాశం ఉం టుందని, మీ కుటుంబం వేచి చూ స్తోందని, సురక్షితమైన డ్రైవ్ చేసి ట్రాఫిక్ నియమాలు పాటించాలని సెంట్రల్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ షాకీర్ హుస్సేన్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400మంది విద్యార్థులు, కాలేజ్ ప్రిన్సిపాల్ రఘువీర్, డా.డి.తిరుమలరావు, బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్ రాజు, సెంట్రల్‌జోన్ ఏసీపీ ఎన్.బి.రత్నం, సీఐ రాజశేఖర్, ఎస్సైలు వినయ్ కుమార్, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగొద్దు : అడిషనల్ డీసీపీ

చార్మినార్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులు రోడ్డుపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా వ్యాపారం చేసుకోవాలని ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ శ్రీనివాస్ చార్యులు అన్నారు. శనివారం చార్మినార్ సమీపంలోని సనాగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో చార్మినార్ ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫుట్‌పాత్ చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చిరు వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ నయీమ్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ రఘురాం, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

సమాధులను కాపాడండి

కార్వాన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ రాంసింగ్‌పూరా గణేశ్ ఘాట్ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమాధులను పరిరక్షించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నవయుగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణుగౌడ్ డిమాండ్ చేశారు. కొంతమంది ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమాధులను తొలగించి అక్రమంగా భూమిని కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తుంటే వాటిని అడ్డుకొని ఎస్సీ, ఎస్టీలు ప్రహరీలు నిర్మించారని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు ఈ ప్రహరీలను శనివారం కూల్చివేశారన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దిల్‌రాజు, వేణు ఊడుగుల, హరికృష్ణ

బతుకు మూలాలను వెతికే చిన్న ప్రయత్నమే 'జల'

రవీంద్రభారతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణను కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ పోయెట్రిపై చేసిన ఇంటర్వ్యూ జల పుస్తకంగా వచ్చింది. ఈ పుస్తకాన్ని శనివారం ప్రసాద్ ల్యాబ్‌లో ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వేణు ఊడుగుల, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ఫీజులు తగ్గించాలి

● కోఠి మహిళా విశ్వవిద్యాలయం ఎదుట ధర్నా
● దిగొచ్చిన వీసీ.. ఫీజులను తగ్గిస్తున్నట్లు ప్రకటన


వర్సిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థినులు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కోఠి మహిళా కళాశాల విశ్వవిద్యాలయం విద్యార్థినులు రోడ్డెక్కారు. శనివారం విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో సైతం లేనివిధంగా కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పరీక్ష ఫీజులను 10 శాతం పెంచి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మారుమూల ప్రాంతాల నుంచి చదువుల కోసం నగరానికి వచ్చిన విద్యార్థులపై ఫీజుల భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీస సమాచారం లేకుండా ఏకంగా 10 శాతం ఫీజుల పెంచడం సరికాదన్నారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించడంతోపాటు హాస్టల్‌లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విశ్వవిద్యాలయం వీసీ విజ్జులత విద్యార్థులతో చర్చించి పెంచిన ఫీజుల తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతోపాటు హాస్టల్‌లో వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ధర్నా విరమించారు.

జల్‌పల్లి పెద్ద చెరువులో కెమికల్స్!

పహడిషరీఫ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ పరిశ్రమల నుంచి వస్తున్న రసాయానాల వల్ల జల్‌పల్లి పెద్ద చెరువు కలుషితం అవుతున్న మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని కందికల్ ఫిషరీస్ సొసైటీ, శ్రీరామ ఫిషరిస్ సొసైటీ ప్రతినిధులు మహేందర్, రాపోలు శ్రీనివాస్, బైరి వినోద్‌కుమార్ అన్నారు. జల్‌పల్లి పెద్ద చెరువులో సర్వేనెంబర్ ఐదులోగల చెరువుకు ఆనుకొని ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలను చెరువులో విడిచిపెడుతున్నారని ఆరోపించారు. సమీప పరిశ్రమల నుంచి కూడా కలుషిత నీరు చెరువులో చేరడం వల్ల చేపలు మృతి చెందుతున్నాయన్నారు. ఈ విషయంపై తమ సంఘాల తరఫున జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌కు పహడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వెంటనే అధికారులు చెరువులో కలుషిత నీటిని వదలుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అమృతోదయం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి శౌర్య ప్రతాపాలకు వేంగి పాలకుడు ప్రోలయ నాయకుడు తమిళ ప్రాంత పాలకుడు రామప్ప నాయకుడు వంటి వారి ప్రతీకలని తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్.రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో చారిత్రక నవలా చక్రవర్తి ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ రచించిన అమృతోదయం (ప్రాచీన ముసునూరి చక్రవర్తులపై ప్రథమ ప్రామాణిక చారిత్రక నవల) పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఎస్.రామ్మోహన్‌రావు పుస్తకాన్ని ఆవిష్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యవాణి, మేడసాని మోహన్, ఈమని శివనాగిరెడ్డి, కంఠమేని రవికుమార్, ఎం.నరసింహప్ప, ఎంకే.ఆశలత, ఎంకే.రాము తదితరులు పాల్గొన్నారు.

రన్నరప్‌గా రాజేంద్రనగర్ జోన్ పోలీసులు


రన్నరప్ ట్రోఫీతో రాజేంద్రనగర్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్లు


సైబరాబాద్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పోలీసు క్రీడాకారులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో రాజేంద్రనగర్ జోన్ పోలీసులు ఓవరాల్‌గా రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. వీరికి డీజీపీ రవి గుప్తా, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతీలు ట్రోఫీని అందజేశారు. రాజేంద్రనగర్ జోన్ నుంచి 50 మంది పోలీసు క్రీడాకారులు వాలీబాల్, టగ్గఫర్, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, క్యారమ్స్, బాస్కెట్ బాల్, 100 మీటర్ల పరుగుపందెం, 400 మీటర్ల పరుగు పదెం. 1500 మీటర్ల పరుగు పందెం పోటీలలో పాల్గొన్నారు. వాటిలో డిస్కస్ త్రో, క్యారమ్స్‌లో మొదటి బహుమతులు గెలుచుకోగా వ్యగతా పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. దీంతో రాజేంద్రనగర్ జోన్ కు ఓవరాల్‌గా రన్నరప్ చాంపియన్ షిప్ ట్రోఫీని అందజేశారు.

క్రీడాకారులకు డీసీపీ అభినందన

సైబరాబాద్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ రన్నరప్‌గా నిలచిన రాజేంద్రనగర్ జోన్ పోలీస్ క్రీడాకారులను డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ బి.గంగాధర్, ఇన్‌స్పెక్టర్‌లు బి.నాగేంద్రబాబు, పులి యాదగిరి, పి.మధు, ఎస్‌ఐలు రాములు, మౌనిక, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/8rjolBvలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.com లో లాగిన్ అయిన తరువాత

హైదరాబాద్ ఎంపీ టికెట్ కోసం కేఎస్ ఆనంద్‌రావు దరఖాస్తు


దరఖాస్తు సమర్పిస్తున్న కేఎస్.ఆనంద్‌రావు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని టీపీసీసీ కార్యదర్శి కేఎస్.ఆనంద్‌రావు శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తాను పార్టీలో 34 సంవత్సరాలుగా పనిచేస్తున్నానని గుర్తుచేశారు. బీసీ మున్నూరుకాపు సామాజిక వర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్నవారిని గుర్తించాలని కోరారు.

16న బండ్లగూడ మేయర్ విశ్వాసంపై ఓటింగ్

నార్సింగ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ కార్పొరేషన్ మేయర్ పై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం విషయంలో రంగారెడ్డి కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. నో కాన్ఫిడెన్స్ కోసం ప్రత్యేక సమావేశం ఈనెల 16న ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేస్తూ ఆయన కార్పొరేటర్లకు నోటీసులు జారీచేశారు. మొత్తం 22 మంది కార్పొరేటర్లలో పార్టీలకు అతీతతంగా 16 మంది కార్పొరేటర్లు మేయర్ మహేందర్ గౌడ్‌పై అవిశ్వాసం లేఖలను కలెక్టర్‌కు సమర్పించారు. ఆయన సంతకాల స్క్రూటీని నిర్వహించారు. అయితే చివరకు ఈనెల 16న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మేయర్‌కు అనుకూలం, వ్యతిరేకం ఓట్లు లెక్కించనున్నారు. మేయర్ విశ్వాసం కోల్పోతే కొత్త మేయర్ ఎన్నిక అయ్యే వరకు డిప్యూటీ మేయర్ ఇన్‌చార్జిగా ఉండనున్నారు. ఇక ఇదే రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మణికొండ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం లేఖపై 11 మంది సంతకాలు చేసి కలెక్టర్‌కు ఇచ్చా రు. ఇక్కడ మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇక్కడ కూడా సంతకాల స్క్రూ టీనీ జరిగింది. ఇంకా అవిశ్వాస తీర్మానం ఓట్ల లెక్కింపునకు తేదీ ఖరారు కాలేదు.

కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి : వైద్యులు


మాట్లాడుతున్న డాక్టర్ కళ్యాణ్, కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, భారతదేశంలో గత సంవత్సరం 19 నుంచి 20 లక్షల కేన్సర్ కేసులు నమోదయ్యాయని ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు పేర్కొన్నారు.

ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో, మూడు సంస్థలు ఎఫ్‌టీసీసీఐ, తెలంగాణ లయన్స్ క్లబ్‌లు, తెలంగాణ, ఆంధ్రా ప్లాస్టిక్ తయారీదారుల సంఘం(టాప్మా)తో కలిసి ప్రపంచ కేన్సర్‌ని జయిద్దాం అనే థీమ్‌తో సెమినార్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు మాట్లాడుతూ పశ్చిమ దేశాలలో లాగా మన దగ్గర కేన్సర్ జాతీయ రిజిస్ట్రీ లేదని, కాబట్టి కేసుల సంఖ్య కచ్చితంగా తెలియదని అన్నారు. నోటిలో పుండు మూడు వారాల్లో నయం కాకపోతే వైద్యులను సంప్రదించాలన్నారు. భారతదేశంలో కేన్సర్ స్క్రీనింగ్ 5 శాతం కంటే తక్కువగా ఉందని డాక్టర్ కళ్యాణ్ చెప్పారు. లయన్స్ క్లబ్‌ల అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టిహిల్ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్, డాక్టర్ పవన్ కుమార్ బి.డాక్టర్ హరీష్ ఎన్ఎల్, డాక్టర్ ప్రనేత్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, టీఏపీఎంఏ అధ్యక్షుడు దయాకర్, శేఖర్ అగర్వాల్, లయన్ డాక్టర్ ప్రకాశరావు, లయన్ తీగల మోహనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్.

దేశ రాజకీయాల్లో జననాయక్ ఓ మలుపు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అత్యంత వెనుకబడిన కులానికి చెందిన జన నాయక్ కర్పూరీ ఠాకూర్ బిహార్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం అప్పట్లో దేశ రాజకీయాల్లో ఒక మలుపు అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. అణచివేయబడిన వర్గాలకు ఆయన ఆశాజ్యోతిగా నిలిచారని ఆయన కొనియాడారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో కర్పూరీ ఠాకూర్‌కు భారత రత్న ప్రకటించడం పట్ల నాయీ బ్రహ్మణుల మోదీకి కృతజ్ఞతాభినందన సభ బీజేపీ స్టేట్ కన్వీనర్ సూర్యపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఆలే భాస్కర్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరై కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎ.సుధాకర్, మోతే గోపాల కృష్ణ, జి.ప్రభాకర్, ఎం.సూర్యనారాయణ, నాగరాజు, ఎం.రమేశ్, టి.వికాస్ పాల్గొన్నారు.

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా వెళ్తోందని, ముఖ్యంగా యువతకు ప్రధాని మోదీ పెద్దపీట వేస్తున్నారని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండుయాదవ్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్ అన్నారు. ఈ మేరకు శనివారం జాంబాగ్‌లోని వీవీకళాశాల ఆడిటోరియంలో వికసిత్ భారత్ అంబాసిడర్ నమో యాప్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీవీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యాధర్, బీజేపీ నాయకులు భరత్ గౌడ్, వికసిత్ భారత్ నమో యాప్ తెలంగాణ కన్వీనర్ భరత్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, శైలేందర్ యాదవ్, నవీన్ బండారి, కె.రామకృష్ణ, జగపతి నాయక్, రవి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌కే అద్వానీకి భారత రత్న ఇవ్వడం సంతోషకరం : శ్రీధర్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హోంశాఖ కేంద్ర మాజీ మంత్రి, అభినవ సర్దార్ పటేల్ లాల్ క్రిష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత భారత రత్న అవార్డు ఇవ్వడం సంతోషకరమని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. ఎల్‌కే అద్వానీ కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్న సమయంలో రాజేంద్రనగర్‌కు వచ్చినప్పుడు ఆయనతో గడిపిన మధుర క్షణాలను శ్రీధర్ గుర్తు చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి హోదాలో శివరాంపల్లిలోని సర్దార్ వల్లబాయి పటేల్ జాతీయ పోలీస్ అకాడమీకి వచ్చిన సమయంలో ఆయనను కలసి పూలమాలతో సన్మానించే అవకాశం దొరికిందన్నారు. దేశ రాజకీయాలను, బీజేపీని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.

మహిళా వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

నార్సింగ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో శ్రీ శారదాధామంలో మహిళా వ్యక్తిత్వ వికాసంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త విరించి ఆస్పత్రి చైర్మన్ మాధవీలత, శ్రీసరస్వతి విద్యా పీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాధవీలత మాట్లాడుతూ మాతృమూర్తులను చైతన్యవంతం చేయడానికి చాలా కోణాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, డాక్టర్ తిరుపతిరావు, విద్యా ప్రముఖ్ వెంకటలక్ష్మితోపాటు దాదాపు 120 మంది మహిళలు పాల్గొన్నారు.



'లోయ చివరి రహస్యం' కథా సంపుటిని ఆవిష్కరించిన ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, చిత్రంలో సిద్ధార్థ, ఎస్ రఘు తదితరులు

పాఠకానుభూతిని కలిగించే కథలివి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్
- భగవంతం "లోయ చివరి రహస్యం" కథా సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భగవంతం రాసిన కథలు గొప్ప పాఠకానుభూతిని కలిగిస్తాయని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ ప్రశంసించారు. చాలా భిన్నమైన పద్ధతిలో కథలు రాయడం భగవంతం ప్రత్యేకత అని, ఆయన ప్రతి కథలోని కుతూహలం పాఠకులను ఆకట్టుకుంటుందని కొనియాడారు. భగవంతం రాసిన 'లోయ చివరి రహస్యం' కథా సంపుటిని శనివారం రవీంద్ర భారతి మినీహాల్లో కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని కృతి స్వీకర్త హర్షవర్ధన్‌కు అందించారు. అనంతరం కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందులోని కథలన్నింటిలోనూ మన జీవితాలకు, ఆలోచనలకు సంబంధించిన అంశాలున్నాయన్నారు. వీటిని విభిన్న వాస్తవికతలో చిత్రించిన వాస్తవ కథలుగా అభివర్ణించారు. కవి, విమర్శకుడు సిద్ధార్థ మాట్లాడుతూ కవిత్వానికి కథకు మధ్య ఉన్న విభజన రేఖను చెరిపేసుకొన్న రచయిత భగవంతం అని, ఆయన కథల్లోని భాష పాఠకులను అమితంగా ఆకర్షిస్తుందని అన్నారు. కృతి స్వీకర్త హర్షవర్ధన్ మాట్లాడుతూ 'లోయ చివరి రహస్యం' సంపుటి కథల్లోని భావుకతను కొనియాడారు. రచయిత నందూరి రాజగోపాల్ మాట్లాడుతూ రచయితను నిరంతర అన్వేషిగా కొనియాడారు. కథ, నాటక రచయిత ఇండ్ల చంద్రశేఖర్ ఈ సంపుటిలోని కథలను పరిచయం చేస్తూ మాట్లాడారు. సభాధ్యక్షత వహించిన ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ ఎస్. రఘు మాట్లాడుతూ తాత్వికపరమైన హైకూను కథలా మారిస్తే భగవంతం కథలా ఉంటుందని అన్నారు. రచయిత తన స్పందన తెలిపారు.



సన్మానిస్తున్న ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్

ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తా..

శ్రవణ్‌కుమార్‌కు ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఘనసన్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన ప్రముఖ న్యాయవాది శ్రవణ్ కుమార్ అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్ (ఐజేయూ) శ్రవణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించింది. అసోసియేషన్ అధ్యక్షులు మహాత్మ కొడియార్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎండీ మదార్, కోశాధికారి ఎంవీ శివరావు, టీ. శ్రీనివాసరావు, స్వరూప, చైతన్య తదితర జర్నలిస్టులు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో సత్కరించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు, న్యాయవాదులు అల్లంకి రమేశ్, పుప్పాల సంతోష్ కుమార్ శ్రవణ్‌ను సత్కరించారు.

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండీగా ఆమ్రపాలి

- అదనపు బాధ్యతల అప్పగింత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) ఎండీగా కాట ఆమ్రపాలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఎండీగా కొనసాగుతున్న ఆమ్రపాలికి ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు. హెచ్‌జీసీఎల్ ఎండీగా ఉన్న హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇటీవల ఉద్యోగ బాధ్యతలకు రాజీనామా చేశారు. దాంతో ఆమ్రపాలిని నియమించారు. ఈమె ఓఆర్ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్, స్పెషల్ కలెక్టర్ బాధ్యతలను సైతం నిర్వహించనున్నారు.

'పారిశుధ్య' ఉద్యోగులను పర్మినెంట్ చేసేలా తీర్మానం చేయాలి



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ సమావేశంలో పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేసే విధంగా ప్రభుత్వం తీర్మానం చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ భారత్‌కు అసలు రూపమైన పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే తలపెట్టిన పోరు గర్జన కార్యక్రమంలో మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు, పారిశుధ్య కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మల్లేష్ యాదగిరి, బల్గారి హుస్సేన్, డప్పు శివరాజ్, సారగం, రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికల అభివృద్ధి పేరుతో మా పొట్ట కొట్టారు'

పంజాగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం శ్మశాన వాటికలను సుందరీకరణ పేరుతో మహాప్రస్థానాలుగా, వైకుంఠ ధామాలుగా తీర్చిదిద్ది ప్రైవేట్ వ్యక్తులకు, ఏజెన్సీలకు అప్పగించి మా పొట్ట కొట్టిందని గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మన్నే శ్రీధర్ రావు ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి తునికి పద్మాకర్, కోశాధికారి ఎన్. శ్రీనివాసరావులతో కలిసి ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు ఎం.జగన్, బాల్‌రాజ్, హరినాథ్, సత్యనారాయణ, రాంచందర్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో మేయర్ భేటీ

(5వ పేజీ తరువాయి)

వెంటనే రోనాల్డ్‌రోస్‌కు ఫోన్ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాలనాపరమైన అంశాల కోసమే...

మేయర్ సీఎంను కలవడంపై సామాజిక మాధ్యమాల్లో భిన్న ప్రచారం జరిగింది. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పలువురు కలిసిన నేపథ్యంలో వారంతా కాంగ్రెస్‌లో చేరుతారన్న సందేశాలు వైరల్‌గా మారాయి. అనంతరం వారు తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ తాము మర్యాద పూర్వకంగా మాత్రమే రేవంత్‌రెడ్డిని కలిశామని, పార్టీ మారే ఆలోచన లేదని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాజాగా మేయర్ కూడా సీఎంను ఆయన నివాసానికి వెళ్లి కలవడం.. విజయలక్ష్మి తండ్రి కే కేశవరావు పూర్వాశ్రమం కాంగ్రెస్ కావడంతో ఆసక్తికర చర్చ జరిగింది. హస్తం గూటికి ఆ కుటుంబం వెళ్తుందన్న సందేశాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ విషయంపై మేయర్ సీఎంను కలిసిన వివరాలకు సంబంధించిన ప్రెస్‌నోట్‌లోనే వివరణ ఇచ్చారు. రేవంత్‌రెడ్డితో భేటీకి రాజకీయ ప్రాధాన్యం లేదని, పాలనాపరమైన అంశాలపై చర్చించేందుకు కలిశానని చెప్పారు. పురపాలక శాఖ కూడా సీఎం వద్ద ఉన్నందునే ఆయన వద్దకు వెళ్లానని, పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోపు పలు పనులు చేయాల్సిన ఆవశ్యకతను వివరించినట్టు పేర్కొన్నారు.

కమిషనర్‌పై ఫిర్యాదు..

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పనితీరుపైన రేవంత్‌కు ఫిర్యాదు చేశారని, వెంటనే స్పందించిన ఆయన ఆదివారం తనను కలవాల్సిందిగా మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌లను ఆదేశించారని మీడియాలో ప్రచారం జరిగింది. నగర అభివృద్ధిపై సమీక్ష చేసే సమయంలో తనను పిలవాల్సిందిగా సీఎంను ఆమె కోరినట్లూ చెబుతున్నారు.

ఇన్‌చార్జీలే దిక్కా?

రిజిస్ట్రేషన్ల శాఖ తీరు ఇదీ

- రంగారెడ్డి, హైదరాబాద్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీ
- మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్‌కు అసిస్టెంట్ ఐజీగా అదనపు బాధ్యత
- రంగారెడ్డి డీఐజీకి అదనంగా మేడ్చల్ డీఐజీ బాధ్యతలు
- అవకతవకలపై ఆడిట్లు కరువు
- ఆదాయ వనరే.. అయినా పట్టించుకోని సర్కారు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ల శాఖలో అదనపు బాధ్యతలతోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. ఇన్‌చార్జిలతో పాలన గాడి తప్పింది. రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టులతో పాటు మేడ్చల్ డీఐజీ పోస్టుల్లోనూ ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. ఓవైపు ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తున్నా ఖాళీ పోస్టులకు మాత్రం అర్హత కలిగిన అధికారులతో భర్తీ చేయడం లేదు. ఉన్నవారికే ఒకటికి మించి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల వారు ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పర్యవేక్షణ అంతంతమాత్రమే. ఖాళీగా ఉన్న ఆడిట్ రిజిస్ట్రార్ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆడిట్లు తూతూమంత్రంగానే చేస్తున్నట్లు తెలుస్తోంది.

పట్టించుకోని వైనం..

గ్రేటర్ పరిధిలోలో కీలకమైన హైదరాబాద్ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నల్గొండలో పనిచేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ప్రకాశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే రంగారెడ్డి జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా అదే జిల్లా రిజిస్ట్రార్ స్థితప్రజ్ఞకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌ను ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పోస్టులో ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు గతేడాది ఆగస్టు 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇన్‌చార్జి అధికారుల నియామకం జరిగి ఆర్నెల్లవుతున్నా, రెగ్యులర్ అధికారుల నియామకంపై ప్రభుత్వం కనీసం దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలంటున్నాయి.

తెగని డీఐజీల పంచాయితీ

మరోవైపు మేడ్చల్ జిల్లాకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా గతేడాది ఆగస్టు 22న పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రవీందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న నిజామాబాద్ డీఐజీ మధుసూదన్‌రెడ్డిని కరీంనగర్ డీఐజీగా బదిలీ చేసింది. ఈ మేరకు జీవో విడుదల చేసిన రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ 24 గంటలు గడవకముందే ఆ పోస్టింగ్స్‌లో మార్పులు చేస్తూ మరొక జీవో జారీ చేశారు. కరీంనగర్‌కు పంపిన డీఐజీ మధుసూదన్‌రెడ్డిని వెంటనే మేడ్చల్ డీఐజీగా, మేడ్చల్ డీఐజీగా రవీందర్ బాధ్యతలు స్వీకరించక మునుపే ఆయనను కరీంనగర్ డీఐజీగా బదిలీ చేస్తున్నట్లు రెండో ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ ఆకస్మిక బదిలీల వ్యవహారంపై ఇద్దరు అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారిద్దరినీ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో మేడ్చల్ డీఐజీ పోస్టులో రంగారెడ్డి డీఐజీ ట్వింకిల్‌జోన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరోవైపు కిందిస్థాయి అధికారులకు పదోన్నతులిచ్చి రెగ్యులర్ అధికారులుగా నియమించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదని ఉద్యోగ వర్గాలంటున్నాయి. కమిషనర్‌గానూ ఇన్‌చార్జి అధికారే కొనసాగుతుండడం వల్ల కూడా రెగ్యులర్ అధికారుల నియామకంపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖలో పదోన్నతులు, రెగ్యులర్ అధికారుల నియామకంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నూజివీడు సీడ్స్ కృషి అనన్యం..

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తూ వారి శ్రేయస్సు దిశగా కొనసాగుతున్న నూజివీడు సీడ్స్ కృషి అనన్యమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం కొంపల్లిలోని ఆస్పేషియస్ కన్వెన్షన్ సెంటర్‌లో నూజివీడు సీడ్స్ స్వర్ణోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ రైతులకు దిగుబడినిచ్చి తెగుళ్లను తట్టుకొనే సరికొత్త వంగడాల రకాలను నూజివీడు సీడ్స్ అందిస్తూ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. మాతృభూమికి సేవ చేసేలా సంస్థను విజయవంతంగా నడుపుతున్న నూజివీడు సీడ్స్ సీఎండీ మండవ ప్రభాకర్‌రావు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. రాబోయే 12 నెలల్లో కొత్తగా 33 రకాల విత్తనాలను విడుదల చేస్తామని, వీటిలో పత్తి, మొక్కజొన్న హైబ్రిడ్ వరి నూనె గింజలకు సంబంధించిన వంగడాలు వస్తాయన్నారు. అంతకు ముందు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మండల వెంకటరామయ్యచౌదరి మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు సీఎండీ మండవ ప్రభాకర్‌రావును ఘనంగా సత్కరించారు.

కులగణనపై ప్రత్యేక చట్టం తీసుకురావాలి

- జస్టిస్ ఈశ్వరయ్యగౌడ్



మేధోమథన సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్యగౌడ్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని నేషనల్ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ప్రత్యేక చట్టం తీసుకువస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజా తెలంగాణ ఆధ్వర్యంలో బీసీ కులగణనపై మేథోమధన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఈశ్వరయ్యగౌడ్ మాట్లాడుతూ కులగణన సర్వేలో విద్య ఉద్యోగ తదితర విషయాలతోపాటు పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. ఇందులో పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు బీసీ కులాలు భాగస్వామ్యం అయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ఆయా కులాల నుంచి పూర్తి నివేదిక సేకరించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీలను అణచివేస్తోందని ఆరోపించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ కుల గణనలో కుటుంబాలకు సంబంధించిన సమగ్రమైన వివరాలను సర్వే చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వే ఎలాంటి సాంకేతికత లేకుండా చేసిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం హిందూత్వ ముసుగులో అగ్రకుల భావజాలంతో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు ఎదగకుండా అణచివేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ సింహాద్రి, దేవల్ల సమ్మయ్య, ప్రొఫెసర్ సుదర్శన్, బి.వి.మురళీమనోహర్, కాల్వ మల్లయ్య, పృథ్వీ, సతీష్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పాలనపై ఆక్షేపణ



మాజీ రిజిస్ట్రార్‌ను సత్కరిస్తున్న వీసీ నర్సింహారెడ్డి, వర్సిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పరిపాలనకు ఓ పద్ధతి లేకుండా పోయిందని పలువురు సీనియర్ ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పదవీ విరమణ పొందిన మాజీ రిజిస్ట్రార్‌కు శనివారం యూనివర్సిటీ యాజమాన్యం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. మూడున్నరేళ్లుగా రిజిస్ట్రార్, ఆరున్నరేళ్లుగా రెక్టార్ పదవులను అంటిపెట్టుకొవడం, ఆఫీసు ప్రొసీజర్స్ పాటించకపోవడంపై తీవ్రంగా విమర్శించారు. ప్రొఫెసర్ మాధవీకుమారి మాట్లాడుతూ ప్రొఫెసర్లను అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో నియమించినపుడు వారి పదవీకాలం ఎప్పుడు ముగుస్తుందనే అంశాన్ని రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వుల్లో ప్రస్తావించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. మరొక సీనియర్ ప్రొఫెసర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జేఎన్‌టీయూలో విభాగాధిపతులకు ప్రత్యేక గదులు లేకపోవడం చూస్తే, యూనివర్సిటీ ఏ డైరెక్షన్‌లో పోతున్నదో వేరే చెప్పనక్కర్లేదన్నారు. రెండు టర్మ్‌లకు పైగా రెక్టార్ పదవిలో కొనసాగిన అధికారి మరొకరికి అవకాశం కోల్పోయేలా వ్యవహరించారని చురకలు అంటించారు. వీసీ కట్టా నర్సింహరెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రార్‌గా మంజూర్ హుస్సేన్ ప్రారంభంలో తనతో విభేదించినప్పటికీ, ఆపై సంపూర్ణంగా సహకరించారని చెప్పారు. అనంతరం మాజీ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, మాజీ రెక్టార్ గోవర్ధన్ మాట్లాడుతూ.. తమ పదవీకాలంలో సహకరించిన బోధన, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు జీకే విశ్వనాథ్, క్రిష్ణమోహనరావు, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీదేవి, వసుమతి, మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ సింధు, పలువురు ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీలో విందు.. పలువురు వీసీల హాజరు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల ఉపకులపతులకు జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి శనివారం రాత్రి విందు ఇచ్చారు. వర్సిటీ వీసీ బంగ్లాలో జరిగిన విందుకు ఓయూ వీసీ రవీందర్, మహాత్మగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ వీసీ డాక్టర్ మల్లేశ్, పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రితో పాటు పలువురు జేఎన్‌టీయూ డైరెక్టర్లు హాజరయ్యారు. విందు అనంతరం వీరంతా యూనివర్సిటీ కాలేజీ, హాస్టళ్లలో ఇటీవల ఏర్పాటుచేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

విద్యుత్‌శాఖలో జూనియర్ సీజీఎంలకు

ఇన్‌చార్జి డైరెక్టర్ బాధ్యతలు

- నియామకంపై విమర్శలు.. సీనియర్ల అసంతృప్తి
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసే యోచనలో పలు సంఘాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లో ఐదు రోజుల క్రితం తొలగించిన ఏడుగురు డైరెక్టర్ల స్థానంలో ముగ్గురు జూనియర్ సీజీఎంలకు ఇన్‌చార్జి డైరెక్టర్లుగా బాధ్యతలు అప్పగించారనే విమర్శలు విద్యుత్ సంస్థల్లో వ్యక్తమవుతున్నాయి. డిస్కం సీఎండీ 10 ఏళ్ల సీనియర్ సీజీఎంలను పక్కన పెట్టి జూనియర్లకు బాధ్యతలు అప్పగించడంపై సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకాలు చేపట్టే వరకు వారిని తాత్కాలికంగా నియమించామని చెబుతున్నా తమ వద్ద పనిచేసి వెళ్లిన అధికారుల ముందు కిందిస్థానంలో ఎలా మీటింగ్‌లో కూర్చుకోవాలంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత విద్యుత్‌శాఖలో జరుగుతున్న పరిణామాలు, సీఎండీల వ్యవహారిశైలి, సమావేశాల్లో ఉన్నతాధికారులతో ప్రవర్తిస్తున్న తీరును సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని పలు సంఘాలు భావిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కొన్ని సంఘాలు అతిగా బీఆర్ఎస్‌కు అంటకాగడంతో ఈ రోజు కొంతమంది ఉన్నతాధికారులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితులు వచ్చాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్యాన్సర్‌పై పోరాటంలో రోగి కుటుంబీకుల మద్దతూ ముఖ్యమే

- డాక్టర్ సచిన్ మర్దా



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై చేసే పోరాటంలో రోగి ఆత్మస్థైర్యంతోపాటు వారి కుటుంబీకుల మద్దతు కూడా అంతే అవసరమని యశోదా ఆస్పత్రిలో సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, రోబొటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మర్దా అన్నారు. క్యాన్సర్ సర్వైవర్ల విజయగాథలు, క్యాన్సర్‌పై చేసే పోరాటంలో అనుసరించాల్సిన మార్గాలపై అవగాహన కోసం రెండేళ్ల క్రితం ఆయన రచించిన 'ఐ యామ్ అన్‌స్టాపబల్ -టుగెదర్ వుయ్ కెన్' పుస్తకాన్ని ముడాంబి తెలుగులో అనువాదీకరించారు. ఈ పుస్తకాన్ని శనివారం సోమాజిగూడాలోని యశోదా ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సచిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యశోదా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ నర్సింగ్ జనరల్ మేనేజర్ విమలా ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ లింగయ్య తోపాటుగా సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ సోములు, పలువురు డాక్టర్లు, క్యాన్సర్ సర్వైవర్లు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సచిన్ మాట్లాడుతూ రోగ నిర్ధారణ మొదలు చికిత్స వరకూ అనుసరించాల్సిన పద్ధతులను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. డాక్టర్ పవన్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, అందుకు కాలుష్యం, ఆహారపు అలవాట్లు, మన జీవనశైలి కారణమవుతున్నాయన్నారు. క్యాన్సర్‌కు చికిత్స ఉందంటూ కొంతకాలానికి అది పూర్తిగా నయమయ్యే వ్యాధిగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ సోములు, డాక్టర్ లింగయ్య మాట్లాడారు.

డయాబెటిక్ ఫుట్ అల్సర్‌పై అప్రమత్తత అవసరం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితులు ఫుట్ అల్సర్‌లపై మరింత జాగ్రత్తగా ఉండాలని పలువురు వైద్య ప్రముఖులు హెచ్చరిస్తున్నారు. ఇండియన్ పోడియాట్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిమ్స్‌లో శనివారం శాస్త్రీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిమ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు పాల్గొన్నారు. సదస్సులో వాస్క్యులర్ సర్జరీ విభాగాధిపతి, సీనియర్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్ సర్జన్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా మాట్లాడుతూ భారతదేశంలో పాదాలకు సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అవి జీవనశైలి, పర్యావరణ పరిస్థితుల వంటి కారణాల వల్ల వస్తాయన్నారు. దేశంలో మొత్తం 6.2 కోట్ల మంది మధుమేహ బాధితులు ఉన్నారని, వారిలో 25శాతం మందికి డయాబెటిక్ ఫుట్ అల్సర్లు ఉన్నాయని తెలిపారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే పాదాలను కొంతమేర అయినా తొలగించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

బీసీల సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఈనెల 8, 9 తేదీల్లో ఢిల్లీలో సమరభేరీ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం రవీంద్ర భారతి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో బీసీల సమరభేరికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, గౌడ సంఘాల సమన్వ య కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

- మహిళకు డ్రగ్స్ స్మగ్లర్ల వేధింపులు
- భరించలేక పోలీసులకు ఫిర్యాదు



పోలీసులు అరెస్టు చేసిన స్మగ్లర్స్

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పబ్‌లకు అలవాటుపడిన మహిళ డ్రగ్స్ బానిసైంది.. ఈ క్రమంలో పరిచయం అయిన డ్రగ్స్ స్మగ్లర్ చివరకు ఆమెను వేధించడం ప్రారంభించాడు. అతని వేధింపులు భరించలేక ఆమె షీటీమ్ మహిళా కానిస్టేబుల్ సహకారంతో పోలీసులను ఆశ్రయించింది. గచ్చిబౌలి పోలీస్, తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీన్యాబ్) పోలీసు బృందాలు రంగంలోకి దిగి నలుగురు డ్రగ్స్ స్మగ్లర్లతోపాటు పలువురు వినియోగదారులను అరెస్ట్ చేశాయి. వారి నుంచి 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, ఒక కారు, 5 సెల్ ఫోన్లు, మొత్తం సుమారు రూ. 25 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

నిజాంపేటకు చెందిన మిథునకు పబ్‌లకు వెళ్లే అలవాటు ఉంది. ఈ క్రమంలో డ్రగ్స్ సరఫరాదారులైన సులేమాన్(31), ఫైజల్, అర్కుమ్ హుస్సేన్(27)లతో ఆమెకు పరిచయం ఏర్పడింది. మొదట వీరు ఆమెకు ఉచితంగా డ్రగ్స్ అందించి అలవాటు చేశారు. ఆ తర్వాత డబ్బుకోసం ఆమెను వేధించసాగారు. రోజురోజుకు వారి వేధింపులు ఎక్కువడంతో భరించలేని బాధితురాలు బాచుపల్లి షీటీమ్స్ మహిళా కానిస్టేబుల్‌ను సంప్రదించి తనగోడు వెల్లబోసుకుంది. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు తెలిపింది. దాంతో గచ్చిబౌలి పోలీస్, తెలంగాణ నార్కోటిక్ బ్యూరో టీమ్ రంగంలోకి దిగాయి. సుమారు 20మంది డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారులతో బాధితురాలికి పరిచయం ఉన్నట్లు గుర్తించారు. ఆ మేరకు ప్రత్యేక నిఘా పెట్టి డ్రగ్స్ స్మగ్లర్ యూసఫగూడ శ్రీరామ్‌నగర్‌కు చెందిన సులేమాన్(31)తో పాటు హుమాయున్‌నగర్‌కు చెందిన షేక్ అర్మాన్(34), జహీరా నగర్ రోడ్డు నెంబర్-10, బంజారాహిల్స్‌లో నివాసం ఉండే అర్కుముమ్ హుస్సేన్(27)లను అదుపులోకి తీసుకున్నారు. వీరు నగరంలోని పబ్‌లకు వచ్చే వారితో పరిచయం చేసుకొని డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. వీరు బెంగళూరు, గోవా, ముంబై నుంచి డ్రగ్స్ తెచ్చి నగరంలో మిథున(37)తోపాటు ప్రియ, రతన్, సాహిల్, మరి కొంత మందికి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 9 మంది వినియోగదారులను అదుపులోకి తీసుకొన్నారు.

సినీ ఫక్కీలో నకిలీ నోట్ల ముద్రణ

- స్నేహితుడి సహకారంతో మార్కెట్లో చెలామణి
- ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ, ఇతర పరికరాలు


హైదరాబాద్ సిటీ/అల్లాపూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ సినిమా ఫర్జీ చూసి.. ఇన్‌స్పైర్ అయి.. నకిలీ రూ. 500 నోట్లు ముద్రించి మార్కెట్లో చెలామణి చేస్తున్న ముఠా ఆటకట్టించారు బాలానగర్ ఎస్‌వోటి, అల్లాపూర్ పోలీసులు. ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. వారి నుంచి రూ. 4.05లక్షల విలువైన నకిలీ డబ్బు స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కాశీబుగ్గకు చెందిన వనం లక్ష్మీనారాయణ బీటెక్ రెండో సంవత్సరం వరకు చదివి మానేశాడు. ఆ తర్వాత నగరానికి వచ్చి బోడుప్పల్ ప్రాంతంలో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అడ్డదారిలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ బంగారం తాకట్టు పెట్టి పోలీసులకు చిక్కాడు. బోయిన్‌పల్లిలో అతనిపై గతంలో కేసులు నమోదయ్యాయి. లక్ష్మీనారాయణ కొద్దిరోజుల క్రితం ఫర్జీ సినిమా చూశాడు. అందులో దొంగ నోట్లు ఎలా తయారు చేయాలి అనే విషయమై పూర్తిగా అవగాహన పెంచుకున్నాడు. తాను బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ తీసుకోవడంతో టెక్నికల్‌గా నాలెడ్జి ఉంది. అనుకున్నదే తడవుగా నకిలీ నోట్ల తయారీకి అవసరమైన పరికరాలు కొనుగోలు చేశాడు. అల్లాపూర్‌లోని ఇంట్లో ఒక గదిలో కుటుంబ సభ్యులకు తెలియకుండా తయారీ ప్రారంభించాడు. నకిలీ రూ.500 నోట్లు 810 తయారు చేశాడు. ఆ తర్వాత వాటిని మార్కెట్లో చెలామణి చేయడానికి తన స్నేహితుడు వరంగల్ జిల్లా సంగెంకు చెందిన ఎరుకల ప్రణయ్‌కుమార్‌ను రంగంలోకి దింపాడు. గచ్చిబౌలిలో ఉంటున్న ప్రణయ్ బీటెక్ పూర్తి చేసి జాబ్ సెర్చింగ్‌లో ఉన్నాడు. లక్ష్మీనారాయణ చెప్పినట్లు చేస్తే తాను కూడా తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించొచ్చు అని అనుకున్నాడు. ముందుగా రూ. 20వేలు తీసుకొని అల్లాపూర్‌లోని కూరగాయల మార్కెట్, ఫ్రూట్స్ మార్కెట్‌కు వెళ్లి కొన్ని నోట్లు మార్పిడి చేశాడు. అనంతరం బాలానగర్ ఎస్‌వోటి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో అల్లాపూర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడిచేసి ప్రణయ్‌కుమార్‌ను పట్టుకున్నారు. అతని ద్వారా బోడుప్పల్‌లో ఉన్న ప్రధాన నిందితుడు లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు.

బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 2వేల కోట్ల రూపాయలను కేటాయించడం అత్యంత దారుణమని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. 2 వేలు కాదు.. 2 లక్షల కోట్ల రూపాయలను కేటాయించాలని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. బీసీ సంఘాల నేతలు గుజ్జ సత్యం, కోట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

"గతంలో ఒక సినిమా విజయవంతమయితే ఆ లాభాలు పదిమందితో పంచుకొనేవారు. ఇప్పుడు లాభాలొస్తే అందరూ పంచుకుంటారు. లేకపోతే నష్టమంతా ప్రొడ్యూసర్ మీద తోసేస్తారు. సినిమా విషయంలో త్యాగం చేసేది, ఇల్లు తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చేది ప్రొడ్యూసరే! అతనిని బతికించుకోవాల్సిన బాధ్యత ఇండస్ట్రీదే!"



సండే సెలబ్రిటీ

ఇష్టపడ్డాను... కష్టపడ్డాను..!

నటుడిగా, నిర్మాతగా సినీ రంగంలోనే కాదు, వ్యాపార రంగంలోనూ 'జయభేరి' మోగించారు మురళీమోహన్. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ విలువలకే కట్టుబడి ఉన్నానంటున్న ఆయన సినీ ప్రస్థానంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలివి.

50 ఏళ్ల సినీ ప్రస్థానం ఎలా అనిపిస్తోంది?

చాలా త్వరగా గడిచిపోయినట్లుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే- నాకే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. యవ్వనంలో నాటకాలు వేసేవాణ్ణి. కానీ నేను ఎప్పుడూ హీరో కావాలనుకోలేదు.

సినిమాల్లోకి రాకపోతే ఏం చేసేవారు?

చిన్నప్పటి నుంచి వ్యాపారం అంటే చాలా ఆసక్తి. చదువుకోవాలి కాబట్టి ఇంటర్ దాకా చదువుకున్నా. నేను, హీరో కృష్ణ క్లాస్‌మేట్స్. ఇంటర్‌లో ఆయన పాస్ అయ్యారు. నేను ఫెయిలయ్యా. ఆ తర్వాత బిజినెస్ చేయాలనుకుంటే డబ్బులు లేవు. ఉద్యోగం చేయాలనుకుంటే డిగ్రీ లేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఆ సమయంలో విజయవాడలో వ్యాపారం చేయటానికి ఒక అవకాశం వచ్చింది. నెలకు రూ.100 జీతం. లాభాల్లో 15 పైసలు వాటా. ఇలా 'కిసాన్ ఇంజనీరింగ్ వర్క్స్'లో వర్కింగ్ పార్టనర్‌గా జీవితం ప్రారంభమయింది. వ్యాపారం బాగా నడుస్తోంది. పార్టనర్‌షిప్ అమ్మేస్తుంటే నా భార్యకు ఇచ్చిన ఐదెకరాల పొలం అమ్మేసి కొన్నాం. ఆ తర్వాత వ్యాపారం బాగా సాగింది. ఒక వేళ సినిమాల్లోకి రాకపోతే వ్యాపారమే కొనసాగించి ఉండేవాణ్ణి.

మరి సినిమాల్లోకి ఎలా వచ్చారు?

చిన్నప్పటి నుంచి అందరూ- "బావున్నావు... హీరో కావచ్చు కదా..." అంటూ ఉండేవారు. నేను ఎప్పుడూ పెద్ద ఆసక్తి చూపించలేదు. అట్లూరి పూర్ణచంద్రరావుగారు 'జగమే మాయ' అనే ఒక సినిమా తీస్తుంటే నాకు కూడా ఒక ఆఫర్ వచ్చింది. అది విలన్ వేషం. హీరో గిరిబాబు. నన్ను చూసిన తర్వాత- విలన్ వేషానికి గిరిబాబును, హీరో వేషానికి నన్ను మార్చారు. 'వ్యాపారం బాగా సాగుతోంది..వెళ్లాలా? వద్దా?' అనే మీమాంసలో పడ్డాను. అప్పుడు మా ఆవిడ- "లక్ష్మీదేవి తలుపు తట్టింది. ఎవరికో కానీ ఆ అదృష్టం రాదు. మీకు వచ్చింది. వద్దంటే వెళ్లిపోతుంది.. మీరు వెళ్లండి. షూటింగ్ అయిన వెంటనే విజయవాడ వచ్చేయండి" అంది. ఆ షూటింగ్‌ను నేను బాగా ఎంజాయ్ చేశాను. ప్రముఖ నటుడు రమణమూర్తి గారు నాతోను, గిరిబాబుతోను రిహార్సల్స్ చేయించేవారు. డబ్బింగ్ సమయంలో సాయికుమార్ వాళ్ల నాన్నగారు (పి.జె.శర్మ) - మాకు డైలాగ్స్ మాడ్యులేషన్‌లో తర్ఫీదు ఇప్పించారు. సినిమా బాగానే ఆడింది. ఆ తర్వాత గిరిబాబుకు చాలా వేషాలు వచ్చాయి. నాకు ఏడాది గ్యాప్ వచ్చింది. మళ్లీ విజయవాడ వచ్చేసా. ఆ తర్వాత దాసరి నారాయణరావుగారు 'తిరుపతి' అనే సినిమా తీసారు. అది కూడా బాగా ఆడింది. దాసరిగారితో అనుబంధం బలపడింది. ఆ తర్వాత ఆయన నాకు ఎన్నో వేషాలు ఇచ్చారు.

చంద్ర రాజేశ్వరరావుగారి ఇంట్లో..

విజయవాడలో మేము ప్రముఖ కమ్యూనిస్టు నేత చంద్రరాజేశ్వరరావుగారి అవుట్‌హౌస్‌లో అద్దెకు ఉండేవాళ్లం. ఆయనతో మాకు ఎక్కువ పరిచయం లేదు. అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవారు. ఇంట్లో ఆయన మామగారు ఉండేవారు. ఆయనను నేను ఒక్కసారి మాత్రమే కలిసిన జ్ఞాపకం. "నీ గురించి విన్నా.. బిజినెస్ బావుందిట కదా!" అన్నారు. ఆ ఇంటికి పెద్ద కాంపౌండ్ ఉండేది. దాంట్లో మా ఆవిడ రకరకాల కూరగాయలు పండించేది. పూల చెట్లు వేసేది. పెద్దాయన వాటిని చూసి బాగా మురిసిపోయేవారు. "ఇల్లు నీదే అనుకో.. ఏమి కావాలో కోసుకో" అనేవారు. అప్పుడు నాకు రూ.100 జీతం. దాంట్లో రూ.40 అద్దె. వారానికి రెండు సినిమాలు చూసేవాళ్లం. వచ్చేటప్పుడు ఐస్‌క్రీం తినేవాళ్లం. మార్కెట్‌కు వెళ్లి కూరలు తెచ్చుకొనేవాళ్లం. అప్పుడు నాకొక మోటార్ సైకిల్ ఉండేది. దాని వెనక మా ఆవిడ కూర్చొని బాబును ఎత్తుకొనేది. పాపను ముందు కూర్చోపెట్టుకునేవాళ్లం. ఆ రోజులు ఎంత ఆనందంగా గడిచాయా అనిపిస్తుంది.

రఫ్‌గా ఉన్నా చూస్తున్నారు...

ఒకప్పుడు హీరో కావటం కష్టం. 'ఆరడుగులు ఉండాలి. తెల్లగా ఉండాలి. అందంగా ఉండాలి' అనుకొనేవారు. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. రజనీకాంత్‌ను హీరోగా ప్రేక్షకులు ఆదరిస్తారని ఆ సమయంలో ఎవ్వరూ అనుకోలేదు. ఇప్పుడు హీరో అంటే అందంగా ఉండాల్సిన అవసరం లేదు. రఫ్‌గా ఉన్నా చూస్తారు. ఎక్కడికో ఎందుకు... మొదట చిరంజీవిగారు అంత గ్లామర్‌గా ఉండేవారు కాదు. కానీ ఆయనకో ప్రత్యేకమైన స్టైల్ ఉంది. అందుకే ఆయన ప్రజల మనస్సుల్లోకి దూసుకువెళ్లిపోయారు.

ఆ రోజుల్లో విజయవాడలో కమ్యూనిస్టు భావజాల ప్రభావం ఎక్కువగా ఉండేది.. మీపై ఆ ప్రభావం లేదా?

లేదు. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటిది- నేను రాజకీయాలకు దూరంగా ఉండేవాణ్ణి. రెండోది మాది కాంగ్రెస్ ఫ్యామిలీ. నాన్నగారు- మాగంటి మాధవరావుగారు స్వాతంత్ర్య పోరాట యోధుడు. ఆయన కజిన్స్ అందరూ జాతీయోద్యమంతో సంబంధం ఉన్నవారే. మాకు మాగంటి అన్నపూర్ణమ్మగారనే బంధువు ఉండేవారు. ఆమె ఎప్పుడూ ఇంగ్లాండ్ నుంచి దిగుమతి అయిన చీరలు కట్టేవారట! ఏలూరులో గాంధీగారి సభ తర్వాత- విదేశీ చీరలన్నీ తగలబెట్టి.. కేవలం ఖాదీ మాత్రమే కట్టేవారు. నేను ఇలాంటి వాతావరణంలో పెరిగాను. ఎందుకో తెలియదు కానీ... నాకు చిన్నప్పటి నుంచి వ్యాపారంపైనే ఆసక్తి ఉండేది. నాన్నగారు ఆ సమయంలో ఆదిలాబాద్ జిల్లాలో ఫారెస్ట్ కాంట్రాక్ట్స్ చేసేవారు. సెలవుల్లో నేను అక్కడికి వెళ్లి పనిచేసేవాణ్ణి. అక్కడి వర్కర్లు - " చిన్న పిల్లవాణ్ణి ఫారెస్ట్‌లో తిప్పుతున్నారెందుకూ?" అని నాన్నను అడిగేవారు. అప్పుడు నాన్న - 'వాడు చెప్పినా వినటం లేదు.. పనిచేయనివ్వండి. జీవితమంటే తెలుస్తుంది" అని సమాధానం చెప్పేవారు.

పరిశ్రమను చూసి మీరు నేర్చుకున్నదేమిటి?

మా సమయంలో బాగుపడిన వారు ఉన్నారు. చెడిపోయిన వారు ఉన్నారు. కొందరిని చూసి ఎలా ఉండాలో నేర్చుకున్నా. మరి కొందరిని చూసి ఎలా ఉండకూడదో నేర్చుకున్నా. ఆ సమయంలో విలువలు, కట్టుబాట్లు కూడా అలాగే ఉండేవి. నేను హీరోగా మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో ఒక తమిళం పత్రికలో- నాకు, జయచిత్రకు పెళ్లి జరగబోతోందని రాశారు. ఆ వార్తను చదివి- నాకు మొదటి అవకాశం ఇచ్చిన పూర్ణచంద్రరావుగారు ఫోన్ చేశారు. ఎక్కడున్నావని అడిగితే వాహినీ స్టూడియోలో షూటింగ్‌లో ఉన్నానన్నాను. ఆయన అక్కడకు వచ్చారు. "నువ్వు తప్పు చేయవని నాకు తెలుసు. అయినా ఒక వేళ తప్పు చేస్తే హెచ్చరిద్దామని వచ్చా" అన్నారు. ఆయన నాపై చూపించిన ఆ పుత్ర ప్రేమకు ఎలా స్పందించాలో అర్థం కాలేదు. "మీకు అగౌరవం కలిగే ఏ పని నేను చేయను" అని ఆ రోజున ఆయనకు హామీ ఇచ్చాను. ఎప్పుడూ దానికే కట్టుబడి ఉన్నాను. నా సినీ జీవితమంతా ఇష్టంగా కష్టపడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే- చాలా తృప్తిగా అనిపిస్తుంది.

ఈ రోజు అలాంటి పరిస్థితులు ఉన్నాయా?

లేవు. సినిమా అయిపోయిన తర్వాత ఒకరినొకరు మరచిపోతున్నారు. ఒకసారి పూర్ణచంద్రరావుగారు నాతో- "నేను ఎంతోమందిని పరిచయం చేశాను. ఏ ఒక్కరూ... ఏ ఇంటర్వ్యూలోనూ నా పేరు చెప్పరు. నువ్వు మాత్రం చెబుతున్నావు.. చాలా ఆనందంగా ఉంది" అన్నారు. మనకు సినీ జీవితాన్ని ఇచ్చిన వారిని మర్చిపోతే ఎలా? వారి పట్ల జీవితాంతం కృతజ్ఞతగా ఉండాలని నేను భావిస్తాను.

మీ కెరీర్‌లో- 'ఈ పాత్ర అనవసరంగా చేసానే' అని బాధపడిన సందర్భాలున్నాయా?

లేదు. ఎప్పుడూ కొన్ని విలువలకు కట్టుబడే చేశాను. కానీ దాసరిగారు తీసిన 'ముద్దబంతిపువ్వు' అనే ఒక సినిమా మాత్రం చేదు అనుభవం మిగిల్చింది. దీనిలో నాది తాగుబోతు పాత్ర. షూటింగ్ సమయంలో గురువుగారు దాసరి- "దీనితో నీ ఇమేజ్ మారిపోతుంది.. చూసుకో" అన్నారు. సినిమా విడుదలయిన తర్వాత నేను, దాసరిగారు విజయవాడలో సినిమా చూడటానికి వెళ్లాం. నా తాగుబోతు సీన్లలో ప్రేక్షకులు గట్టిగా అరవటం మొదలుపెట్టారు. నాకు ఎక్కడో తేడా జరిగిందని అర్థమయింది. ఇంటర్వెల్ తర్వాత- నేను, గురువుగారు వచ్చేశాం. ఆ తర్వాత తాగుబోతు క్యారెక్టర్లు చేయకూడదని నిర్ణయించుకున్నా.

ప్రేక్షకుల్లో మార్పు వచ్చింది

బెంగాలీ, మలయాళ భాషల్లో సింగిల్ పాయింట్‌తో సినిమాలు తీస్తారు. మనకు మాత్రం సినిమాలో అన్నీ ఉండాలి. సంపూర్ణమైన మృష్టాన్న భోజనంలా ఉండాలని ఆశిస్తారు. కానీ ఈ మధ్యకాలంలో తెలుగు ప్రేక్షకుల్లో కూడా మార్పు వచ్చింది. ఇంగ్లీషు సినిమాల మాదిరిగా ఉంటే తప్ప చూడటం లేదు.

నెంబర్ వన్ హీరో కావాలని ఎప్పుడూ అనుకోలేదా?

లేదు. నాకు ఎప్పుడూ అలాంటి ఆశలు లేవు. కుటుంబపరమైన పాత్రల్లో నాగేశ్వరరావు, శోభనబాబు, మురళీమోహన్- అని అనుకొనే స్థాయికి వెళ్లాను. నేను ఎప్పుడూ పెద్ద హీరోలతో పోటీ పడలేదు. నా సినిమాల బడ్జెట్ తక్కువ ఉంటుంది కాబట్టి పెద్ద హీరోల సినిమాల్లో చేస్తే మంచి పేరు వస్తుందనుకొనేవాణ్ణి. అందుకే సెకండ్ హీరో పాత్రలు కూడా చేశా. నన్ను ఎవరు చూసినా- ఇలాంటి భర్త.. ఇలాంటి అన్నయ్య.. ఇలాంటి నాన్నగారు.. ఇలాంటి తాతయ్య ఉంటే బావుండునని అనుకుంటారు. ఆ ఇమేజ్ నాకు చాలు. అందుకే 50 ఏళ్లు దాటిన తర్వాత - నేను ఇకపై హీరో క్యారెక్టర్లు చేయనని చెప్పాను. ఎందుకంటే- జనం విసిగిపోయి- 'వీడు హీరో ఏమిట్రా' అనుకొనే పరిస్థితికి రాకూడదనేది నా ఉద్దేశం.

మార్పు తెచ్చింది చిరంజీవే!

'మనవూరి పాండవులు' సమయంలో నాకు మంచి మార్కెట్ ఉంది. నాకు తమ్ముడుగా వేసిన చిరంజీవి నా కళ్లముందే ఆకాశమంత ఎత్తు ఎదిగిపోయాడు. ఆయనను చూస్తే నాకు జెలసీ ఉండదు. నేను ఎందుకంటున్నానంటే- ఆ స్టైల్ భిన్నంగా ఉండేది. మంచి కళ్లు ఉండేవి. సాంగ్స్, ఫైట్స్‌లో వ్యవస్థనే మార్చేశాడు. రిథమిక్‌గా చేసేవాడు. మార్పును తీసుకువచ్చింది మాత్రం చిరంజీవే!

విలువల ఆధారంగానే...

నేను 25 సినిమాలు తీశా. 'జయభేరి ప్రొడక్షన్'లో వచ్చే సినిమాలకు కొన్ని విలువలు ఉండాలనుకొనేవాడిని. మా బ్యానర్‌లో వచ్చిన చిత్రాలలో ఎక్కడా అశ్లీలత, అసభ్యత ఉండదు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తాం. మహిళలను గౌరవిస్తాం. కానీ కాలం మారిపోయింది. ఇప్పుడు హీరోలకు కూడా నెగెటివ్ షేడ్స్ ఉండాలంటున్నారు. 'అతడు' సినిమా తీయకముందు- త్రివిక్రమ్ మాకు మూడు గంటల కథ చెప్పాడు. అంతా అయిన తర్వాత- "కథ బావుంది. కానీ హీరో క్యారెక్టర్‌లో నెగెటివ్ షేడ్స్ ఉన్నాయి" అన్నాను. అప్పుడు త్రివిక్రమ్ - "హీరో శ్రీరామచంద్రుడిలా ఉండాల్సిన అవసరం లేదు. నెగెటివ్ నుంచి పాజిటివ్‌గా ఎలా మారాడనే విషయమే ముఖ్యం. ఇంగ్లీషు సినిమాలు చూస్తే అలాగే ఉంటాయి" అన్నాడు.

మీరు గతంలో 25 సినిమాలు తీసారు. ఇప్పుడు మళ్లీ తీసే ఆలోచన ఉందా?

గత రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నా. నాకు నచ్చే కథలు ఇతరులకు నచ్చుతాయో లేదో తెలియదు. నా ఉద్దేశంలో సినిమాకు సామాజిక బాధ్యత కూడా ఉంది. యువతీ, యువకులను పాడుచేసే సినిమాలు తీయకూడదు. గతంలో నేను, మా తమ్ముడు కిషోర్, ప్రభాకరరెడ్డిగారు, సత్యన్నారాయణగారు- ఇలా అందరూ కూర్చుని కథ వినేవాళ్లం. ఏ ఒక్కరికి నచ్చకపోయినా వదిలేసేవాళ్లం. ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. 'ఒసేయ్...', 'ఏరా...' అనటం.. మగాళ్లు, ఆడవాళ్లు కలిసి మందు తాగటం, సిగరెట్లు కాల్చటం... ఇలాంటి సినిమాలు నేను తీయలేను. అంతేకాదు... పెద్ద హీరోల చుట్టూ తిరిగి... రెండేళ్ల తర్వాత డేట్స్ ఇస్తే సినిమా చేయాలని లేదు. హీరో మార్కెట్ ఎలా ఉంటుందో తెలియదు. ఇదివరకు ఆరేడు సినిమాలు ఫెయిల్ అయినా ఒక సక్సెస్ వస్తే మార్కెట్ ఉండేది. ఇప్పుడు రెండు సినిమాలు ఫెయిల్ అయితే ఎవరూ దగ్గరకు వెళ్లరు.



విశ్వాసం ఉండేది...

ఒకప్పుడు 90 రోజుల్లో సినిమాను విడుదల చేసేసేవాళ్లం. 20 రోజులు ప్రీ-ప్రొడక్షన్, 30 రోజులు షూటింగ్, 20 రోజులు పోస్ట్ ప్రొడక్షన్ ఉండేవి. అప్పట్లో మాకు మానిటర్స్ ఉండేవి కావు. కాబట్టి డబ్బింగ్ సమయం దాకా షాట్స్ ఎలా వచ్చాయో తెలిసేవి కావు. డైరక్టర్స్ యాక్టర్స్.. అందరం చాలా జాగ్రత్తగా ఉండేవాళ్లం. మేము తీసిన షాట్ మీద మాకొక విశ్వాసం ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఒక షాట్ అయిన వెంటనే అందరూ మానిటర్ దగ్గరకు వచ్చి చూస్తున్నారు. దాంతో మళ్లీ ఇంకో షాట్ తీయటం ఆలస్యమవుతోంది. దీనివల్ల వ్యయం విపరీతంగా పెరిగిపోతోంది.

● సీవీఎల్ఎన్ ప్రసాద్



భరద్వాజీయం

రీల్ హీరోలు రియల్ హీరోల్లా నిలబడ్డారు

కోటశ్రీనివాసరావు గారికి నిమ్మ రసం ఇవ్వడంతో కథ సుఖాంతం అయిపోయిందని గత వారం చెప్పుకున్నాం కదా. అంటే ఆ 'పార్ట్' మాత్రమే అక్కడితో ముగిసింది... అంతే. కానీ అసలు కథ ఆ తరువాతే మొదలైంది. అంటే 'పార్ట్-2' అన్నమాట. నాడు మా ముందున్న ప్రధాన ప్రశ్న ఏంటంటే... షూటింగ్‌లు ఎలా చేయాలని. మద్రాసు నుంచి వర్కర్లు రామన్నారు. కొంతమంది హీరోలేమో... 'డ్యాన్స్‌లు, ఫైట్లు ఇక్కడవాళ్లకు సరిగ్గా రావు కదా. ఫైటింగ్ సన్నివేశాల్లో ముఖం మీద ఏదన్నా దెబ్బ తగిలితే మేం ఏమైపోతాం? మా ముఖం చూసే కదా మమ్మల్ని ఆదరించేది' అని భయపడ్డారు. ఈ పరిస్థితులను ఎలా అధిగమించాలి? అప్పట్లో నేను, శ్యాం, సురేశ్‌బాబు, అక్కినేని వెంకట్, నాగార్జున, వెంకటేశ్... మేమంతా రోజూ 'పద్మాలయ స్టూడియో'లో కూర్చొనేవాళ్లం. సాయంత్రం అయ్యేసరికి హనుమంతరావు గారు అందరికీ టిఫిన్లు ఏర్పాటు చేసేవారు. సరదాగా అక్కడ కబుర్లు చెప్పుకొంటూ గడిపేవాళ్లం కానీ... ఎవరికి వాళ్లకి టెన్షన్. 'మొదలు పెట్టిన సినిమాల పరిస్థితి ఏంటి? నిర్మాతలు ఏమైపోతారు? ఓడిపోయి మళ్లీ మనందరం చెన్నై వెళ్లాల్సి వస్తుందా? పరిశ్రమను ఇక్కడ నిలబెట్టుకోవాలంటే ఏంచేయాలి?'.. అందరి మదిలో ఇవే మెదులుతుండేవి. వీటిని పరిష్కరించే ఆలోచనతోనే నేను, సురేశ్‌బాబు, శ్యాం, వెంకట్ చెన్నై వెళ్లాం. అక్కడ మా దినచర్య ఏంటంటే... పొద్దున్నే లేచి దాసరి నారాయణరావు గారి ఇంటికి వెళ్లాలి. ఆయన మమ్మల్ని కూర్చోబెట్టి, ఏ ఫెడరేషన్ వాళ్లకో, చాంబర్‌కో ఫోన్ చేసేవారు. మేం వెళ్లి వాళ్లను కలిసేవాళ్లం.



చాంబర్‌లో రెండు మూడు సమావేశాలు జరిగాయి. నిర్మాతలంతా వచ్చారు. 'ఫెఫ్సీ'వాళ్లను పిలిచి, కలిసి పని చేయడానికి ఉన్న మార్గాల మీద చర్చించారు. 'ఫెఫ్సీ' వాళ్లతో పాటు ఇక్కడి ఫెడరేషన్ కార్యదర్శిగా నేను, అధ్యక్షుడిగా సీవీఆర్ ప్రసాద్ గారు చర్చల్లో పాల్గొన్నాం. సురేశ్‌బాబు, నాగార్జున, వెంకటేశ్ తదితరులు ఆర్టిస్టులు, చాంబర్ తరుపున వచ్చారు. చెన్నై వర్కర్లు ముప్పై నలభై మంది ఒక్కొక్కళ్లూ అనర్గళంగా మాట్లాడారు. 'మా దగ్గర కూడా తెలుగువాళ్లు ఉన్నారు కదా. వీళ్లందరూ నమ్ముకున్నది హైదరాబాద్‌లో పనినే. అలాంటప్పుడు మమ్మల్ని కాదని వేరే వాళ్లను పెట్టుకొంటే వీళ్లంతా ఏమైపోతారు' అనేది వాళ్ల వాదన. "మీరు చెప్పిందంతా బాగుంది. మేం యాభైల్లో సారథి స్టూడియో పెట్టినప్పటి నుంచి హైదరాబాద్‌లో వర్కర్లు పని నేర్చుకొంటున్నారు. జూనియర్ ఆర్టిస్టులు, లైట్‌మెన్.. ఇలా మా దగ్గర కూడా అన్ని క్రాఫ్ట్ ఉన్నాయి. పని లేకపోతే మరి మావాళ్లు ఏంచేయాలి" అని సీవీఆర్ ప్రసాద్ అడిగారు. 'మేం గుర్తించలేదు కాబట్టి మీవాళ్లు చేయకూడదు. మేమే చేయాలి' అన్నారు 'ఫెఫ్సీ' వాళ్లు. ఒక స్థాయిలో వాళ్ల నోట 'మీరు పనికిరానివాళ్లు... చేతగానివాళ్లు' అనే మాటలు వచ్చాయి. దాంతో నేను, సీవీఆర్ ప్రసాద్ సమావేశంలో నుంచి బయటకు వచ్చేశాం. సురేశ్‌బాబు తదితరులు 'మధ్యలో వెళ్లిపోతారేంటి? ఉండండి' అన్నారు. 'మేం ఉండం. మావాళ్లను మేం తయారు చేసుకొంటాం' అని వచ్చేశాం.

ఆ తరువాత ఆ సమావేశంలో చాలా ఘర్షణలు జరిగాయి. సురేశ్‌బాబు, నాగార్జున, వెంకటేశ్... 'ఫెఫ్సీ'వాళ్ల ధోరణిని తీవ్రంగా ఖండించారు. కొట్టుకొనే వరకు వెళ్లింది గొడవ. మన రీల్ హీరోలు రియల్ హీరోల్లా నిలబడ్డారు ఆ రోజు. నాగార్జున, వెంకటేశ్ అయితే అవతలివాళ్లను కొట్టినంత పని చేశారు. మేం ఇక్కడికి వచ్చాక మళ్లీ అదే ప్రశ్న.. ఏంచేయాలి? అందరూ కలిసి ఒకరోజు నాకు ఫోన్ చేశారు... 'ఏం చేద్దాం' అని. 'ఏం చేద్దాం? చెప్పండి' అన్నాను. ఇక్కడున్న ఫెడరేషన్‌ను తీసేయాలన్నారు. 'మరి మా వర్కర్లంతా ఎక్కడికి పోతారు' అని అడిగాను. కొత్తగా సినిమా వర్కర్లు అందరూ ఒకేచోట ఉండేలా వేరే ఆర్గనైజేషన్ పెట్టండన్నారు. అలా కొత్తగా ఏర్పడిన సంఘంలో వర్కర్లందరూ చేరిపోయారు. "వీళ్లందరూ చెన్నై నుంచి వచ్చే 'ఫెఫ్సీ' వాళ్లతో కలిసి పని చేయవచ్చు. జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లు, ఫైటర్లు, లైట్‌మెన్ తదితరులకు ఇంత పర్సెంటేజ్ ఇస్తాం" అని ఏదో మాట్లాడారు. 'ఏదో ఒకటి ముందు పని జరుగుతుంది కదా. ఏమీ లేకుండా ఇక్కడ నిర్మాతలను, నటులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదు' అని నేను అన్నాను. అలా ముందు పని మొదలుపెట్టాం. తరువాత మళ్లీ ఫెడరేషన్, యూనియన్లు పునరుద్ధరించాం. వాస్తవానికి వేటినీ మూసేయలేదు. చెన్నైవాళ్ల తృప్తి కోసం 'మూసేసి, కొత్త సంఘం పెట్టాం' అని చెప్పామంతే.

ఎప్పుడైతే ఫెడరేషన్, యూనియన్ల కార్యకలాపాలు తిరిగి ప్రారంభించామో... ఇక అక్కడి నుంచి 'మమ్మల్ని కూడా గుర్తించండి' అని మొదలుపెట్టాం. అలా పెరుగుతూ వచ్చి.. ఇక్కడి డ్యాన్సర్లు, ఫైటర్లు ముప్పై శాతం చేయవచ్చన్నారు. కొంతకాలం అయ్యాక అది 50 శాతానికి పెరిగింది. ఇవన్నీ జరుగుతుండగా... 'మాకు గుర్తింపు కావాలి' అని పోరాటం షురూ చేశాం. చాంబర్ అప్పట్లో మాకు చాలా సహకరించింది. ముంబయిలోని కాన్ఫడరేషన్‌తో మాట్లాడి, అక్కడి నిర్మాతలు కూడా వాళ్లపై ఒత్తిడి తెచ్చి మాకు గుర్తింపు రావడానికి తోడ్పడ్డారు. ఆ సహాయ సహకారాలతో ఆంధ్రా ఫెడరేషన్‌కు కూడా కాన్ఫడరేషన్‌లో సభ్యత్వం లభించింది. తరువాత మన ఫెడరేషన్ ఏ స్థాయికి వెళ్లిందంటే... కాన్ఫడరేషన్ అధ్యక్షుడు అయ్యే అవకాశం మనకు వచ్చింది. ఆ అవకాశం అప్పుడు నాకే ఇచ్చారు. ఆ పదవిని చేపట్టిన ఏకైక తెలుగువాడిని నేనొక్కణ్ణి. అంతకుముందు, ఆ తరువాత మరెవరూ లేరు.

పెద్ద హీరోలు, దర్శకులు షూటింగ్‌ల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లారని గతవారం చెప్పాను కదా. వాళ్లందరూ వెనక్కు వచ్చారు. హైదరాబాద్ మళ్లీ షూటింగ్‌లతో కళకళలాడింది. ఇవాళ మన దగ్గర నుంచి బయటకు వెళ్లేవాళ్లు ఉన్నారు తప్ప... బయటి నుంచి మనం తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. మన డ్యాన్స్, ఫైట్ మాస్టర్లే ముంబయి వంటి నగరాలకు వెళ్లి పని చేస్తున్నారు. వీటన్నిటికంటే ముందు 'అన్నపూర్ణ స్టూడియో'లో ఫైట్ మాస్టర్ రాజుతో ఫైటర్స్‌కు తరగతులు నిర్వహించాం. రాకేష్ మాస్టర్, రాజు మాస్టర్ విడివిడిగా డ్యాన్సర్లను తయారు చేశారు. రాకేష్ మాస్టర్ తిరుపతి నుంచి ముప్పై మందిని తీసుకువచ్చి శిక్షణ ఇచ్చారు. రాజుగారేమో ఇక్కడున్నవాళ్లకే తర్ఫీదునిచ్చారు. అలాగే సంగీతం కూడా. ఇదివరకు అక్కడి నుంచి వచ్చేవాళ్లు. ఇప్పుడు అంతా హైదరాబాద్‌లోనే జరుగుతోంది. ఇంతమంది కృషితో నేడు హైదరాబాద్‌లో పూర్తిస్థాయి సినీ పరిశ్రమ కొలువుతీరింది. 'రామోజీ ఫిలిమ్ సిటీ'లో చూస్తే... పెద్ద పెద్ద హిందీ చిత్రాలన్నీ దాదాపు అందులోనే జరుగుతున్నాయి. తమిళ చిత్రాల నిర్మాణం కూడా చాలావరకు ఇక్కడే. అంటే ఎక్కడివాళ్లయినా సరే... హైదరాబాద్ వచ్చి పని చేసుకొనే పరిస్థితి నెలకొంది. తెలుగు సినీ పరిశ్రమను ఈ స్థాయికి తీసుకురావడానికి మేమందరం పడిన కష్టాన్ని మీతో పంచుకోవాలనిపించి, ఇదంతా చెప్పుకొచ్చాను. థ్యాంక్యూ.

● తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకనిర్మాత



నేనొక ఎమోషనల్ ఫైటర్‌ని

బాలీవుడ్‌లో 'ఛయ్య.. ఛయ్య..' పాటతో పాపులర్ అయిన నటి మలైకా అరోరా. టెలివిజన్ వ్యాఖ్యాత, నటి, నిర్మాత అయిన మలైకా అనగానే గుర్తొచ్చేది ఐటం సాంగ్సే. ఆమె కెరీర్‌తో పాటు మరిన్ని జీవిత విశేషాలు ఇవిగో...

మలైకా అరోరా వయసు యాభై ఏళ్లు. ఆమె మాత్రం కుర్రహీరోయిన్లకు ఏమాత్రం తీసిపోకుండా హల్చల్ చేస్తుంది. ఆన్‌స్క్రీన్ మీదనే కాదు ఆఫ్‌లైన్‌లోనూ గ్లామర్‌లుక్‌లో కనపడుతోంటోందీ బ్యూటీ. కోటి ఎనభై లక్షల మంది నెటిజన్లు ఈ మున్నీని ఇన్‌స్టాలో ఫాలో అవుతున్నారు అంటే ఆమె క్రేజ్ బావుందని అర్థం.

అలాంటివేమీ పట్టించుకోను...

తొంభయ్యిల్లో బాలీవుడ్ ఐటమ్ సాంగ్స్‌తో పాపులర్ అయిన మలైకా అరోరాకు అదే ఫ్రేమ్ కంటిన్యూ అవుతోంది. తన భర్త అర్బాజ్‌ఖాన్‌తో విడిపోయాక.. ఆమె ప్రస్తుతం అర్జున్ కపూర్‌తో లవ్‌లో ఉంది. 'ఎవరేమనుకున్నా పట్టించుకోను. ఐటమ్ బాంబ్.. లాంటి ఎలాంటి ట్యాగ్స్ వేసినా పట్టించుకోను. నేనో పాసివ్ అగ్రెసివ్ పర్సన్‌ను. ఎమోషనల్ ఫైటర్‌ను. దేన్నీ పట్టించుకోను. అర్జున్ విషయంలో వయసులో చిన్నవాడని.. అంటారు. అర్జున్ నాకు అసలైన భాగస్వామి. అతనో ప్యూర్ సోల్. అందుకే అతన్ని ప్రేమిస్తాను. నా గురించి నా కొడుక్కి కూడా తెలుసు. రిలేషన్‌షిప్స్ దాచిపెట్టాలనుకోను. జనాల ఆలోచనల్లో మలైకా అంటే.. 'గుడ్ ఫేస్', 'బెస్ట్ బాడీ' అనిపించుకోవాలంతే. అందుకోసం ప్రయత్నిస్తాను. అందుకే జిమ్, కసరత్తులు. మళ్లీ నేనేంటో ప్రూవ్ చేసుకుంటా. అలాంటి రోజు త్వరలో వస్తుందని అనుకుంటున్నాను' అంటుంది మలైకా అరోరా.

అలా ఇండస్ట్రీలోకి...

స్వాహిలీ భాషలో మలైకా అంటే అర్థం.. 'ఏంజెల్'. చిన్నతనంలోనే తన పేరెంట్స్ విడిపోవటంతో తన అమ్మతో ఉండిపోయింది. తన చెల్లి పేరు అమృతా అరోరా. పుట్టి పెరిగింది మహారాష్ట్రలోని థానే ప్రాంతంలో. చెంబూర్‌లో డిగ్రీ చదివేప్పుడే మోడలింగ్ కెరీర్ వైపు వచ్చింది. ఎమ్‌టీవీలో వీజేగా పని చేసింది. మోడలింగ్‌తో పాటు యాడ్స్‌లోనూ నటించింది. అలా ఆమెకు 'దిల్‌సే' (1998)లో తొలిసారి ఐటంసాంగ్‌లో ఆడిపాడే అవకాశం వచ్చింది. ఛయ్యా.. ఛయ్యా.. పాట పాపులర్ అవటంతో ఆమె క్రేజ్ పెరిగింది. ఆమె అనుకోకుండా స్పెషల్ సాంగ్స్‌కే పరిమితం అయ్యేలా చేశారు దర్శకులు. తెలుగులో కూడా 'అతిథి', 'గబ్బర్‌సింగ్'లో ఐటమ్‌సాంగ్స్‌లో చిందులేసింది. అవార్డు ఫంక్షన్లలో, రియాలిటీ షోల్లో, డ్యాన్ ప్రోగ్రాములో ఇప్పటికీ ఆమె జడ్జిగా వ్యవహరిస్తోంది. స్మాల్ స్క్రీన్ అంటే ఎప్పటికీ ఇష్టమే అంటుందామె.



అలా ఉండటానికి ఇష్టపడతా...

'పెళ్లయి.. పిల్లలు అయినంత మాత్రాన కెరీర్ పోగొట్టుకోవాలనే నిబంధన లేదు. ఇప్పటికీ ట్రాక్ ప్యాంట్స్, జీన్స్‌లోనే కనిపిస్తా. అలా చిల్‌గా ఉండటానికే ఆసక్తి చూపుతా. అందమైన దుస్తులు ధరించి రెడ్‌కార్పెట్ మీద వాక్ చేయటం ఇష్టం. ఆ సమయంలో నన్ను నేను మర్చిపోతా. విల్‌పవర్ ఎక్కువే. ఆత్మవిశ్వాసంతో ఉంటా. జిమ్‌లో హార్డ్ వర్కవుట్స్ చేస్తా. యోగా సాధన చేస్తా. వీటితో పాటు ముఖ్యంగా మంచి ఆహారం తింటా. హెల్తీ లైఫ్ స్టయిల్ పాటిస్తా. ఏ జడ్జిమెంట్స్ పట్టించుకోను. జీవితం ఇలానే ఉండాలనే లేదు కాబట్టి మూవ్ అయ్యాను. జీవితం మీద ఎన్నో ఆలోచనలున్నాయి. ఇంకా ముప్పయ్యేళ్లు ఇలానే ఫిట్‌గా ఉండాలనుకునే మనిషిని. సినిమా, బిజినెస్, ప్రయాణాలు, స్నేహితులతో ఇపుడయితే హాయిగా జీవితం గడిచిపోతోంది. ఇప్పుడు మంచి స్థితిలోనే ఉన్నా'.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/U0d7upP లో చదవండి.







ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక సినిమా

టీజీ విశ్వప్రసాద్



రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన 'ఈగల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ సినిమా విశేషాలను మీడియాకు వెల్లడించారు.

● మేం నిర్మించిన 'ధమాకా' మాస్ ఎంటర్‌టైనర్ అయితే, 'ఈగల్' స్టయిలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. ఆడియన్స్‌ను అలరించే అంశాలు ఎన్నో ఉన్నాయి. రవితేజ చాలా కొత్తగా కనిపిస్తారు.

● ఈ సినిమాను జనవరిలో విడుదల చేయాలనుకున్నాం. కానీ పరిశ్రమ మేలుని దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరికి వెళ్లాం. ట్రేడ్ విషయానికి వస్తే అప్పుడు మేం సెకండ్ బెస్ట్. ఇప్పుడు నంబర్ వన్. మిగతా చిత్రాలు రీచ్ దేనికదే. ఈ ఏడాది మా సంస్థ నుంచి కనీసం 15 సినిమాలు విడుదలవుతాయి. అవి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ప్రొడక్షన్‌లో దాదాపు 6 చిత్రాలు ఉన్నాయి. అలాగే దాదాపు నాలుగు సినిమాలు అమెరికాలో చేస్తున్నాం. ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక చిత్రం విడుదల కానుంది. ఈ ఏడాది 50 చిత్రాల మైలు రాయిని అందుకుంటామని భావిస్తున్నాం.

ఆపరేషన్ తేదీ మళ్లీ మారింది



వరుణ్ తేజ్ నటించిన తొలి హిందీ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' విడుదల తేదీ మళ్లీ మారింది. వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్నీ, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అద్భుతంగా ఆవిష్కరించే ఈ చిత్రాన్ని మొదట గత ఏడాది డిసెంబర్ 8న విడుదల చేయాలనుకున్నారు. అ తర్వాత వాయిదా వేశారు. మళ్లీ ఫిబ్రవరి 16న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ డేట్ కూడా మారింది. మార్చి ఒకటిన ఈ చిత్రం విడుదల కానుందని తాజాగా వెల్లడించారు. తెలుగు, హిందీ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ హుడా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

మంచి కంటెంట్‌తో...



చైతన్యా రావు, భూమి షెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్, డాక్టర్ కృష్ణకాంత్ చిత్రజల్లు నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా టీజర్‌ను శనివారం జరిగిన కార్యక్రమంలో దిల్ రాజు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఒక మంచి కాన్సెప్ట్ తీసుకుని 'షరతులు వర్తిస్తాయి' చిత్రాన్ని నిర్మించారు. సాంగ్, టీజర్ చూశాను. బాగున్నాయి. ఇదొక మంచి సినిమా అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు. దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ 'ప్రేక్షకులకు చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా ఉండదు. మంచి కంటెంట్ ఉంటే తప్పకుండా చూస్తారు. మా సినిమాలో అది ఉంది. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం' అన్నారు. 'నేను కరీంనగర్ వాసిని. పరిశ్రమలో నటుడిగా ఎదిగి మళ్లీ కరీంనగర్ వెళ్లి షూటింగ్ చేయడం ఓ అచీవ్‌మెంట్‌గా ఉంది' అన్నారు చైతన్యారావు.

లక్కీ భాస్కర్ కథ ఏమిటి?



తెలుగులోనూ అభిమానుల్ని సంపాదించుకొన్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. తన తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకుడు. దుల్కర్ తన పన్నెండేళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'లక్కీ భాస్కర్' చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మగధ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న లుక్‌లో దుల్కర్ కనిపించారు. 80ల కాలం నాటి బొంబాయి నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా అద్భుతమైన చిత్రాన్ని అందించడం కోసం దర్శకనిర్మాతలు కృషి చేస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, మలయాళ, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్లాన్ చేస్తున్నారు.

ప్రేక్షకులకు ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లావణ్య కథానాయిక. ఈ చిత్రం ట్రైలర్‌ను నిర్మాత బన్నీవాసు విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'హీరో పాత్రలో విరాన్ అద్భుతంగా నటించాడు. పాటలకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది' అన్నారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'వేణు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. కిరణ్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

హనీమూన్ ప్రేమగీతం



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసినీ కీలకపాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. సంగీత దర్శకుడు కల్యాణి మాలిక్ స్వరపరచిన హృద్యమైన ప్రేమగీతాన్ని శనివారం రచయిత విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేసింది. ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు.


హనుమాన్ బాటలో ఆదిపర్వం



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎంఎస్‌కే నిర్మిస్తున్నారు. 1970 నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామా ఇది. "అమ్మోరు, అరుంధతి' చిత్రాల తరహాలోనే ఆదిపర్వం లోనూ గ్రాఫిక్స్ హైలెట్‌గా నిలుస్తాయని, 'హనుమాన్' చిత్రం లానే 'ఆదిపర్వం' కూడా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో నాగులాపురం నాగమ్మ పాత్రలో మంచు లక్ష్మి నట విశ్వరూపం చూడొచ్చని నిర్మాత చెప్పారు.

దిక్సూచి
DIKSUCHI

ఎన్ఐఎస్ఎంలో పీజీ ప్రోగ్రామ్



ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్(ఎన్ఐఎస్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. దీని వ్యవధి 15 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ, రీసెర్చ్ అనాలిసిస్ అనే మూడు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది.

అర్హత-ఎంపిక: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు దరఖాస్తుకు జతచేయాలి. ఇంగ్లీష్‌లో వెర్బల్, రిటెన్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు. అకడమిక్ ప్రతిభ, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** www.nism.ac.in

ఐఐటీ గాంధీనగర్‌లో పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్-ఎర్త్ సిస్టమ్స్ సైన్స్ అండ్ ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/బీటెక్/ఎంటెక్/బీఎస్(ఐసర్/ఐఐఎస్సీ)/బీఎస్-ఎంఎస్(ఐసర్)ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులకు; ఐఐటీలు, ఐసర్లు, ఐఐఎస్సీ నుంచి 8 సీజీపీఏతో పీజీ/ఎంఎస్ పూర్తిచేసినవారికి సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** iitgn.ac.in

అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. హైస్కూల్ స్థాయి మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం ఉండాలి. అకడమిక్ మెరిట్, అసెస్‌మెంట్ టెస్ట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

- మొదటి సెమిస్టర్‌లో బేసిక్ స్టాటిస్టిక్స్, బేసిక్ ప్రాబబిలిటీ, స్టాటిస్టికల్ మెథడ్స్, సర్వే శాంపిలింగ్, ఇంట్రడక్షన్ టు అఫీషియల్ స్టాటిస్టికల్ సిస్టమ్, స్టాటిస్టిక్స్ అండ్ ఎకానమీ కోర్సులు ఉంటాయి.
- రెండో సెమిస్టర్‌లో అఫీషియల్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్లు, క్విజ్‌లు, అసైన్‌మెంట్లు, ఇంటరాక్షన్ సెషన్స్, కెరీర్ వర్క్‌షాప్‌లు, మెంటార్‌షిప్ సెషన్స్ ఉంటాయి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అసెస్‌మెంట్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 25

నిమ్‌హాన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు



బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)- 'బేసిక్స్ ఆఫ్ యోగ థెరపీ ఫర్ మెంటల్ హెల్త్ ప్రొఫెషనల్స్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది సర్టిఫికెట్ కోర్సు. ఇందులో 100 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి ఒక నెల. రోజుకి రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు ఆన్‌లైన్ ట్రెయినింగ్ ఉంటుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగుంబావు నుంచి ఆరుంబావు వరకు ట్రెయినింగ్ సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సు చివరలో ఒక రోజు ఆఫ్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్‌ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు మెంటల్ హెల్త్ క్లినికల్ సర్వీసెస్ విభాగాల్లో పని చేస్తున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. (పీహెచ్‌డీ/ఎమ్మెస్సీ/ఎంఫిల్)(సైకియాట్రీ/క్లినికల్ సైకాలజీ/సైకియాట్రిక్ సోషల్ వర్క్/సోషల్ వర్క్/సైకియాట్రిక్ నర్సింగ్) ఉత్తీర్ణులు; కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సహా ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ఎన్‌జీఓ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** మార్చి 1 నుంచి
- **ఈ-మెయిల్:** yogaforstress.nimhans@gmail.com
- **వెబ్‌సైట్:** nimhans.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jW9q0LSలో చదవండి.

ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం

» వాటికి నిధులెలా వస్తాయో చెప్పలేదు: కిషన్‌రెడ్డి

» ఆరె కులాన్ని ఓబీసీలో చేరుస్తాం

హైదరాబాద్/నాచారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేసే అవకాశం లేదని.. అవన్నీ గారడీ మాటలే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కిషన్‌రెడ్డి విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీల అమలును పార్లమెంటు ఎన్నికలతో ముడి పెట్టవద్దని డిమాండ్ చేశారు. అసలు ఆ హామీలకు నిధులు ఎలా సమకూర్చుకుంటారో ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదని అన్నారు. "17 సీట్లు గెలిపించాలి.. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి.. రాహుల్ ప్రధాని కావాలి.. అప్పుడే 6 గ్యారెంటీల అమలు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ గెలిచేది లేదు.. గ్యారెంటీలు అమలయ్యేదీ లేదు" అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మన్ జనార్దన్ రాథోడ్, నర్సంపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత రాణా ప్రతాప్, పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లను కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో మెజారిటీ ఎంపీ సీట్లు గెలుచుకుంటామని చెప్పారు. ఆరె కులాన్ని ఓబీసీలో చేర్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. నాచారంలో శనివారం ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ సాధన సభలో ఆయన మాట్లాడారు. త్వరలోనే ఆరె కులస్థుల ఓబీసీ కల నెరవేరుతుందని చెప్పారు. ఆరె కులస్థులు చాలా వెనకబడి ఉన్నారని వారిని ఓబీసీలో చేర్చాల్సిన అవసరముందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఆరె కులస్థులు మరింత సంఘటితంగా సమస్యలపై పోరాడేశక్తిని సంతరించుకోవాలని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు.

బీజేపీలో చేరిన ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మన్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. జడ్పీ ఛైర్మన్ రాథోడ్ జనార్ధన్ శనివారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. 15 రోజుల క్రితమే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఆయన.. కాంగ్రెస్‌లో చేరేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఆ కార్యక్రమం వాయిదా పడటంతో బీజేపీలో చేరారు. జనార్ధన్ బీఆర్ఎస్‌ను వీడటంతో జడ్పీలో బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య 5కు చేరింది. మరో ఇద్దరు జడ్పీటీసీలు బీజేపీలో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. జనార్ధన్ వెంట బీజేపీలో చేరిన వారిలో నార్నూర్, ఉట్నూర్ మండలాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు. కాగా, వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కిషన్‌రెడ్డి సమక్షంలో శనివారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు.

హైదరాబాద్‌కు కొత్త కలెక్టరేట్

13ఎకరాల్లో.. 10 అంతస్తులతో.. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లకు నివాసాలూ అక్కడే

» ప్రజల కోసం క్యాంటీన్.. హెల్ప్‌సెంటర్

» పాటిగడ్డ స్థలం నిర్మాణానికి అనుకూలమన్న అభిప్రాయం

» సీఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం

» అధికారులతో సమీక్ష అనంతరం మంత్రి కోమటిరెడ్డి ప్రకటన



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా కోసం కొత్త కలెక్టరేట్ భవనాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. దాదాపు 13 ఎకరాల్లో జీ ప్లస్ 10 అంతస్తుల్లో అన్ని వసతులతో ఈ భవనం నిర్మించాలని భావిస్తోంది. పాటిగడ్డలో ప్రభుత్వ పరిధిలో ఉన్న విశాలవంతమైన స్థలంలో ఈ కొత్త కలెక్టరేట్‌ను నిర్మించే అవకాశం ఉంది. ప్రస్తుతం లక్డీకాపూల్‌లో ఉన్న కార్యాలయం అనువుగా లేకపోవడం, పూర్తి విభాగాలు అక్కడ లేకపోవడం, చాలామటుకు అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటంతో సర్కారు ఈ నిర్ణయానికొచ్చింది. హైదరాబాద్ కలెక్టరేట్‌లోని 250 మంది అధికారులు, సిబ్బందితో కూడిన 46 విభాగాలన్నీ అన్ని వసతుల మధ్య ఒకేచోట పనిచేసేలా.. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా ఈ భవనాన్ని నిర్మించాలని భావిస్తోంది. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సచివాలయంలో శనివారం అధికారులతో సమీక్ష సందర్భంగా హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టరేట్ భవనం గురించి ప్రకటించారు. గత ప్రభుత్వం 10లక్షల జనాభా కూడా లేని జిల్లాలకు కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి కలెక్టరేట్లను నిర్మించిందని, దాదాపు కోటి జనాభా ఉన్న హైదరాబాద్ కలెక్టరేట్ భవనం నిర్మాణంపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ప్రజా అవసరాలకు సరిపడేలా అధునాతన సౌకర్యాలతో 13 ఎకరాల్లో జీ ప్లస్ 9 లేదా, జీ ప్లస్ 10 అంతస్తుల్లో కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల అవసరాల కోసం క్యాంటీన్, హెల్ప్ సెంటర్‌ను కూడా ఏర్పాటుచేస్తామని చెప్పారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ నివాస భవనాలను కూడా అక్కడే నిర్మాణం చేస్తామని, అందుకు వీలుగా డిజైన్లను ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో భాగంగా భవన నిర్మాణానికి అనువైన స్థలంపై చర్చ జరిగింది. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వెనుకవైపు ఉన్న పదెకరాల స్థలం, మలక్‌పేటలో ఐటీ టవర్స్ కోసం కేటాయించిన పదెకరాల స్థలం, పాటిగడ్డలో ప్రభుత్వ పరిధిలో ఉన్న 13 ఎకరాల స్థలానికి సంబంధించిన వివరాలను మంత్రికి అధికారులు అందజేశారు. బంజారాహిల్స్‌లోని స్థలం కోర్టు వివాదంలో ఉండటం, పైగా అక్కడైతే ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యా యి. ఈ క్రమంలో బేగంపేట పరిసరాల్లోని పాటిగడ్డ ప్రాంతమైతే నగర ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అయితే పాటిగడ్డలో హైదరాబాద్ కలెక్టరేట్ భవనాన్ని నిర్మించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌తో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని సమీక్షలో నిర్ణయించారు. రెండు, మూడ్రోజుల్లో కలెక్టరేట్ భవనం డిజైన్లను ఖరారు చేసి ఇస్తామని మంత్రికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

33 ఏళ్ల క్రితం నాంపల్లిలో నిర్మించినా..

శనివారం సమీక్షలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్ భవనానికి సొంత భవనం కూడా లేదని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. గతంలో నాంపల్లిలో ఉన్న పాత కలెక్టరేట్ భవనం (1990లో నిర్మించారు) శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని లక్డీకాపూల్‌లోని రంగారెడ్డి జిల్లా పాత కలెక్టరేట్ భవనానికి తరలించినట్లు తెలిపారు. అక్కడా అన్ని శాఖలు అందుబాటు లో లేవని, కేవలం 7 విభాగాలే ఉన్నాయని, మరో 39 విభాగాలు వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ అంశాలతో పాటు, కొత్త భవన నిర్మాణ వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో మంత్రికి వివరించారు.

'రాడార్ స్టేషన్'ను వేరే చోటుకు మార్చండి: రంజిత్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టొద్దని, ఆ ప్రాజెక్టును వేరే చోటుకు మార్చాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాడార్ స్టేషన్ ఏర్పాటైతే ప్రజలకు, జంతువులకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణం జరిగితే విలువైన అటవీ, ఔషధ వృక్ష సంపద కాలగర్భంలో కలిసిపోతాయన్నారు. స్థానిక ప్రజలు ఆందోళనల దృష్ట్యా రక్షణ శాఖ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని ఎంపీ రంజిత్‌రెడ్డి కోరారు.

'సుల్తానాబాద్' మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3 బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతపై ప్రకటించిన అవిశ్వాసం నెగ్గింది. శనివారం మున్సిపల్ సమావేశం జరుగగా.. మొత్తం పద్నాలుగు మంది సభ్యుల్లో అవిశ్వాసానికి అనుకూలంగా పన్నెండు మంది కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో ప్రస్తుత చైర్‌పర్సన్ పదవిని కోల్పోయారు.



విక్టరీ బెల్‌ను మోగిస్తున్న క్యాన్సర్ విజేత. చిత్రంలో శ్రీధర్‌బాబు, సంగీతారెడ్డి

అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ 'విక్టరీ బెల్'

» చికిత్స తర్వాత మోగించనున్న బాధితులు

» ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను జయించినవారు.. ఆ విషయాన్ని బయటకు వ్యక్తం చేయడానికి అపోలో క్యాన్సర్ ఆస్పత్రి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చికిత్స పూర్తి చేసుకున్న రోగులు 'విక్టరీ బెల్' మోగించే ఏర్పాటు చేసింది. ప్రపంచ క్యాన్సర్ దినం నేపథ్యంలో అపోలో క్యాన్సర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విక్టరీ బెల్‌ను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. క్యాన్సర్ రోగులు అధైర్యపడొద్దని.. ఆత్మవిశ్వాసమే కొండంత బలమని ఆయన పేర్కొన్నారు. క్యాన్సర్ అనగానే ఒకవిధమైన భయాందోళనకు గురవుతారని, అయితే, మొదటి, రెండు దశల్లో గుర్తిస్తే నయం చేయవచ్చని.. కాబట్టి బాధితులకు కుటుంబ సభ్యులు, వైద్యులు భరోసా ఇవ్వాలని సూచించారు. అపోలో ఆస్పత్రి గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ విక్టరీ బెల్‌ను వ్యక్తిగత విజయ ప్రతిధ్వనిగా అభివర్ణించారు. ఆంకాలజీ యూనిట్లలో జరిగిన పోరాటాలనే కాకుండా ప్రతి రోగి ప్రయాణాన్ని ఇది చాటుతుందని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులపై మనిషి సాగించిన ప్రబలమైన సమరానికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. రోగి విజయం వెనుక ధైర్యం, ఆశ, బలంతో కూడిన కథ ఉంటుందన్నారు. అలాంటివారికి ఇది శక్తిమంతమైన రిమైండర్ అని వివరించారు. అపోలో క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పి.విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ విక్టరీ బెల్ శబ్దం.. క్యాన్సర్‌ను జయించిన రోగి స్థైర్యాన్ని సూచిస్తుందన్నారు.

జీఆర్ఎంబీ సమావేశం 13వ తేదీకి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) 15వ సమావేశం వాయిదాపడింది. ఈ నెల 6న సమావేశం జరగాల్సి ఉండగా తాజాగా ఈ సమావేశాన్ని 13కు వాయిదా వేస్తున్నట్లు బోర్డు తెలుగు రాష్ట్రాలకు తెలిపింది. గోదావరి బేసిన్‌లో ప్రాజెక్టుల డీపీఆర్‌లతోపాటు అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు, పెద్దవాగు ఆధునికీకరణ, గౌరవెల్లి రిజర్వాయర్‌పై ఎన్జీటీ కేసు, బోర్డుకు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ పోస్టుల భర్తీ, 2024-25లో రూ.15.135 కోట్ల కేటాయింపు ప్రతిపాదనలతోపాటు వివిధ అంశాలపై బోర్డు సమావేశంలో చర్చించనున్నారు. అయితే బడ్జెట్ సమావేశాలకు సన్నాహాలు జరుగుతున్నందున ఈ సమావేశం కూడా వాయిదా పడే అవకాశాలున్నాయి.

బూమ్ బూమ్.. బుమ్రా


ఆరు వికెట్లతో వి జృంభణ

భారత్ తొలి ఇన్నింగ్స్ 396

ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 253

రోహిత్ సేన ఆధిక్యం 171

రెండో టెస్టు



దృఢ సంకల్పానికి డబుల్ ఆనందం

జైస్వాల్ ద్విశతకం

(209)

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పుట్టింది పేద కుటుంబంలో.. అడుగడుగునా ఆర్థిక కష్టాలు.. కానీ, చిన్ననాటి నుంచే ఆటే శ్వాస.. క్రికెటర్ కావాలనే బలమైన సంకల్పంతో మరో ఆలోచన లేకుండానే 11 ఏళ్ల వయసులో ముంబై రైలెక్కేశాడు. ఆట కోసం అష్ట కష్టాలు పడ్డాడు.. చిన్నాచితక పనులతో కడుపు నింపుకొన్నాడు. కానీ, క్రికెట్ నుంచి మాత్రం దృష్టిని మరల్చలేదు. ముక్కుపచ్చలారని వయసులోనే జీవన పోరాటాన్ని ఆరంభించిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యశస్వీ జైస్వాల్.. భారత క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన జైస్వాల్.. అండర్-19 వరల్డ్‌కప్‌తో గుర్తింపు సాధించాడు. ఐపీఎల్‌తో వెలుగులోకి వచ్చి, అనతికాలంలోనే భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు. అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటున్న 22 ఏళ్ల జైస్వాల్.. వైజాగ్ టెస్టులో డబుల్ సెంచరీతో టీమిండియాలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. మ్యాచ్‌లో మిగతా బ్యాటర్లు పెవిలియన్ చేరుతున్నా.. మొక్కవోని పట్టుదలతో క్రీజులో నిలిచిన తీరు అతడి మానసిక దృఢత్వానికి అద్దంపడుతోంది. 5 టెస్టుల అనుభవమే ఉన్న యశస్వీ.. ఎంతో పరిణతి చెందిన ఆటను ప్రదర్శించాడు. ప్రత్యర్థి కెప్టెన్ బెన్ స్టోక్స్ ఎన్ని వ్యూహాలు రూపొందించినా, ఎంతగా ఊరించే బంతులేసినా కచ్చితమైన షాట్ సెలెక్షన్‌తో వాటికి సమాధానం చెప్పాడు. బషీర్ బౌలింగ్‌లో వరుసగా సిక్స్, ఫోర్‌తో కెరీర్‌లో తొలి ద్విశతకం మార్క్‌ను అందుకొన్నాడు. ఈ క్రమంలో మాజీ ఆటగాడు వినోద్ కాంబ్లీ తర్వాత డబుల్ సెంచరీ సాధించిన భారత పిన్నవయస్కుడిగా రికార్డులకెక్కాడు. గంభీర్ (2008లో) తర్వాత టెస్టుల్లో డబుల్ మార్క్‌ను అందుకొన్న తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా కూడా జైస్వాల్ నిలిచాడు.

3 టెస్టుల్లో భారత్ నుంచి డబుల్ సెంచరీ సాధించిన మూడో పిన్నవయస్కుడు (22 ఏళ్ల 37 రోజులు)గా జైస్వాల్. వినోద్ కాంబ్లీ, గవాస్కర్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. వీరిద్దరూ 21 ఏళ్ల వయసులో ఈ ఘనత అందుకున్నారు. అలాగే తక్కువ ఇన్నింగ్స్ (10)లో ద్విశతకం సాధించిన ఐదో భారత బ్యాటర్‌గా జైస్వాల్. కరుణ్ నాయర్ (3) తొలి స్థానంలో ఉన్నాడు.

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఓపెనర్ యశస్వీ జైస్వాల్ డబుల్ సెంచరీ (290 బంతుల్లో 19 ఫోర్లు, 7 సిక్సర్లతో 209)తో భారీ స్కోరు సాధిస్తే.. ఆ తర్వాత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (6/45) స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. ఫ్లాట్ వికెట్‌పై ఇంగ్లండ్ బజ్‌బాల్ ఆటతో చెలరేగుతుందనుకున్నా.. మిడిలార్డర్‌లో రూట్ (5), పోప్ (23), బెయిర్‌స్టో (25), బెన్ స్టోక్స్ (47), హార్ట్‌లీ (21)లకు బుమ్రా కళ్లెం వేయడంతో పర్యాటక జట్టు కుదేలైంది. ఫలితంగా రెండో టెస్టులో భారత్ ప్రస్తుతం 171 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అయితే, ఉప్పల్ టెస్టులోనూ రెండో రోజు ముగిసేసరికి భారత్ 175 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. కానీ, ఆ తర్వాత ఆ మ్యాచ్ ఎలా ముగిసిందో అందరం చూశాం. ఈసారి అలాంటి ఫలితం రాకుండా ఉండాలంటే ఆదివారం మన బ్యాటర్లు విజృంభించి భారీ ఆధిక్యం దక్కించుకోవాలి. ఇక.. శనివారం ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 396 పరుగులకు ఆలౌటైంది. అండర్సన్, బషీర్, రెహాన్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 55.5 ఓవర్లలో 253 పరుగులకు కుప్పకూలింది. జాక్ క్రాలే (76) అర్ధసెంచరీ సాధించాడు. కుల్దీప్ యాదవ్‌కు 3 వికెట్లు లభించాయి. రెండో రోజు ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. డబుల్ సెంచరీ హీరో జైస్వాల్ (15 బ్యాటింగ్), రోహిత్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



క్రాలే (76)

యశస్వీ డబుల్: రెండో రోజు ఆటలో తమ ఓవర్‌నైట్ స్కోరు 336/6కు భారత్ మరో 60 పరుగులు జోడించగలిగింది. ఇందులో యశస్వీవే 30 రన్స్ ఉన్నాయి. బషీర్ ఓవర్‌లో వరుసగా 6,4తో జైస్వాల్ డబుల్ సెంచరీని పూర్తి చేశాడు. అశ్విన్ (20)తో కలిసి ఏడో వికెట్‌కు 34 రన్స్ జోడించాడు. అనంతరం భారీ షాట్‌కు వెళ్లిన జైస్వాల్‌ను అండర్సన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత లంచ్‌కు అరగంట ముందు భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

స్వింగ్ దెబ్బకు ఢమాల్: ఫ్లాట్ వికెట్‌పై బుమ్రా రివర్స్ స్వింగ్‌తో మాయ చేశాడు. కళ్లు చెదిరే యార్కర్లకు తోడు అవుట్ స్వింగ్, ఇన్‌స్వింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటర్లకు ముచ్చెమటలు పట్టించాడు. భాగస్వామ్యం ఏర్పడిన ప్రతిసారీ కెప్టెన్ రోహిత్ బంతిని బుమ్రాకు అందించాడు. అందుకు తగ్గట్టే కెప్టెన్ నమ్మకాన్ని బుమ్రా నిలబెట్టాడు. కుల్దీప్ సైతం బుమ్రాకు మరో ఎండ్ నుంచి సహకరించాడు. వీరి దెబ్బకు ఇంగ్లండ్ 55.5 ఓవర్లు మాత్రమే ఆడగలిగింది. తొలి టెస్టు హీరో పోప్‌ను సూపర్ యార్కర్‌తో, కెప్టెన్ స్టోక్స్‌ను కట్టర్‌తో బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేసిన తీరు అద్భుతం. వాస్తవానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ వారి సహజశైలికి తగ్గట్టుగా ధాటిగానే సాగింది. ఓపెనర్లు క్రాలే, డకెట్ (21) తొలి వికెట్‌కు 59 రన్స్ చేర్చారు. ముఖ్యంగా స్పిన్నర్లపై క్రాలే ఎదురుదాడికి దిగి రన్స్ రాబట్టాడు. అయితే, అక్షర్ బౌలింగ్‌లో శ్రేయాస్ బ్యాక్‌వర్డ్ పాయింట్ నుంచి వెనక్కి పరిగెడుతూ అందుకున్న క్యాచ్‌తో క్రాలే వెనుదిరిగాడు. పోప్‌తో క్రాలే రెండో వికెట్‌కు 55 రన్స్ జత చేశాడు. ఆ తర్వాత మిడిలార్డర్‌ను కుదురుకోనీయకుండా వరుస ఓవర్లలో రూట్, పోప్‌ను బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ లంచ్ బ్రేక్ సమయానికి 155/4 స్కోరుతో నిలిచింది.

స్టోక్స్ పోరాడినా..: ఆఖరి సెషన్‌లోనూ బుమ్రా కదం తొక్కి ఆరంభంలోనే బెయిర్‌స్టోను అవుట్ చేశాడు. ఫోక్స్ (6), రెహాన్ (6)లను కుల్దీప్ దెబ్బతీయగా.. చివర్లో కెప్టెన్ స్టోక్స్ పోరాటానికి హార్ట్‌లీ సహకరించాడు. ఇద్దరూ బౌలర్లను ఎదుర్కొంటూ ఎనిమిదో వికెట్‌కు 47 రన్స్ జత చేశారు. ఈ దశలో మళ్లీ బంతి పట్టిన బుమ్రా ఫలితం సాధించాడు. 50వ ఓవర్‌లో నమ్మశక్యంకాని కట్టర్‌తో స్టోక్స్‌ను బౌల్డ్ చేసి కెరీర్‌లో 150వ వికెట్ పూర్తి చేశాడు. అటు స్టోక్స్ 'వాట్ ఈజ్ దిస్ బాల్' అన్నట్టుగా రెండు చేతులూ చాపి నిరాశగా వెళ్లాడు. ఆ తర్వాత హార్ట్‌లీ, అండర్సన్ (6)లను కూడా అవుట్ చేసిన బుమ్రా ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు చెక్ పెట్టాడు.



బుమ్రా (6/45)

భారత్ నుంచి టెస్టుల్లో అత్యంత వేగం (34 టెస్టులు, 6781 బంతుల్లో)గా 150 వికెట్లు తీసిన పేసర్‌గా బుమ్రా. అలాగే వకార్ యూనిస్ (27 టెస్టులు) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆసియా పేసర్‌గా బుమ్రా నిలిచాడు.

1 స్వదేశంలో ఓ భారత పేసర్ (బుమ్రా 6/45) అద్భుత గణాంకాలు నమోదు చేయడం ఈ శతాబ్దంలో ఇదే తొలిసారి.

2 టెస్టుల్లో మెరుగైన సగటు (20.28)తో 150+ వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా బుమ్రా. సిడ్నీ బార్నెస్ (ఇంగ్లండ్, 16.43) టాప్‌లో ఉన్నాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బెయిర్‌స్టో (బి) అండర్సన్ 209, రోహిత్ (సి) పోప్ (బి) బషీర్ 14, గిల్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 34, శ్రేయాస్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 27, రజత్ (బి) రెహాన్ 32, అక్షర్ (సి) రెహాన్ (బి) బషీర్ 27, భరత్ (సి) బషీర్ (బి) రెహాన్ 17, అశ్విన్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 20, కుల్దీప్ (నాటౌట్) 8, బుమ్రా (సి) రూట్ (బి) రెహాన్ 6, ముకేశ్ (సి) రూట్ (బి) బషీర్ 0, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 396 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-40, 2-89, 3-179, 4-249, 5-301, 6-330, 7-364, 8-383, 9-395, 10-396; **బౌలింగ్:** అండర్సన్ 25-4-47-3; రూట్ 14-0-71-0; హార్ట్‌లీ 18-2-74-1; బషీర్ 38-1-138-3; రెహాన్ 17-2-65-3.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) శ్రేయాస్ (బి) అక్షర్ 76, డకెట్ (సి) రజత్ (బి) కుల్దీప్ 21, పోప్ (బి) బుమ్రా 23, రూట్ (సి) గిల్ (బి) బుమ్రా 5, బెయిర్‌స్టో (సి) గిల్ (బి) బుమ్రా 25, స్టోక్స్ (బి) బుమ్రా 47, ఫోక్స్ (బి) కుల్దీప్ 6, రెహాన్ (సి) గిల్ (బి) కుల్దీప్ 6, హార్ట్‌లీ (సి) గిల్ (బి) బుమ్రా 21, అండర్సన్ (ఎల్బీ) బుమ్రా 6, బషీర్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 253 ఆలౌట్; వికెట్లపతనం:** 1-59, 2-114, 3-123, 4-136, 5-159, 6-172, 7-182, 8-229, 9-234, 10-253; **బౌలింగ్:** బుమ్రా 15.5-5-45-6; ముకేశ్ 7-1-44-0; కుల్దీప్ 17-1-71-3; అశ్విన్ 12-0-61-0; అక్షర్ 4-0-24-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 15, రోహిత్ (బ్యాటింగ్) 13; **మొత్తం: 5 ఓవర్లలో 28/0; బౌలింగ్:** అండర్సన్ 2-0-6-0; బషీర్ 2-0-17-0; రెహాన్ 1-0-5-0.

భారత్ 2 - 0 పాక్

డేవిస్‌కప్‌లో తొలిరోజు మనదే



రామ్‌కుమార్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌తో డేవిస్ కప్ గ్రూప్-1 ప్లేఆఫ్ పోరులో తొలిరోజు జరిగిన రెండు సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ జయకేతనం ఎగుర వేశారు. తద్వారా జట్టుకు 2-0 ఆధిక్యం అందించారు. శనివారం జరిగిన మొదటి సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-7 (3), 7-6 (4), 6-0తో పాక్ వెటరన్ స్టార్ ఖురేషిని చిత్తు చేసి భారత్‌కు శుభారంభం అందించాడు. రెండో సింగిల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ 7-5, 6-3తో అకీల్‌పై నెగ్గాడు. ఆదివారం జరిగే మ్యాచ్‌లో గెలిస్తే, పాక్‌పై భారత్‌దే పైచేయి. డబుల్స్‌లో బర్కతుల్లా/ముర్తజా జంటతో యుకీ భాంబ్రీ/సాకేత్ మైనేని జోడీ తలపడనుంది.

రన్నరప్.. కార్తీక్ జోడీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టర్కీలోని అంటాల్యాలో జరిగిన వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో గంటా సాయికార్తీక్ రెడ్డి డబుల్స్ రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో కార్తీక్-సిద్ధాంత్ జోడీ 3-6, 6-3, 8-10తో బోగ్దాన్ (రొమేనియా)-డొమినిక్ (చెక్) జంట చేతిలో ఓడింది.

నితీశ్, రాహుల్ సెంచరీలు

హైదరాబాద్ 458/8

హైదరాబాద్: నితీశ్ రెడ్డి (115), కెప్టెన్ రాహుల్ సింగ్ (108) సెంచరీలతో చెలరేగడంతో..మిజోరంతో రంజీట్రోఫీ ప్లేట్ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ ఆధిక్యం అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 120/1తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ రెండో రోజు ఆట ఆఖరికి 8 వికెట్లకు 458 పరుగులు చేసింది. ప్రగ్నయ్ రెడ్డి (91), రోహిత్ రాయుడు (60) అర్ధ శతకాలతో సత్తా చాటారు. కార్తికేయ (36), సంకేత్ (2) క్రీజులో ఉన్నారు. మోహిత్, కరియప్ప చెరో 3 వికెట్లు తీశారు. మిజోరం మొదటి ఇన్నింగ్స్‌లో 199 పరుగులు చేసింది. దాంతో హైదరాబాద్‌కు 259 రన్స్ ఆధిక్యం లభించింది.

ఇంకా.. టర్నింగ్ పిచ్‌లు ఏల?: గంగూలీ

విశాఖపట్నం: భారత్‌లో స్పిన్ పిచ్‌లు కాకుండా..స్పోర్టింగ్ వికెట్లు రూపొందించాలని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సూచించాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్ రెండోరోజు మధ్యాహ్నం భారత ప్రధాన పేసర్ బుమ్రా 6 వికెట్లతో చెలరేగిన నేపథ్యంలో గంగూలీ ఆ విధంగా స్పందించాడు. 'బుమ్రా, షమి, సిరాజ్, ముకేశ్ అమోఘంగా బౌలింగ్ చేస్తున్నారు. మనకు ఇంత మంచి పేస్ దళముండగా, దేశంలో ఇంకా టర్నింగ్ వికెట్లు ఎందుకు తయారు చేస్తున్నారో అర్థం కావడంలేదు' అని దాదా అన్నాడు.

మాథ్యూస్, దినేశ్ శతక మోత

• శ్రీలంక 410/6 • అఫ్ఘానిస్థాన్‌తో టెస్టు

కొలంబో: వెటరన్ బ్యాటర్లు ఏంజెలో మాథ్యూస్ (141), దినేశ్ చాందిమల్ (107) శతకాలతో కదం తొక్కడంతో అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో శ్రీలంక పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 80/0తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు రెండోరోజు ఆట ముగిసేసరికి 410/6 స్కోరు చేసింది. మాథ్యూస్, దినేశ్ నాలుగో వికెట్‌కు 232 పరుగులు జోడించారు. అఫ్ఘానిస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. దాంతో శ్రీలంక 212 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

సెమీస్‌లో అస్మిత ఓటమి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నీ బరిలో మిగిలిన ఏకైక భారత షట్లర్ అస్మిత చాలిహా కథ కూడా ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో అస్మిత 13-21, 12-21తో స్థానిక షట్లర్ సుపనిదా కతేథాంగ్ చేతిలో ఓటమి పాలైంది.

టైటాన్స్‌కు తప్పని నిరాశ

న్యూఢిల్లీ: తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. శనివారం దబాంగ్ ఢిల్లీ చేతిలో టైటాన్స్ 33-44 స్కోరుతో ఓటమిపాలైంది. టైటాన్స్‌కు ఈ సీజన్‌లో ఇది 16వ ఓటమి. అషూ మాలిక్ 20 పాయింట్లతో ఢిల్లీ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 39-23తో యు ముంబాపై గెలిచింది.

బిజినెస్

వచ్చే నెలలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు?

బ్యాంక్‌పై మనీ లాండరింగ్ ఆరోపణలు!

రంగంలోకి ఈడీ!!

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) లైసెన్సును వచ్చే నెలలో రద్దు చేసే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) యోచిస్తున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తొలుత డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పించాక బ్యాంక్‌పై వేటు వేయవచ్చన్నారు. ఈ విషయంపై ఆర్‌బీఐ ఇంకా తుది నిర్ణయానికి రాలేదని, పేటీఎం వివరణ కీలకం కానుందని వారన్నారు. కాగా, పీపీబీఎల్‌లో మనీలాండరింగ్ జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తిస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా అన్నారు. అలాగే, ఈ సంక్షోభంపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కూడా స్పందించారు. ఫిన్‌టెక్ కంపెనీలు బ్యాంకింగ్ నియమావళికి అతీతం కాదని, పీపీబీఎల్‌పై చర్యలు చేపట్టేందుకు ఆర్‌బీఐకి అన్ని అధికారాలున్నాయన్నారు. ఫిబ్రవరి 29 తర్వాత కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతో పాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని పీపీబీఎల్‌ను ఆర్‌బీఐ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే.

పీపీబీఎల్‌పై నిషేధం అందుకే..

మనీలాండరింగ్ ఆందోళనలు, కేవైసీ (వినియోగదారు ధ్రువీకరణ ప్రక్రియ) నిబంధనలను పాటించని కారణంగానే పీపీబీఎల్ సేవలపై ఆర్‌బీఐ నిషేధం విధించిందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. పీపీబీఎల్‌లో లక్షలాది అకౌంట్ల ప్రారంభంలో కేవైసీ నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఒకే పాన్ నంబర్‌తో పలు ఖాతాలు తెరిచిన ఉదంతాలు వేలకొద్ది ఉన్నాయన్నారు. కనీస కేవైసీతో తెరిచే ఈ అకౌంట్లలో కొన్నింటి ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ.కోట్లలో ఉండటం మనీలాండరింగ్ జరిగి ఉండవచ్చన్న సందేహాలకు తావిస్తోందన్నారు. పీపీబీఎల్‌లో దాదాపు 35 కోట్ల ఈ-వాలెట్లు ఉండగా.. అందులో 31 కోట్ల వాలెట్లు అచేతనంగా పడి ఉన్నాయని, మిగతా 4 కోట్ల వాలెట్లలోనూ జీరో లేదా అతి స్వల్ప బ్యాలెన్స్ ఉందని ఓ విశ్లేషకుడు తెలిపారు. కోట్ల సంఖ్యలో వాలెట్లు అచేతనంగా ఉండటాన్ని బట్టిచూస్తే, మనీలాండరింగ్ అక్రమాల కోసం చాలా మంది బోగస్ ఖాతాలు తెరిచి ఉండవచ్చన్నారు. పీపీబీఎల్‌లో కేవైసీ యాంటీ మనీలాండరింగ్ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ఆర్‌బీఐ 2021లోనే గుర్తించిందని, లోపాలను సరిదిద్దుకోవాలని బ్యాంక్‌ను ఆర్‌బీఐ అప్పట్లోనే నిర్దేశించిందన్నారు. అయినప్పటికీ, బ్యాంక్ వ్యవహారంలో మార్పు లేనందు వల్లే కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా 2022 మార్చిలో బ్యాంక్‌పై ఆర్‌బీఐ నిషేధం విధించింది. అలాగే, బ్యాంక్‌లో సమగ్ర ఆడిటింగ్ కోసం ఓ ఆడిటింగ్ సంస్థను కూడా నియమించింది. ఆడిటింగ్ రిపోర్టు ఆధారంగానే బ్యాంక్‌పై ఆర్‌బీఐ తాజా చర్యలు చేపట్టింది.

10 శాతానికి పేటీఎం షేరు ట్రేడింగ్ లిమిట్

పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు రోజువారీ ట్రేడింగ్ లిమిట్‌ను 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ శనివారం ప్రకటించాయి.

ఎస్‌బీఐ లాభం రూ.9,164 కోట్లు

ముంబై: ఎస్‌బీఐ.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం 35 శాతం క్షీణించి రూ.9,164 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం రూ.14,205 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో వేతనాలు, పెన్షన్ ఎరియర్స్ కోసం ఒకేసారి రూ.7,100 కోట్లు కేటాయించటంతో లాభదాయకత తగ్గిందని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. ఈ కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.98,084 కోట్ల నుంచి రూ.1,18,193 కోట్లకు పెరగగా, వడ్డీ ఆదాయం రూ.86,616 కోట్ల నుంచి రూ.1,06,734 కోట్లకు పెరిగిందని తెలిపారు. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.14 శాతం నుంచి 2.42 శాతాని (రూ.86,749 కోట్లు)కి, నికర ఎన్‌పీఏలు 0.77 శాతం నుంచి 0.64 శాతాని (రూ.22,408 కోట్లు)కి తగ్గినట్లు బ్యాంక్ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ		విజయవాడ	533
హైదరాబాద్	530	విశాఖపట్నం	555
4వ తేదీ		వరంగల్	532
చిత్తూరు	573		
గోదావరి	533	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	గోదావరి	108
వరంగల్	101	విజయవాడ	108
కరీంనగర్	101	గుంటూరు	109
మహబూబ్‌నగర్	101	ఒంగోలు	109
కర్నూలు	101	చిత్తూరు	118
విశాఖపట్నం	105		

మైక్రోసాఫ్ట్‌లో నాదెళ్ల సారథ్యానికి పదేళ్లు

గడిచిన దశాబ్దకాలంలో 1000% వృద్ధి చెందిన కంపెనీ షేరు



వాషింగ్టన్: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓగా తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల బాధ్యతలు చేపట్టి నేటితో పదేళ్లు పూర్తయ్యాయి. నాదెళ్ల సారథ్యంలో మైక్రోసాఫ్ట్ సరికొత్త శిఖరాలను అధిరోహించింది. పలు కొత్త రికార్డులను నమోదు చేసింది. గడిచిన దశాబ్దకాలంలో అమెరికన్ ప్రామాణిక ఈక్విటీ సూచీ ఎస్ అండ్ పీ 185 శాతం వృద్ధి చెందగా.. మైక్రోసాఫ్ట్ షేరు ధర మాత్రం 1,000 శాతానికి పైగా పెరిగింది. 2014 ఆరంభంలో 40 డాలర్ల స్థాయిలో ట్రేడైన కంపెనీ షేరు.. ప్రస్తుతం 411 డాలర్ల స్థాయికి చేరుకుంది. అంతేకాదు, నాదెళ్ల హయాంలోనే సంస్థ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) తొలిసారిగా లక్ష, 2 లక్షలు, 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాళ్లను అధిగమించింది. అమెరికన్ స్టాక్ మార్కెట్లో శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.05 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. ప్రపంచంలో 3 లక్షల కోట్ల డాలర్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన ఏకైక కంపెనీ ఇదే. అలాగే, అత్యంత విలువైన కంపెనీ కూడా. గడిచిన పదేళ్లలో మైక్రోసాఫ్ట్ తన షేర్‌హోల్డర్ల సంపదను 2.8 లక్షల కోట్ల డాలర్ల మేర పెంచింది. ఉదాహరణకు, నాదెళ్ల సారథ్యం చేపట్టిన సమయంలో మైక్రోసాఫ్ట్ షేర్లలో 10,000 డాలర్ల పెట్టుబడుల విలువ ప్రస్తుతం 1.13 లక్షల డాలర్లకు పెరిగింది.

కంపెనీకి మూడో సీఈఓ

మైక్రోసాఫ్ట్‌కు నాదెళ్ల మూడో సీఈఓ.. 1975లో మైక్రోసాఫ్ట్‌ను ఏర్పాటు చేసిన బిల్‌గేట్స్.. 1986లో కంపెనీని స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేశారు. కంపెనీ వ్యవస్థాపక చైర్మన్, సీఈఓ అయిన బిల్‌గేట్స్.. 2000 జనవరిలో సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో సీఈఓగా నియమితులైన స్టీవ్ బామర్ కంపెనీకి 14 ఏళ్లపాటు నేతృత్వం వహించారు. 2014 ఫిబ్రవరిలో కంపెనీ పగ్గాలు నాదెళ్ల చేతికొచ్చాయి. అంతకు ముందు నాదెళ్ల కంపెనీలో క్లౌడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

క్లౌడ్‌తో కదం తొక్కించాడు..

సారథ్య బాధ్యతలు చేపట్టాక నాదెళ్ల కంపెనీ వ్యాపార వ్యూహంలో పలు మార్పులు తీసుకొచ్చారు. అప్పటివరకు మైక్రోసాఫ్ట్‌కు విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ ప్రొడక్ట్ విక్రయాలు, రాయల్టీలే ప్రధాన ఆదాయ మార్గంగా ఉండేది. నాదెళ్ల తన హయాంలో విండోస్‌తో పాటు అజూర్ క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్, కృత్రిమ మేధ (ఏఐ) సేవలపై అధిక దృష్టిసారించారు. అంతేకాదు, 2018లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫామ్ గిట్ హబ్, 2022లో క్యాండీక్రష్, కాల్ ఆఫ్ డ్యూటీ వంటి వీడియోగేమ్స్ అభివృద్ధి సంస్థ యాక్టివిజన్ బ్లిజార్డ్‌ను మైక్రోసాఫ్ట్‌ను కొనుగోలు చేసింది. అంతేకాదు, ఈ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్ జీపీటీ అభివృద్ధి సంస్థ ఓపెన్ ఏఐలోనూ పెట్టుబడులు పెట్టింది. చాట్‌జీపీటీని తన ఉత్పత్తుల్లో వినియోగించుకోనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించడం గడిచిన ఏడాది కాలంలో కంపెనీ షేర్లు భారీగా పుంజుకున్నాయి.



ప్రముఖ జువెలరీ సంస్థ జోయాలుక్కాస్.. హైదరాబాద్‌లోని ఏఎస్ రావు నగర్‌లో కొత్తగా ఆధునీకరించిన షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి, శిల్పా రెడ్డి, క్రాంతి గ్రూప్ డైరెక్టర్ రవి కుమార్ పొలిశెట్టి, జోయాలుక్కాస్ సీఓఓ హెన్నీ జార్జ్, డీజీఎం అనీశ్ వర్గీస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ రిటైల్ మేనేజర్ రాజేశ్ కృష్ణన్, రీజినల్ మేనేజర్ రాబిన్ తంబి, బ్రాంచ్ ఇన్‌చార్జ్ జిన్స్ సెబాస్టియన్ పాల్గొన్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లాభంలో 16% వృద్ధి



హైదరాబాద్: డిసెంబరు తో ముగిసిన త్రైమాసికంలో సిటీ యూనియన్ బ్యాంక్ నికర లాభం 16 శాతం వృద్ధి చెంది రూ.253 కోట్లు గా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.218 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో నిర్వహణా లాభం తగ్గినప్పటికీ మొండి పద్దుల (ఎన్‌పీఏ) కోసం చేసిన కేటాయింపులు తక్కువగా ఉండటం కలిసి వచ్చిందని బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎన్ కామకోడి తెలిపారు. త్రైమాసిక కాలంలో స్థూల ఎన్‌పీఏలు 4.62 శాతం నుంచి 4.47 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.67 శాతం నుంచి 2.19 శాతానికి తగ్గినట్లు తెలిపింది. ఈ కాలంలో బ్యాంక్ డిపాజిట్లు 5 శాతం వృద్ధితో రూ.52,726 కోట్లకు చేరాయి.

విద్యా సంస్థలు అందించే అనుబంధ సేవలపై జీఎస్‌టీ చెల్లించాలా?



రాంబాబు గొండాల

ఇదీ GST

మన దేశంలో ఉన్న ప్రాధాన్యత రంగాల్లో విద్యా రంగం ఒకటి. విద్యకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా ప్రభుత్వం ఈ రంగానికి పలు ప్రోత్సాహకాలను అందిస్తోంది. అలాగే బోధన రుసుమునకు సంబంధించి జీఎస్‌టీ మినహాయింపు ఇస్తోంది. అయితే కొన్ని విద్యా సంస్థలు ముఖ్యంగా ప్రైవేట్ విద్యా సంస్థలు వివిధ రకాల అనుబంధ సర్వీస్‌లకు సంబంధించి విడివిడిగా ఫీజులు వసూలు చేస్తుంటాయి. ఉదాహరణకు స్పోర్ట్స్, యూనిఫారం, మెస్, హాస్టల్, స్కూల్ బస్ ఇలా వివిధ రకాల సర్వీస్‌లకు ఫీజు వసూలు చేస్తుంటాయి. అలాగే చాలా కళాశాలల్లో క్యాంటీన్‌లు కూడా ఉంటాయి. ఇవన్నీ బోధనేతర సేవలు. మరి ఇలా వసూలు చేసే బోధనేతర మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా అనే మీమాంస ఆయా విద్యా సంస్థలతో పాటు తల్లిదండ్రులకు కూడా ఉంటుంది. అలాగే ఇలాంటి సేవలు అందించటానికి విద్యా సంస్థలు బయటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. దానికి గాను విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి ఆయా సంస్థలకు చెల్లిస్తుంటాయి. మరి సదరు బయటి సంస్థలు తాము పొందిన మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాలా? ఈ విషయాలు మీ కోసం.

స్థూలంగా చెప్పుకోవాలంటే ఈ సేవలు రెండు రకాలు. మొదటిది విద్యా సంస్థ తాను విద్యార్థులకు అందించే సేవలు. వీటికి గాను జీఎస్‌టీలో పన్ను మినహాయింపులు ఇచ్చారు. అంటే బోధన రుసుముతో పాటుగా పైన చెప్పిన బోధనేతర సేవలకు సంబంధించి వసూలు చేసే మొత్త మీద ఆయా విద్యా సంస్థలు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఇక రెండో రకం.. విద్యా సంస్థలు తమ విద్యార్థుల కోసం బయటి వ్యక్తుల ద్వారా తీసుకునే సేవలు. ఉదాహరణకు మెస్, హాస్టల్, కాలేజీ బస్ మొదలైనవి. దీంతో పాటుగా విద్యా సంస్థలు తమ నిర్వహణ బాధ్యత అంటే క్లీనింగ్, సెక్యూరిటీ మొదలైన సేవలు బయటి వ్యక్తుల నుంచి పొందవచ్చు. వీటిలో ముఖ్యమైన సర్వీస్‌లు అంటే కాలేజీ బస్, మెస్, క్లీనింగ్, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ వంటి మొదలైన సర్వీసులు బయటి వ్యక్తులు అందజేసినప్పటికీ దాని మీద జీఎస్‌టీ ఎలాంటి వర్తించదు. ఇలా బయటి వ్యక్తులు అందించే సేవల మీద జీఎస్‌టీ మినహాయింపు పొందాలంటే సదరు విద్యా సంస్థలు ఇంటర్ లేదా అంతకంటే తక్కువ కోర్సులు అందించాలి. అంటే, ఏదేనీ ఇంజనీరింగ్ లేదా మెడికల్, మరేదైనా డిగ్రీ, పీజీ కాలేజీలకు పైన చెప్పిన ట్రాన్స్‌పోర్ట్, మెస్ వంటి సేవలు బయటి వ్యక్తులు అందిస్తుంటే.. అలాంటి సర్వీస్‌లపై జీఎస్‌టీ చెల్లించాలి.

మనం పైన చెప్పుకున్న సర్వీస్‌లు విద్యా సంస్థ నేరుగా విద్యార్థులకు అందించేవి లేదా విద్యా సంస్థలకు బయటి వ్యక్తులు అందించేవి. అలాకాకుండా, బయటి వ్యక్తులు నేరుగా విద్యార్థులకు సేవలు అందిస్తుంటే మాత్రం కోర్సులతో సంబంధం లేకుండా జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు కొన్ని కళాశాలల్లో బయటి వారు క్యాంటీన్ నిర్వహిస్తుంటారు. అందులోని ఐటమ్స్‌కు విద్యార్థుల నుంచి డబ్బు తీసుకుంటారు. అంటే వీళ్లు విద్యా సంస్థలకు కాకుండా నేరుగా విద్యార్థులకు సేవలు అందిస్తుంటారు. కాబట్టి, దీనికి జీఎస్‌టీ నుంచి ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు.

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే 'విద్యా సంస్థ' అంటే ఇంటర్మీడియట్ లేదా అంతకు తక్కువ కోర్సు అందించే స్కూల్ లేదా కాలేజీ. దీంతోపాటుగా ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి చట్ట ప్రకారం గుర్తింపు పొందిన కోర్సులు, వొకేషనల్ కోర్సులు అందించే కళాశాలలు. అంటే ఎలాంటి కోర్సులు నిర్వహించకుండా కేవలం కోచింగ్ ఇచ్చే సంస్థలు 'విద్యా సంస్థ' నిర్వచనంలోకి రావు. దీని అర్థం ఆయా కోచింగ్ సంస్థలు తాము కోచింగ్ నిమిత్తం వసూలు చేసే మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న షబ్బీర్ అలీ

ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ బాధ్యతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రార్థనల అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సలహాదారుగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

మోడల్ అగ్రికల్చర్ హబ్‌గా తెలంగాణ: తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, పత్తి ఉత్పత్తిలో మూడో స్థానంలో నిలిచిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం కేరళవ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ సచివాలయంలో మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ తెలంగాణను మోడల్ అగ్రికల్చర్ హబ్‌గా మార్చేందుకు ఇప్పటికే 20 స్టార్టప్ కంపెనీలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని, వాటిలో 15 కంపెనీలు ప్రాథమిక దశలో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విత్తన తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, డిజిటలైజేషన్ సీడ్ సర్టిఫికేషన్ విధానాన్ని అమలు చేశామన్నారు. ఆయిల్‌పామ్ పంటపై రైతుల్లో అవగాహన కల్పిస్తూ పంట విస్తీర్ణాన్ని పెంచుతున్నామని, అలాగే సిల్క్ ఉత్పత్తి 2015 నుంచి ఇప్పటివరకు 200 మెట్రిక్ టన్నులకు పెరిగిందని మంత్రి తుమ్మల కేరళ మంత్రికి వివరించారు.

రెవెన్యూ బలోపేతానికి చర్యలు: పొంగులేటి

రాష్ట్రంలో రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో కేరళ రెవెన్యూ శాఖ మంత్రి కె.రాజన్ మంత్రి పొంగులేటితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కేరళలో అమలవుతున్న హౌసింగ్ స్కీమ్, రెవెన్యూ విభాగం పనితీరు తదితర వివరాలను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజన్ తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పనిచేసే విధానం గురించి అడిగారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణలో గత ప్రభుత్వం రెవెన్యూ శాఖను నిర్వీర్యం చేసిందని, యంత్రాగాన్ని, వ్యవస్థను, దుర్వినియోగం చేసిందని, రెవెన్యూ చట్టాలను, అధికారాలను ఖూనీ చేసిందని చెప్పారు. ఈ తప్పులను సరిచేసి, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలకు ఉపక్రమించిందని వివరించారు.

వినియోగించని భూముల వివరాలివ్వండి

- టీఎస్ఐఐసీకి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల పేరుతో ప్రభుత్వం నుంచి భూములు పొంది, వాటిని వినియోగించని సంస్థల వివరాలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. దీనికి ప్రతి అధికారి క్షేత్రస్థాయి పర్యటన చేయాలని సూచించారు. కేటాయించిన భూములు వినియోగించకపోతే వెనక్కి తీసుకోవాలని, డివిడెండ్, షేర్ హోల్డ్ అమౌంట్ చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర విభజనకు ముందు, తర్వాత జరిగిన భూకేటాయింపులపై మంత్రి సమీక్షించారు. భూములు పొందిన సంస్థలు వారి ప్రయోజనాలకు కాకుండా థర్డ్ పార్టీలకు లీజుకు ఇచ్చిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలా థర్డ్ పార్టీలకు జరిగిన లీజు అగ్రిమెంట్లు, పొందుతున్న ఆదాయం అంశాలపై నివేదిక సమర్పించాలని సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించారు.

'మహాలక్ష్మి'తో ఆర్టీసీ కారుణ్య నియామకాలు

- పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

సుబేదారి, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం వల్లే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కలిగిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. హన్మకొండ బస్‌స్టేషన్‌లో శనివారం 70 మందికి కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగాల నియామకపత్రాలను ఆమె అందజేశారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను ప్రారంభించారు.

సీఐడీ కస్టడీకి 'పాస్‌పోర్టు' నిందితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో భారత పౌరసత్వం, పాస్‌పోర్టులు పొందిన కేసులో సీఐడీ దూకుడు పెంచింది. ఈ కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన సీఐడీ.. ఇప్పటి వరకు ముగ్గురు పోలీస్ సిబ్బంది, ఒక పోస్టల్ ఉద్యోగి, చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్‌తో పాటు 14 మందిని అరెస్టు చేసింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వారిని విచారించి కేసు దర్యాప్తులో మరింత ముందుకు వెళ్లాలని సీఐడీ చూస్తోంది. అందులో భాగంగానే 8 మందిని కోర్టు అనుమతితో కస్టడీకిలోకి తీసుకొని అధికారులు ప్రశ్నించారు. శ్రీలంక నుంచి భారత భూభాగంలోకి చొరబడ్డ ఆ 95 మంది ఎవరు? ఎంత డబ్బు చేతులు మారింది? ఇలా మొత్తం వివరాల్ని నిందితుల నుంచి సీఐడీ రాబడుతోంది.

ఆర్టీసీకి రూ.375 కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌ఆర్టీసీకి రూ.375 కోట్ల నిధులను శనివారం విడుదల చేసింది. ఇందులో చార్జీల రాయితీ రీ-యింబర్స్‌మెంట్ కింద రూ.212.5 కోట్లు, ప్రత్యేక రుణంగా రూ.162.5 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి, 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం ఆర్టీసీకి రూ.1500 కోట్లు కేటాయించింది. ఇందులో ఆర్టీసీ బస్సు ప్రయాణ చార్జీల్లో వివిధ వర్గాలకు ఇస్తున్న రాయితీలకు రీయింబర్స్‌మెంట్‌గా రూ.850 కోట్లు, ప్రత్యేక రుణంగా రూ.650 కోట్లు ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో జనవరిలో ఆర్టీసీకి రూ.375 కేటాయించింది. ఇప్పుడు ఫిబ్రవరిలో కూడా అంతే మొత్తాన్ని విడుదల చేసింది.

హాస్టల్ గదిలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

- తమను ఒకేచోట సమాధి చేయాలంటూ సూసైడ్ నోట్
- నలుగురు బాలికలతో గొడవ.. ఫలితంగా మనస్తాపం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 3: పదో తరగతి చదువుతున్న ఇద్దరు ప్రాణ స్నేహితురాళ్లు హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తమ మృతదేహాలను ఒకే దగ్గర సమాధి చేయాలంటూ సూసైడ్ నోట్ రాశారు. భువనగిరిలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. మృతులు కె.భవ్య, జి. వైష్ణవి. హాస్టల్ వార్డెన్ శైలజ వివరాల ప్రకారం.. భవ్య, వైష్ణవి భువనగిరిలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్‌లోని ఒకే గదిలో ఉంటూ స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నారు. శనివారం అదే హాస్టల్‌కు చెందిన మరో నలుగురు బాలికలతో భవ్య, వైష్ణవికి గొడవ జరిగింది. ఇద్దరికీ వార్డెన్ శైలజ, స్కూల్ పీఈటీ ప్రతిభ కౌన్సెలింగ్ చేశారు. అనంతరం వారిద్దరూ రాత్రి భోజనం చేసి స్టడీ అవర్‌లో చదువుకున్నారు. కొద్దిసేపటికి ట్యూటర్ భువనేశ్వరి అనుమతితో గదికి వెళ్లి తిరిగి రాలేదు. వారిని తీసుకురమ్మంటూ మరో విద్యార్థినిని ట్యూటర్ పంపగా అప్పటికే భవ్య, వైష్ణవి ఫ్యాన్లకు వేలాడుతూ కనిపించారు. సిబ్బంది.. ఇద్దరినీ భువనగిరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. ఘటనపై కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు వార్డెన్ తెలిపారు. ఇద్దరు బాలికల ఆత్మహత్యపై విచారణ జరుపుతామని డీఈవో నారాయణరెడ్డి తెలిపారు. బాలికల ఆత్మహత్యపై దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు జిల్లా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగాయి. తమ ఆత్మహత్యకు ఎవరూ బాధ్యులు కారని, వార్డెన్ శైలజను ఎవరూ నిందించవద్దని సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నారు.

టీఎస్ ఇక నుంచి టీజీ

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం అమలు జరిగితే రాష్ట్రంలో ఇకముందు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్ టీజీ పేరుతోనే జరగనుంది. ఆదివారం జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలోని జైళ్లలో మగ్గుతున్న సత్ప్రవర్తన గల ఖైదీల విడుదల అంశం కూడా చర్చకు రానుంది. ఇప్పటికే జైళ్ల శాఖ 240 మంది సత్ప్రవర్తన గల ఖైదీల జాబితాను సిద్ధం చేసింది. వీరిని విడుదల చేయాలంటే ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించి, జీవోను జారీ చేయాల్సి ఉంటుంది. కేబినెట్ భేటీలో నీటిపారుదల శాఖ శ్వేతపత్రంపై కూడా మంత్రులు చర్చించనున్నారు. జూరాల నుంచి పర్దిపూర్‌కు, పర్దిపూర్ నుంచి సంగంబండ దాకా నీటిని తరలిస్తుండగా 20 టీఎంసీల నీటిని కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు నీటిని అందించడానికి వీలుగా 'నారాయణపేట-కొడంగల్' ఎత్తిపోతల పథకంపై మంత్రివర్గంలో చర్చించి, ఆమోద ముద్ర వేసే అవకాశాలున్నాయని సమాచారం. ఇప్పటికే ఈ పథకాన్ని చేపట్టాలని పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమై, నివేదించుకోగా... దీనికి ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. గృహ విద్యుత్తు వినియోగదారులకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తును అమలు చేసే 'గృహలక్ష్మి' పథకం విధివిధానాలపై చర్చ జరుగనుంది. ఈ పథకానికి ఏ మేరకు ఖర్చు కానుంది? అమలు చేయడానికి మార్గదర్శకాలు ఏ విధంగా ఉండాలి? వంటి అంశాలపై చర్చించనున్నారు. ఆదివారం సచివాలయంలోని ఆరో అంతస్తులో గల కేబినెట్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌పై చర్చించి, ఆమోదించే అవకాశముంది. అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్‌ను ఖరారు చేయడంతో పాటు గ్రూప్-1 పోస్టుల పెంపు/భర్తీ, గ్యారెంటీల అమలుపైనా చర్చ జరగనుంది.

48మంది ఫిజియోథెరపిస్టుల ఎంపిక!

- విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రాత పరీక్షల ఫలితాల విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 3 : తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆధ్వర్యంలోని ఆస్పత్రుల్లో ఫిజియోథెరపిస్టుల నియామకానికి గాను 2018 మే 11న నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలనుటీఎస్‌పీఎస్సీ శనివారం ప్రకటించింది. అభ్యర్థులు సర్వీస్ వెయిటేజీ, రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. మొత్తం 52పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయగా ఎంపికైన 48 మందితో ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసింది. అలాగే, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖలో విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 2023 జనవరి 3న నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను కూడా టీఎస్‌పీఎస్సీ శనివారం విడుదల చేసింది. పూర్తి వివరాల కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

మేడిగడ్డ కాఫర్ డ్యామ్ ఖర్చు మీదే!

డ్యామ్‌తోపాటు బ్యారేజీ పునరుద్ధరణకు రూ.450-550 కోట్లు ఖర్చవుతుందని అంచనా

- మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలి
- నీటి పారుదల శాఖకు ఎల్‌అండ్‌టీ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాఫర్ డ్యామ్ కట్టడానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ స్పష్టం చేసింది. ఈ మేరకు నాలుగు రోజుల కిందట నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. గత ఏడాది అక్టోబరు 21వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఎల్ అండ్‌టీ ఒప్పుకొందని పేర్కొంటూ నీటిపారుదల శాఖ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే, ఆ తర్వాత చేపట్టిన తనిఖీల్లో బ్యారేజీలోని మూడు బ్లాకులు(6, 7, 8) దెబ్బతిన్నట్లు తేలింది. మూడు బ్లాకులను శాశ్వతంగా తొలగించి, వాటి స్థానంలో కొత్త బ్లాకులు కట్టాల్సిందేనని నిపుణులు స్పష్టం చేశారు. అయితే, బ్యారేజీ పునరుద్ధరణ పనులు చేపట్టాలంటే ప్రభావిత బ్లాకుల వద్ద ఎగువన, దిగువన కాఫర్ డ్యామ్ నిర్మించాలి. సంబంధిత డిజైన్లను నెల కిందట సదరు నిర్మాణ సంస్థకు



ప్రభుత్వం పంపింది. దీనిపై స్పందించిన నిర్మాణ సంస్థ... పనులు చేపట్టడానికి విముఖత వ్యక్తం చేస్తూ లేఖ రాసింది. కాఫర్ డ్యామ్‌తో పాటు మూడు బ్లాకులు కట్టడానికి రూ.450-550 కోట్ల దాకా ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని స్పష్టం చేసింది. కాగా, మేడిగడ్డ బ్యారేజీ ఎప్పుడు పూర్తయిందనే అంశంపై డైలమా నెలకొంది. 2019 సెప్టెంబరు 10వ తేదీన పూర్తయినట్లు ఒక డాక్యుమెంట్,2020 ఫిబ్రవరి 29వ తేదీ అని మరో డాక్యుమెంట్, 2021 మార్చి 15న పూర్తయిందని ఇంకో డాక్యుమెంట్‌లో ఉన్నట్లుగా ఇటీవల విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో తేలింది. అయితే, వీటిలో ఏ తేదీని లెక్కలోకి తీసుకున్నా డిఫెక్ట్ లయబులిటీ (నిర్మాణ పూర్తయిన తర్వాత రెండేళ్లలో ఏ సమస్య వచ్చినా కాంట్రాక్టు సంస్థే బాధ్యత వహిస్తుంది) కాలం ముగిసిపోయినట్టే లెక్క. నిర్మాణ సంస్థ చెబుతున్నట్టుగా 2019లోనే ప్రాజెక్టు పూర్తయినట్టు సర్టిఫికెట్ ఇచ్చి ఉంటే.మరో మూడేళ్లు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కూడా పూర్తి అయినట్టే. మొత్తం పరిణామాల నేపథ్యంలో కాఫర్‌డ్యామ్ తోపాటు బ్యారేజీ పునరుద్ధరణ పనులను కొత్త సంస్థకు ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అంతకుముందే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జాతీయ స్థాయి నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బ్యారేజీ పునరుద్ధరిస్తే ప్రయోజనం చేకూరుతుందా? పదికాలాల పాటు బ్యారేజీ ఉంటుందా..? లేదా..? తదితర అంశాలపై కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించే అవకాశాలున్నట్లు తెలిసింది.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సహకరిస్తాం

- సీఎం, డిప్యూటీ సీఎంలతో ఆర్థికవేత్త మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా భేటీ
- ఆరు గ్యారెంటీల అమలుపై చర్చ
- విద్యుత్, ప్రణాళిక రంగాలపై సూచనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తామని ప్రముఖ ఆర్థికవేత్త, ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతో ఆయన శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ రంగాలపై వారు విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీలకు అవసరమయ్యే నిధులను సమీకరించటంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రజల మీద ఆర్థిక భారం మోపకుండా ఆరు గ్యారెంటీలను విజయవంతంగా ఎలా అమలు చేయాలన్న దానిపై లోతైన చర్చ జరిపారు. ప్రభుత్వ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచటానికి ఉన్న మార్గాలు, పన్నులు ఎగ్గొట్టే వారిపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలూ వారి మధ్య చర్చకు వచ్చాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఏయే రంగాల్లో ఎక్కడెక్కడ ఆదాయం తగ్గుతోంది, కారణాలు, పరిష్కారాలపై ప్రభుత్వంతో తన బృందం కలిసి పని చేయటానికి సిద్ధమని అహ్లూవాలియా సీఎంకు తెలిపారు. విద్యుత్ రంగంలోనూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లానింగ్ బోర్డు సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన సూచనలు ఆయన చేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో సౌరశక్తి తదితర ప్రత్యామ్నాయ ఇంధన వనరులపైనా చర్చించారు. సౌరవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకునేందుకు తెలంగాణలో ఏయే ప్రాంతాల్లో అవకాశాలు ఉన్నాయన్న దానిపై ఈ చర్చల్లో ఓ ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

సాగర్ స్వాధీనంపై మళ్లీ కేంద్రం సమీక్ష..!

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నిర్మించిన ప్రాజెక్టులను.. ప్రధానంగా నాగార్జున సాగర్‌ను కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు కట్టబెట్టే దిశగా కేంద్రం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నెల 16న సాగర్ ప్రస్తుత స్థితిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు వారికి కేంద్ర జలశక్తి శాఖ సమాచారం పంపింది. అదే రోజు సాగర్ అప్పగింతపై తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. జనవరి 17న నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిస్థితులపై తెలంగాణ నీటిపారుల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఏపీ జల వనరుల ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌తో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీ సమావేశమైన విషయం విదితమే. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం.. వారం రోజుల్లోగా ప్రాజెక్టుల అప్పగింత లాంఛనాలపై చర్చించడానికి వీలుగా తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలతో సమావేశాలు పెట్టుకొని.. నెల రోజుల్లో(ఈ నెల 16)గా సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులతో పాటు వాటి పరిధిలోని 15 కాంపోనెంట్లను అప్పగించాలి. కేంద్రం విధించిన గడువు ఈ నెల 16తో పూర్తికానుండగా.. అదే రోజు తెలంగాణ సీఎస్ శాంతి కుమారి, ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డితో ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీ సమావేశం కానున్నారు. జనవరి 17న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ఎక్కడిదాకా వచ్చిందని ఆ భేటీలో కేంద్రం ఆరా తీయనుంది. అయితే కేంద్రం ఒత్తిడి ఫలితంగా ఈ నెల 1న కేఆర్ఎంబీ చైర్మన్ శివ్ నందన్ కుమార్ తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలతో సమావేశం నిర్వహించిన విషయం విదితమే. వారం రోజుల్లోగా 15కాంపోనెంట్ల నిర్వహణకు అవసరమైన ఉద్యోగుల వివరాలను అందించాలని కోరారు. అయితే జనవరి 17న కేంద్రం నిర్వహించిన సమావేశం తాలూకు మినిట్స్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాసిన విషయం విదితమే. ఆ లేఖలోని అంశాలకు కట్టుబడి తదుపరి అడుగులు వేయాలని తెలంగాణ భావిస్తోంది.



మేడారంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

7 నుంచి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

- ప్రజలు, యువతను భాగస్వాములను చేయాలి
- గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్‌లకు రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్/ములుగు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు పదవీ విరమణ చేసిన నేపథ్యంలో గ్రామాల్లో నెలకొనే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. శనివారం సాయంత్రం ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్‌లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి స్పెషలాఫీసర్‌ను కచ్చితంగా నియమించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో అంతర్గత నీటి సరఫరా బాధ్యత గ్రామపంచాయతీలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, తాగునీటి సమస్య పరిష్కారం కోసం నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయించిందని వెల్లడించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 7నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలని, అందులో ప్రజలు, యువతను భాగస్వాములను చేయాలని ఆమె సూచించారు. మేడారం జాతరలో ప్లాస్టిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నామని, జాతరకు వచ్చే భక్తులు ప్లాస్టిక్‌ను తీసుకురాకుండా జిల్లాల వారీగా స్థానికంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఉపాధి హామీ పనులను గుర్తించి పేదలకు ఎక్కువ రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాలలో సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను స్వయం ఉపాధి మహిళా సంఘాల ద్వారా కుట్టించాలని ప్రభుత్వం భావిస్తోందని, జిల్లా స్థాయిలో అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రణాళికలు రూపొందించి సమర్పించాలని ఆమె ఆదేశించారు.

పెండింగ్ బిల్లులతో మేడారంకు ముడిపెట్టొద్దు

గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాలేదనే సాకుతో మేడారం జాతర పనులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని మంత్రి సీతక్క కాంట్రాక్టర్‌లను హెచ్చరించారు. మేడారంలో జరుగుతున్న మహాజాతర పనులన పరిశీలించి, అధికారులతో సమీక్ష జరిపారు. దాదాపు పనులన్నీ చివరి దశలో ఉన్నాయని, ఈ నెల 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిపోయిన కొండాయి-ఊరట్టం రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడుతానని చెప్పారు.

ట్రైబ్యునల్‌కు వెళ్లాలని మీరెలా చెప్తారు?

- అవి మీ భూములు కానే కావు కదా!
- రైతుల భూ సమస్యలపై ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు అధికారులతో ధరణి కమిటీ
- స్థానికంగా పరిష్కరించాలని సూచన
- సర్వే చట్టం చేయాలన్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో చోటు చేసుకున్న తప్పుల కారణంగా మీ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న రైతుల సమస్యలను పరిష్కరించకుండా.. వారిని ట్రైబ్యునల్‌కు వెళ్లమని చెప్పటం ఏమిటని ధరణి కమిటీ.. ఎండోమెంట్, వక్ఫ్ బోర్డు శాఖల ఉన్నతాధికారులను సూటిగా ప్రశ్నించింది. స్థానికంగానే వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించింది. శనివారం సచివాలయంలో ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులతో ధరణి కమిటీ సమావేశమైంది. 'ధరణి పోర్టల్ వచ్చాక కొన్ని పట్టా భూములు ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు జాబితాలో నమోదైనాయి. వీటిని తొలగించాలంటూ వేల సంఖ్యలో రైతులు, ఇతర భూ యజమానులు నెలల తరబడి మీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి పరిష్కారం చూపించకుండా ట్రైబ్యునల్‌కు వెళ్లలంటూ చెప్పడం సరైనది కాదు. రికార్డుల ప్రకారం అవి మీ భూములు కానప్పుడు భూముల యజమానులు ట్రైబ్యునల్‌కు ఎందుకు వెళ్లాలి?' అని ధరణి కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఇప్పటికే ఎంతో మంది రైతులు ఈ సమస్యతో తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. ధరణిలో చూపిస్తున్న భూముల వివరాలకు, తమ రికార్డుల్లో నమోదైన భూ వివరాలకు సరిపోవడం లేదని, భారీగా తేడాలున్నాయని ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు. వీటిని సమగ్రంగా నమోదు చేయాలని అధికారులకు కమిటీ సూచించింది. వక్ఫ్ బోర్డు కింద, ఎండోమెంట్ కింద ఉన్న మొత్తం భూ విస్తీర్ణం, భూములకు సంబంధించిన నోటిఫికేషన్‌ల ప్రక్రియ, ఆయా భూములను కాపాడటానికి రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖలు తీసుకుంటున్న చర్యలు, ఈ శాఖల నియంత్రణలో ఉన్న భూముల విస్తీర్ణం, కబ్జాలకు గురైన భూమి, ధరణి పోర్టల్‌లో నమోదైన భూముల సమస్యల గురించి కమిటీ సభ్యులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల పట్టా, ప్రభుత్వ అటవీ భూములకు సంబంధించిన సర్వే సమస్యలు ఉన్నాయని, సర్వే తప్పనిసరిగా చేయాల్సిందేనని సర్వే ల్యాండ్ అండ్ సెటిల్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. సర్వే చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు ధరణి పోర్టల్‌లో నమోదైన భూములకు సర్వే మ్యాపులు ఉన్నాయా అని కమిటీ ఆరా తీసింది. కొన్ని ప్రాంతాలకు సంబంధించి ఉన్నాయని, మరికొన్నింటికి తయారు చేయాల్సి ఉందని అధికారులు చెప్పారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సర్వే మ్యాపుల ప్రస్తుత పరిస్థితి, ధరణి పోర్టల్ సమాచారానికి, ఈ మ్యాపులకు మధ్య ఉన్న వ్యత్యాసాల గురించి కూడా కమిటీ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ నవీన్ విఠల్, ధరణి పునఃనిర్మాణ కమిటీ సభ్యులు కోదండ రెడ్డి, రేమండ్ పీటర్, సునీల్ కుమార్, మధుసూదన్, సీఎంఆర్ఓ వి.లచ్చిరెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఒక్కో సీటుకు సగటున 18 మంది పోటీ!

- కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిత్వానికి భారీగా దరఖాస్తులు
- ఖమ్మం నుంచి ర్యాలీగా వచ్చి దరఖాస్తు అందజేసిన డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని
- ఖమ్మం సీటుకే రేణుకాచౌదరి సహా సీనియర్ నేతల అర్జీ

హైదరాబాద్/ఖమ్మం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ భారీగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకు ఆశావహుల నుంచి 306 దరఖాస్తులు అందాయి. ఒక్కో సీటుకు సగటున 18 దరఖాస్తులు నమోదయ్యాయి. శనివారం దరఖాస్తుకు చివరి రోజు కావడంతో ఒక్కరోజే 166 దరఖాస్తులు దాఖలయ్యాయి. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన నేతలతో గాంధీభవన్‌లో సందడి వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి లోక్‌సభ ఎన్నికల్లోనూ మెజార్టీ సీట్లను కాంగ్రెస్సే దక్కించుకునే అవకాశం ఉండడంతో దరఖాస్తు చేసుకోవడానికి పార్టీ నేతలు ఉత్సాహం చూపారు. కొందరు నేతలైతే గాంధీభవన్‌కు ర్యాలీగా వచ్చి అనుచరుల నినాదాల మధ్య తమ దరఖాస్తులు ఇచ్చారు. ఖమ్మం సీటు కోసం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సతీమణి నందిని గాంధీభవన్‌కు వచ్చి స్వయంగా దరఖాస్తును అందజేశారు. వాస్తవానికి ఆమె గురువారమే దరఖాస్తు పంపినా.. శనివారం ఖమ్మం నుంచి నేతలు, కార్యకర్తలతో కలసి భారీ ర్యాలీతో వచ్చి దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోనియా, ప్రియాంకా గాంధీలు ఖమ్మం నుంచి పోటీ చేయకుంటే తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కార్యకర్తల కోరిక మేరకే ఖమ్మం టికెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే ఖమ్మం సీటు కోసం కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి, టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్, పార్టీ నేత రాయల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి కూడా తాజాగా దరఖాస్తు చేశారు. చివరిరోజు దరఖాస్తు చేసుకున్న వారిలో మోత్కుపల్లి నర్సింహులు (వరంగల్), శివసేనారెడ్డి (భువనగిరి), బెల్లయ్యనాయక్, బానోత్ విజయాబాయి(మహబూబాబాద్), గడ్డం వంశీకృష్ణ (పెద్దపల్లి), కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, వినయ్‌కుమార్, అనిల్ యాదవ్, తన్నీరు శ్రీపాద్ (సికింద్రాబాద్), మృత్యుంజయం, రమ్యారావు (కరీంనగర్), కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (చేవెళ్ల), అరికెల నర్సారెడ్డి (నిజామాబాద్) తదితరులున్నారు. ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ప్రస్తుతం పాలమూరు న్యాయ యాత్ర చేస్తున్న ఆయన.. విరామం తీసుకుని సీఎంను కలిశారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు.

ఇది పశు ప్రవర్తన

- మహిళలను కించపరచడం అమానుషం
- ఇలాంటి చర్యలతో కాంగ్రెస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు
- షర్మిలకు అండగా నిలబడతాం: రాహుల్ గాంధీ
- ఓటమిని ఎదుర్కోలేని పిరికివాళ్లే క్రూరత్వాన్ని ఆశ్రయిస్తారు!
- సీఎం జగన్‌పై షర్మిల పరోక్ష వ్యాఖ్యలు



అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సునీతారెడ్డిపై వైసీపీ మూక సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. వీరిద్దరికీ పార్టీ మొత్తం అండగా ఉంటుందని ప్రకటించింది. మహిళలను కించపరచడం అమానుషమని, ఇది పశు ప్రవర్తనేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. మహిళలను బెదిరించడం, అవమానించడం నీచమని, ఇది పిరికిపందల చర్య అని ఆక్షేపించారు. ఇలాంటి చర్యలు కాంగ్రెస్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయలేవని పేర్కొన్నారు. షర్మిలకు మద్దతుగా నిలుస్తామని రాహుల్ స్పష్టం చేశారు. షర్మిలకు ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని శక్తులు వణికిపోతున్నాయని వేణుగోపాల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రోజురోజుకూ బలం పుంజుకుంటోందని చెప్పారు. షర్మిల ప్రతిష్ఠను, వైఎస్ రాజశేఖరరెడ్డి వారసత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. కాగా, "ఓటమిని ఎదుర్కోలేని పిరికివాళ్లే క్రూరత్వాన్ని ఆశ్రయిస్తారు" అని తన అన్న, ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరోక్ష వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా షర్మిలపై సోషల్ మీడియాలో వైసీపీకి చెందిన కొందరు కార్యకర్తలు అనుచిత పోస్టులు పెడుతున్న విషయం తెలిసిందే. దీనిపై ఆమె నేరుగా స్పందించకుండా ఎక్స్(ట్విట్టర్) వేదికగా నిప్పులు చెరిగారు. "ఓటమిని ఎదుర్కొనలేని వారు క్రూరత్వాన్ని ఆశ్రయించడంతో పాటు దుర్మార్గంగా కూడా ఉంటారు" అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఇదిలా వుంటే, ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని ఏపీ భవన్‌లో షర్మిల నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. రాష్ట్ర ప్రజలు చూపుతున్న మద్దతు, ఆప్యాయతలే తనకు బలమని పేర్కొన్నారు. "మాకు మద్దతు పలికిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు" అని షర్మిల పేర్కొన్నారు.

అధికారుల సాయంతో ఆస్తులు కూడబెట్టా!

- వారి పేర్లను వెల్లడించిన శివబాలకృష్ణ
- భూముల కొనుగోలుకు డబ్బెక్కడిది..?
- లాకర్లలోని బంగారం సంగతి ఏమిటి?
- 4వ రోజు కస్టడీలో ప్రశ్నించిన ఏసీబీ



హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఏసీబీ కస్టడీలో నోరు విప్పుతున్నాడు. అరెస్ట్ సమయంలో ఏసీబీకి సరిగా సమాధానాలివ్వని ఆయన కస్టడీలో ప్రశ్నల తీరుతో వివరాలు వెల్లడిస్తున్నాడు. ఈ క్రమంలోనే అధికార దుర్వినియోగం, ఆస్తులు కూడగట్టుకోవడంలో తనకు సహకరించిన కొందరు అధికారుల పేర్లు చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై ఏసీబీ అధికారుల నుంచి స్పష్టత రావడం లేదు. కాగా, శనివారం నాలుగో రోజు విచారణలో శివబాలకృష్ణను బినామీల బ్యాంకు ఖాతాలు, లాకర్లపై ప్రశ్నించినట్లు తెలిసింది. శుక్రవారం రెరా కార్యాలయం బీరువాలో బయటపడ్డ భూముల పత్రాలు, బినామీ పేరుతో ఉన్న బ్యాంకు లాకర్లలో గుర్తించిన బంగారం విషయం ప్రస్తావిస్తూ.. భూముల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ప్రతిఫలంగా వారికి ఏం మేలు చేకూర్చారు? అని వివరాలు రాబట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. కాగా, గత నెలలో అరెస్ట్ చేసిన శివ బాలకృష్ణను కోర్టు అనుమతితో ఏసీబీ 8 రోజుల కస్టడీకి తీసుకుంది. అప్పటినుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయం ప్రత్యేక గదిలో ఇన్‌కెమెరాలో విచారణ కొనసాగుతోంది. కోర్టు ఆదేశాల మేరకు శివబాలకృష్ణ తరఫు న్యాయవాది సమక్షంలోనే ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాగా, భద్రతా కారణాల రీత్యా ఆయనను రాత్రి వేళ పోలీస్‌స్టేషన్‌లో ఉంచి ఉదయం ఏసీబీ కార్యాలయానికి తీసుకొస్తున్నారు. మరోవైపు శివబాలకృష్ణ సోదరుడు శివ సునీల్‌కుమార్ పేరుతో స్థిరాస్తి వ్యాపారం చేసినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. దీంతో అతడిని కార్యాలయానికి పిలిచి పలు అంశాలపై ప్రశ్నించింది.

టేకులగూడెం ఘటనలో ఇద్దరు దళ సభ్యుల మృతి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 3: గత నెల 30న సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని టేకులగూడెంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు దళసభ్యులు మృతిచెందారని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దక్షిణ్ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి సమత తెలిపారు. బీజాపూర్ జిల్లా గంగలూరు గ్రామానికి చెందిన పీఎల్‌జీఏ-2 సెక్షన్ కమాండర్ మడివి రోజా, సుక్మాజిల్లా పువర్తి గ్రామానికి చెందిన నంబర్-1 బెటాలియన్ కమాండర్ మడివి బెజ్జా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. లేఖతో పాటు మృతి చెందిన మావోయిస్టుల ఫొటోలు, సీఆర్‌పీఎఫ్ జవాన్ల వద్ద స్వాధీనం చేసుకున్న తూటాలు, ఆయుధాల చిత్రాలను విడుదల చేశారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 3 : కార్పొరేట్, మతోన్మాద, అవినీతి పార్టీ బీజేపీని ఓడించాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు కాజీపేట బాలవికాసలో శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి తపన్‌సేన్ హాజరయ్యారు. ప్రజాహక్కుల పరిరక్షణకు ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ.. దేశంలో 85 శాతం మంది శ్రమజీవులుగా పనిచేస్తుంటే అంబానీ, ఆదానీ వంటి వందల కంపెనీ యాజమాన్యాలు ప్రజల కష్టంతో కోట్లకు పడగలెత్తుతున్నాయని మండిపడ్డారు.

ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఏడేళ్ల జైలుశిక్ష

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 3 : పాకిస్తాన్‌లో సాధారణ ఎన్నికలకు వారం రోజులు ఉండగా ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు పాక్ కోర్టు ఒకటి శనివారం ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. ఇస్లామ్ నిబంధనలకు వ్యతిరేకంగా వివాహం చేసుకున్నారన్న కేసులో కోర్టు నుంచి ఈ తీర్పు వెలువడింది. అంతేకాకుండా చెరో రూ. 5 లక్షల జరిమానా విధించింది. 2022 నుంచి ఇప్పటి వరకు ఆయనకు నాలుగు కేసుల్లో జైలుశిక్షలు విధించారు. బుష్రా బీబీ మొదటి భర్త ఖవార్ మనేకా.. రెండోసారి వివాహం చేసుకొనేందుకు ఇస్లాం ప్రకారం తగిన వ్యవధి పాటించలేదని కేసు వేశారు. అంతేకాకుండా రెండో వివాహానికి ముందే వారి మధ్య వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఈ నేరానికి రాళ్లతో కొట్టి మరణ శిక్ష వేయవచ్చు. ఇప్పటికే ఇమ్రాన్ ఖాన్‌కు దేశ రహస్యాలను బయట పెట్టారన్న కేసులో గత వారం 10 ఏళ్ల జైలుశిక్ష, తోషఖానా కేసులో బుధవారం 14 ఏళ్ల జైలుశిక్ష పడింది.

బీజేపీకి కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కాదు

బలమైన ప్రాంతీయ శక్తులతోనే బీజేపీకి చెక్.. మమత వ్యాఖ్యలతో నేను ఏకీభవిస్తున్నా

- రాష్ట్రంలో కరెంట్ కష్టాలు మొదలు
- ఫ్రీ బస్సు పథకం మంచిదే.. కానీ బస్సుల సంఖ్య పెంచాలి
- ఢిల్లీకి బీఆర్ఎస్ ఎంపీలను పంపాలి
- సర్కార్‌ను ఆగం చేయాలన్న ఆలోచన లేదు: కేటీఆర్


షాపూర్‌నగర్‌లో వ్యాపారితో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్/దుండిగల్/కూకట్‌పల్లి/షాపూర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీకి కాంగ్రెస్ ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బీజేపీని ఆపగలిగే శక్తి బలమైన ప్రాంతీయ రాజకీయ శక్తులకే ఉందని పేర్కొన్నారు. మమతా బెనర్జీ, కేజ్రీవాల్, స్టాలిన్, కేసీఆర్ వంటి బలమైన నాయకులే దేశంలో బీజేపీని అడ్డుకోగలరని చెప్పారు. కాంగ్రెస్ తనకున్న 40 ఎంపీ స్థానాల్ని ఈసారి నిలబెట్టుకునే అవకాశం లేదని బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానన్నారు. కాంగ్రెస్ వ్యవహార శైలి వల్లనే ఇండియా కూటమి చెల్లాచెదురవుతోందని, ఈ విషయంలో ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. గుజరాత్, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో బీజేపీతో నేరుగా పోటీ పడాల్సి ఉన్న కాంగ్రెస్, వాటిని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో పోటీ పడుతోందని, అలా చేయడం వల్ల బీజేపీకే లాభం చేకూరుతోందన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో, ఎక్స్‌లోనూ పేర్కొన్నారు. మరోవైపు.. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పింఛన్‌లు, కరెంటుకు, మంచినీళ్లకు కొదవ లేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరెంటు కష్టాలు మొదలయ్యాయని కేటీఆర్ అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రజలెవరూ సంతోషంగా లేరని చెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధ్యక్షతన, కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలకు హాజరైన కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేమని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. హామీలను అమలు చేయకపోతే గుర్తు చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందని చెప్పారు. రుణమాఫీ కోసం రైతులు, పింఛన్‌ల కోసం మహిళలు ఎదురు చూస్తున్నారని.. హామీల అమలును వేగవంతం చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం మంచిదే కానీ బస్సుల సంఖ్య పెంచాలన్నారు. ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల గురించి కొట్లాడే దమ్మూ, ధైర్యం, గులాబీ జెండాకే ఉంటుందని, ఇతర పార్టీ వారు తెలంగాణ అభివృద్ధి గురించి పట్టించుకోరని పేర్కొన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వారిని ప్రజలే బొందపెడతారని హెచ్చరించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఇక్కడ ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించారని, గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్ చెప్పిన మోసపూరిత హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపించారని ఆయన అన్నారు.

కేసీఆర్‌తో ప్రముఖుల భేటీ

మాజీ సీఎంను పరామర్శించిన దిల్ రాజు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పలువురు పార్టీ నేతలు, ప్రముఖులు భేటీ అయ్యారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, చిరుమర్తి లింగయ్య, రవీంద్ర నాయక్, తదితరులు కేసీఆర్‌ను కలిశారు. కాగా, సమకాలీన ఏపీ రాజకీయాలపై పాత్రికేయుడు దేవులపల్లి అమర్ ఇంగ్లిష్, తెలుగులో రచించిన పుస్తకాన్ని కేసీఆర్‌కు అందించారు. ఆంధ్రా వాల్మీకి రామాయణంలో చందా ప్రయోగం పుస్తకాన్ని జ్వాలా నరసింహారావు కేసీఆర్‌కు అందజేశారు. ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు.

ఎన్నికల ఫలితాలపై నిరాశ కలిగింది కానీ.. బాధ లేదు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నిరాశ కలిగింది కానీ.. బాధ లేదని కేటీఆర్ అన్నారు. చిన్న చిన్న పొరపాట్లు చేశాం.. వాటిని సరిదిద్దుకొని రాబోయే రోజుల్లో ప్రజల మనస్సులు గెలుచుకొంటామని పేర్కొన్నారు. తమకేం తొందరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆగం చేయాలన్న ఆలోచన లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు 100 రోజుల సమయం ఇస్తున్నామని, ఆ తర్వాత హామీల అమలు కోసం పోరాడతామని స్పష్టం చేశారు. అంతకుముందు సూరారం డివిజన్ షాపూర్‌నగర్ మార్కెట్టు రోడ్డులో కేటీఆర్ పర్యటించారు. వాణిజ్య సముదాయాల్లో నిర్వాహకులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు తరచూ కరెంట్ కోతలతో, మంచినీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

రేవంత్ తలకిందులుగా తపస్సు చేసినా రాహుల్ ప్రధాని కాలేరు

- ఢిల్లీలో ప్రశ్నించే గొంతుక బీఆరెస్సే
- ఆటో డ్రైవర్లకు నెలకు 10వేలివ్వాలి: హరీశ్



భద్రాచలం, ఫిబ్రవరి 3: సీఎం రేవంత్‌రెడ్డి తలకిందులు తపస్సు చేసినా రాహుల్‌గాంధీ ప్రధాని కాలేరని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ హక్కులు కాపాడాలన్నా, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయించాలన్నా, ఢిల్లీలో పోరాటం చేయాలన్నా ప్రశ్నించే గొంతుక బీఆరెస్సేనని తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ అందించాలని ప్రజలను కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీని నిలువరించే శక్తి తృణమూల్ కాంగ్రెస్, ఆప్, బీఆర్ఎస్ లాంటి ప్రాంతీయ పార్టీలకే ఉందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా తాము ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పజెప్పలేదని, కానీ నేడు ప్రాజెక్టులన్నీ అప్పజెప్పి రాష్ట్రానికి అధికారం లేకుండా చేశారని విమర్శించారు. దీంతో ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల వాసులకు తాగునీటి సమస్య ఎదురుకానుండగా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు నీళ్లందకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో తమ ప్రభుత్వం ఏం చేసిందో గ్రామాల్లోకి వెళ్లి చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఆ జిల్లాలో నాలుగు వైద్య కళాశాలలు, ఇంటింటా తాగునీటి సౌకర్యం, తండాలను జీపీలుగా మార్చిన ఖ్యాతి బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణమంటే తిట్ల పురాణమా అని ప్రశ్నించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి వాడని అనాగరిక, అసభ్యకర భాషను రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం పరువు తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్లు నెలవారీ లోన్ వాయిదాలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ఇప్పటికే 12 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నెలకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం, రాష్ట్ర మంత్రులు రెచ్చగొట్టినా తాము రెచ్చిపోమని, తాము అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పటికీ ప్రజాపక్షమేనని ఆయన స్పష్టం చేశారు.

నెచ్చెలీ.. నువ్వు లేని జీవితమా?

- ప్రేమ వైఫల్యంతో యువకుడి బలవన్మరణం
- పెళ్లికి పెద్దలు అడ్డుచెప్పడంతోనే
- ఆమెకు వీడియోకాల్, చూస్తుండగా ఉరి
- సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలో ఘటన



జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3: అతడు, ఆమె.. చిన్ననాటి స్నేహితులు! ఆ స్నేహంలోనే ప్రేమ చిగురించింది. పెళ్లి చేసుకొని కలిసి జీవించాలనుకున్నారు. పెద్దలు అడ్డుచెప్పడం.. రెండు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో ఆ ప్రేమికుల కలలు కల్లలయ్యాయి. ప్రేయసి ఇక దక్కదేమోనన్న కలతతో ఆ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. యువతి తరఫువారే తమ అబ్బాయిని హత్యచేశారని యువకుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఎర్రవల్లికి చెందిన చెవేళ్ల అంజమ్మ, యాదయ్య కుమారుడు నరేశ్ (20) ఆదే గ్రామానికి చెందిన అతడి స్నేహితురాలు ప్రేమించుకున్నారు. ఇది నిరుడు బయటపడటంతో ఇరువైపులా కుటుంబాలు పెళ్లికి నిరాకరించాయి. గొడవలతో వ్యవహారం పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. ఊర్లో పంచాయతీ జరిగింది. కుల, గ్రామ పెద్దల సమక్షంలో ఒకరి కుటుంబం జోలికి మరొకరు వెళ్లకుండా పరస్పరం ఒప్పందం చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కలవొద్దని ప్రేమికులకు కూడా నిబంధన పెట్టారు. ఫలితంగా దూరం పాటిస్తున్న ప్రేమికులు ఇటీవల ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు తెలిసింది. కాగా ఆమెకు దూరంగా నరేశ్ ఉండలేకపోయాడు. ఉంటే నీతో కలిసి బతుకుతా.. లేకుంటే చనిపోతా అంటూ ఆమెకు ఫోన్‌చేసి పలు మార్లు చెప్పినట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం ప్రియురాలికి ఫోన్ చేసిన నరేశ్ 'నువ్వు లేకుండా నేను బతుకలేను' అని చెప్పాడు. చివరిగా నిన్ను ఒకసారి చూడాలని ఉందని చెప్పి, వీడియో కాల్ చేసి కొద్దిసేపు మాట్లాడి, చీరతో ఉరేసుకుంటున్నానని చూపిస్తూ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కాగా తమ కుమారుడిని అతడు ప్రేమిస్తున్న అమ్మాయి తరఫువారే హత్య చేశారని మృతుడి తల్లిదండ్రులు అంజమ్మ, యాదయ్య ఆరోపించారు. తన కుమార్తెను ప్రేమించాడనే ఆగ్రహంతో తమ అబ్బాయిని రెండు మూడుసార్లు వారు తీవ్రంగా కొట్టారని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ శంకర్ తెలిపారు.


ఆపరేషన్ టేబుల్‌పై నుంచి పోకిరి సినిమా చూస్తున్న పండు

'పోకిరి' సినిమా చూపిస్తూ బ్రెయిన్ సర్జరీ

- రోగి మెలకువగా ఉండగానే వైద్యుల ఆపరేషన్
- ఏపీ ప్రభుత్వ వైద్య రంగంలో ఇదే మొదటిసారి

గుంటూరు(మెడికల్), ఫిబ్రవరి 3: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ కాసేపు సినిమా థియేటర్‌గా మారింది. రోగికి ఇష్టమైన 'పోకిరి' సినిమా చూపిస్తూ వైద్యులు అతనికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీని విజయవంతంగా చేశారు. ఏపీ ప్రభుత్వ వైద్యరంగంలో తొలిసారిగా రోగి మెలకువలో ఉండగానే మెదడు ఆపరేషన్ చేసినట్లు గుంటూరు జీజీహెచ్ వైద్య వర్గాలు ప్రకటించాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఐలాపురానికి చెందిన పండు (48) కాలు, చేయి బలహీనపడి అపస్మారక స్థితికి చేరడంతో జనవరి 2న గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అతని మెదడులోని మోటార్ కార్టెక్స్ అనే భాగంలో కణితి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. దానిని తొలగించే క్రమంలో రోగి కుడి కాలు, చేయి చచ్చుబడే ప్రమాదం ఉంది. ఆపరేషన్ సమయంలో రోగిని మెలకువగా ఉంచి, అతడి కాళ్లు, చేతుల కదలికలను గమనించడం ద్వారా ఈ ప్రమాదాన్ని నివారించాలని న్యూరో వైద్యులు నిర్ణయించారు. ఈ క్రమంలో జనవరి 25న రోగికి లోకల్ అనస్థీషియా ఇచ్చి ఎవేకెన్ బ్రెయిన్ సర్జరీ చేశారు. పండు హీరో మహేశ్‌బాబు అభిమాని కావడంతో, ల్యాప్‌ట్యాప్‌లో 'పోకిరి' సినిమా చూపిస్తూ విజయవంతంగా సర్జరీ ముగించారు.

30% లాభాలంటూ యువతికి 3.16 కోట్లకు టోకరా

- దుబాయ్ కేంద్రంగా సైబర్ మోసాలు
- సొమ్ము హవాలాలో తిరిగి ఇండియాకు
- గుజరాత్‌కు చెందిన ముఠా అరెస్టు


స్వాధీనం చేసుకున్న డబ్బును చూపిస్తున్న జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్, డీసీపీ కవిత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యువతి నుంచి రూ.3.16 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ల కేసులో వారికి హవాలా రూపంలో సహకరిస్తున్న మరో ముఠా పట్టుబడింది. స్టాక్ మార్కెట్, ఆన్‌లైన్ గేమింగ్ సైట్లలో పెట్టుబడులు పెడితే 30 శాతం లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆమెను నమ్మించారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన ఓ ముఠాను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు దుబాయ్, హాంకాంగ్ కేంద్రంగా ఉంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారు కొల్లగొట్టిన డబ్బును హవాలా రూపంలో రప్పిస్తున్న గుజరాత్‌కు చెందిన మరో ముఠాను పోలీసులు ఇప్పుడు కటకటాల్లోకి నెట్టారు. సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ రంగనాథ్ డీసీపీ కవిత, ఏసీపీ శివమారుతితో కలిసి మీడియాకు తెలిపారు. ఓ యువతి స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తుండేది. ఈ క్రమంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. యూనిటీ స్టాక్స్ అనే స్టాక్ మార్కెట్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే ఆరు నెలల్లో అత్యధిక లాభాలు వస్తాయని, దాంతో పాటు డెఫాబెట్, యూనిట్ ఎక్స్ఛేంజ్, టీ-20 ఐపీఎల్ వంటి ఆన్‌లైన్ గేమింగ్ సైట్లలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించాడు. దాంతో ఆమె మొదట కొద్దిమొత్తంలో పెట్టుబడి పెట్టింది. అతను 30 శాతం లాభాలు వచ్చేలా చేశాడు. దీంతో ఇంకా సంపాదించాలని ఆమెకు ఆశ పుట్టింది. ఇదే అదనుగా భావించిన నిందితుడు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే కోట్లు సంపాదించవచ్చని నమ్మబలికాడు. దాంతో ఆమె ఆస్తులు అమ్మేసింది. రూ.3.16 కోట్లను ఆ నిందితుడు చెప్పిన ఖాతాల్లో వేసింది. డబ్బు చేతికందిన వెంటనే అతను పత్తా లేకుండాపోయాడు. దీంతో ఆమె సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా ఇన్‌స్పెక్టర్ గంగాధర్ టీమ్ రంగంలోకి దిగింది. నాగపూర్‌కు చెందిన రోనాక్ తన్నా ముఠా గోవాలో ఉంటూ ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించింది. తన్నాను అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు అర్జున్, యుగ్ దుబాయ్, హాంకాంగ్‌లలో ఉంటూ రోనక్ తన్నా, జుడిత్ గోనాసాల్వేస్, సనా మహ్మద్ ఖురేషి సహకారంతో ఇండియాలో సైబర్ మోసాలు చేస్తున్నట్లు తెలిసింది. దోచుకున్న సొమ్మును అహ్మదాబాద్ (గుజరాత్ నుంచి హవాలా మార్గంలో సేకరించి తాము చెప్పిన చోటుకి చేర్చడానికి ప్రత్యేక ముఠా ఏర్పాటు చేసుకున్నారు. ఈ ముఠాలోని స్వయం తిమానియా, మీట్ తిమానియా, బ్రిజేష్ పాటిల్, హర్ష పాండియా, శంకర్‌లాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హర్ష అనే నిందితుడు ఫినో బ్యాంకు ద్వారా క్యాష్ మ్యానేజ్‌మెంట్ సర్వీస్ నిర్వహిస్తున్నాడు. అక్కడి నుంచి డబ్బు తీసుకుంటున్న ఇతర నిందితులు అహ్మదాబాద్‌లో ఉంటున్న శంకర్‌లాల్ ద్వారా డెలివరీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రెండు ముఠాల నుంచి రూ.28 లక్షలు, మూడు ల్యాప్‌టాప్‌లు, 20 మొబైల్ ఫోన్లు, 15 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 4 ఫిబ్రవరి 2024

ఎన్ఐఎస్ఎంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్

ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్(ఎన్ఐఎస్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. దీని వ్యవధి 15 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ, రీసెర్చ్ అనాలిసిస్ అనే మూడు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో నాలుగు ట్రైమెస్టర్‌లు ఉంటాయి. చివరి ట్రైమెస్టర్‌లో స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. మొదటి మూడు ట్రైమెస్టర్‌లు అందరికీ కామన్‌గా ఉంటాయి. ఫౌండేషన్ కోర్సులకు తొమ్మిది నెలలు, స్పెషలైజేషన్ కోర్సులకు మూడు నెలలు, స్పెషలైజేషన్‌కు సంబంధించిన డిజర్టేషన్‌కు మరో మూడు నెలలు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ మొత్తానికి 45 క్రెడిట్స్ నిర్దేశించారు.

- ప్రోగ్రామ్‌నకు సంబంధించిన సెషన్స్‌ను వారాంతాల్లో హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తారు. ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో క్లాస్‌రూం తరగతులు ఉంటాయి. వీటినే ఆన్‌లైన్ ద్వారా కూడా అందిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ సెషన్స్ ఎంచుకోవచ్చు. ప్రతి శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదింబావు వరకు; ప్రతి ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సెషన్స్ ఉంటాయి. ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆన్‌లైన్ అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, కేస్ స్టడీ డిస్కషన్స్, ఆఫ్‌లైన్ అసెస్‌మెంట్(పేపర్-పెన్సిల్ టెస్ట్) ఉంటాయి. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

అర్హత-ఎంపిక: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు దరఖాస్తుకు జతచేయాలి. ఇంగ్లీష్‌లో వెర్బల్, రిటెన్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు. అకడమిక్ ప్రతిభ, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **మొదటి మెరిట్ లిస్ట్ విడుదల:** మే 15
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nism.ac.in



ఐఐటీ గాంధీనగర్‌లో పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



విభాగాలు: బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్-ఎర్త్ సిస్టమ్స్ సైన్స్ అండ్ ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/బీటెక్/ఎంటెక్/బీఎస్(ఐసర్/ఐఐఎస్సీ)/బీఎస్-ఎంఎస్(ఐసర్)ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులకు; ఐఐటీలు, ఐసర్లు, ఐఐఎస్సీ నుంచి 8 సీజీపీఏతో పీజీ/ఎంఎస్ పూర్తిచేసినవారికి సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది.

ఫెలోషిప్: మొదటి రెండేళ్ల నెలకు రూ.37,000; తరవాత నెలకు రూ.42,000ల ఫెలోషిప్ చెల్లిస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో నాలుగు నుంచి ఆర్నెల్లపాటు రీసెర్చ్ వర్క్ చేసేందుకుగాను 12,500 యూఎస్ డాలర్లు ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రిసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ కోసం రూ.2,00,000 వరకు ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 3
- **రాత పరీక్ష/ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 8 నుంచి 22 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 15
- **వెబ్‌సైట్:** iitgn.ac.in

నిమ్‌హాన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)- 'బేసిక్స్ ఆఫ్ యోగ థెరపీ ఫర్ మెంటల్ హెల్త్ ప్రొఫెషనల్స్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది సర్టిఫికెట్ కోర్సు. ఇందులో 100 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి ఒక నెల. రోజుకి రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు ఆన్‌లైన్ ట్రెయినింగ్ ఉంటుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగుంబావు నుంచి ఆరుంబావు వరకు ట్రెయినింగ్ సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సు చివరలో ఒక రోజు ఆఫ్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు మెంటల్ హెల్త్ క్లినికల్ సర్వీసెస్ విభాగాల్లో పనిచేస్తున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. (పీహెచ్‌డీ/ఎమ్మెస్సీ/ఎంఫిల్)(సైకియాట్రీ/క్లినికల్ సైకాలజీ/సైకియాట్రిక్ సోషల్ వర్క్/సోషల్ వర్క్/సైకియాట్రిక్ నర్సింగ్) ఉత్తీర్ణులు; కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సహా ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ఎన్‌జీఓ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు
- **మెడికల్ ప్రొఫెషనల్స్‌కు:** ప్రైవేట్ సంస్థల్లో పనిచేసేవారికి రూ.5,000; విద్యార్థులు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారికి రూ.3,000.
- **నాన్ మెడికల్ పీజీ ప్రొఫెషనల్స్‌కు:** ప్రైవేట్ సంస్థల్లో పనిచేసేవారికి రూ.3,000; విద్యార్థులు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారికి రూ.1500.
- **నర్సింగ్ ప్రొఫెషనల్స్, కౌన్సెలర్స్, టీచర్స్‌కు:** ప్రైవేట్ సంస్థల్లో పనిచేసేవారికి రూ.2,000; విద్యార్థులు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారికి రూ.1000

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఫిబ్రవరి 26
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** మార్చి 1 నుంచి
- **ఈ-మెయిల్:** yogaforstress.nimhans@gmail.com
- **వెబ్‌సైట్:** nimhans.ac.in

అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. హైస్కూల్ స్థాయి మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం ఉండాలి. అకడమిక్ మెరిట్, అసెస్‌మెంట్ టెస్ట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: మొదటి సెమిస్టర్‌లో బేసిక్ స్టాటిస్టిక్స్, బేసిక్ ప్రాబబిలిటీ, స్టాటిస్టికల్ మెథడ్స్, సర్వే శాంపిలింగ్, ఇంట్రడక్షన్ టు అఫీషియల్ స్టాటిస్టికల్ సిస్టమ్, స్టాటిస్టిక్స్ అండ్ ఎకానమీ కోర్సులు ఉంటాయి.
- రెండో సెమిస్టర్‌లో అఫీషియల్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్లు, క్విజ్‌లు, అసైన్‌మెంట్లు, ఇంటరాక్షన్ సెషన్స్, కెరీర్ వర్క్‌షాప్‌లు, మెంటార్‌షిప్ సెషన్స్ ఉంటాయి.

అసెస్‌మెంట్ టెస్ట్ సిలబస్: లీనియర్ ఈక్వేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, అర్థమెటిక్ అండ్ జామెట్రిక్ ప్రోగ్రెషన్స్/సిరీస్, సింపుల్ ఇన్‌ఈక్వాలిటీస్, ఈక్వేషన్స్ ఆఫ్ స్ట్రయిట్ లైన్ అండ్ సర్కిల్, ఎలిమెంటరీ సెట్ థియరీ, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ ఎక్స్‌పాన్షన్, ఎలిమెంటరీ ప్రాబబిలిటీ అండ్ కండిషనల్ ప్రాబబిలిటీ, బేసిక్స్ ఆఫ్ ఫంక్షన్స్-లిమిట్స్-కంటిన్యుటీ-డిఫరెన్షియేషన్-మాగ్జిమమ్ అండ్ మినిమమ్-ఇంటిగ్రేషన్, ఎలిమెంటరీ నాలెడ్జ్ ఆఫ్ కాంప్లెక్స్ నెంబర్స్, బేసిక్స్ ఆఫ్ వెక్టర్స్ అండ్ మాట్రిసెస్.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అసెస్‌మెంట్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** www.isical.ac.in

ఏపీలో స్పెషలిస్ట్ డాక్టర్లు

ఖాళీలు 234

జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలోని వివిధ ఆరోగ్య వ్యవస్థలలో ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్టు వైద్యుల నియామకానికి ఏపీ వైద్య సేవల నియామక మండలి దరఖాస్తులు కోరుతోంది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్, తదితర ఆసుపత్రుల్లో పోస్టులు భర్తీ చేస్తారు.

పోస్టు: స్పెషలిస్ట్ డాక్టర్

విభాగాల వారీగా ఖాళీలు: జనరల్ మెడిసిన్-38, ఓబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ-37, పీడియాట్రీషియన్-114, కార్డియాలజిస్ట్/జనరల్ మెడిసిన్-29, ఎపిడెమియాలజిస్ట్-15.

అర్హత: అభ్యర్థులు ఎంబీబీఎస్‌తో పాటు సంబంధిత స్పెషాలిటీలో ఎంబీహెచ్, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 ఏళ్లు మించకూడదు

జీతభత్యాలు: నెలకు రూ.1,10,000 - రూ.1,40,000. ఎపిడెమియాలజిస్ట్ పోస్టులకు రూ.60,000.


ఎంపిక ప్రక్రియ: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 7

వెబ్‌సైట్: apmsrb.ap.gov.in/msrb



కృష్ణా జిల్లాలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు



కృష్ణా జిల్లా కానూరులోని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

జాబ్ కార్నర్

ఖాళీలు 13

ఉద్యోగాలు: సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్, పారా లీగల్ పర్సనల్, పారా మెడికల్ పర్సనల్, ఆఫీస్ అసిస్టెంట్, సెక్యూరిటీ గార్డ్.

అర్హత: సంబంధిత విభాగంలో ఎస్ఎస్‌సీ, డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, ఉమాశంకర్ నగర్, అకాడమీ రోడ్, కానూరు, కృష్ణా జిల్లా చిరునామాకు పంపించాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 9

వెబ్‌సైట్: https://krishna.ap.gov.in/

ఢిల్లీ ఎలక్షన్ కమిషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు

ఖాళీలు 18

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బెసిల్)... న్యూఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డేటా ఎంట్రీ ఆపరేటర్: 15 పోస్టులు
2. ఎంటీఎస్(అన్‌స్కిల్డ్): 3 పోస్టులు

అర్హత: ఎంటీఎస్‌కు మెట్రిక్యులేషన్, డీఈఓకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు డీఈఓకు రూ.23,082. ఎంటీఎస్‌కు రూ.17,494

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 7

వెబ్‌సైట్: https://www.becil.com/

ఎన్ఎండీసీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 120

దంతెవాడ(ఛత్తీగఢ్)లోని భారత ప్రభుత్వ సంస్థ నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎండీసీ), బచేలి కాంప్లెక్స్... కింద పేర్కొన్న విభాగాల్లో ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల వివరాలు
1. మెకానిక్ డీజిల్ - 25
2. ఫిట్టర్- 20
3. ఎలక్ట్రీషియన్-30
4. వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రికల్)- 20
5. మెకానిక్(మోటార్ వెహికిల్) - 20
6. మెషినిస్ట్- 05

అర్హత: పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 22 నుంచి 26 వరకు

వేదిక: శిక్షణ సంస్థ, బీఐఓఎం, బచేలి కాంప్లెక్స్, బచేలి, దంతేవాడ, ఛత్తీస్‌గఢ్.

వెబ్‌సైట్: www.nmdc.co.in/careers

బెల్‌లో ఇంజనీర్లు

ఖాళీలు 22

కోట్‌ద్వారా(ఉత్తరాఖండ్)లోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రెయినీ ఇంజనీర్-1: 8 పోస్టులు
2. ప్రాజెక్ట్ ఇంజనీర్-1: 14 పోస్టులు

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్

విద్యార్హతలు: సంబంధిత విభాగంలో బీఎస్సీ(ఇంజనీరింగ్/బీఈ/బీటెక్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ట్రెయినీ ఇంజనీర్ పోస్టుకు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు 32 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12

వెబ్‌సైట్: https://bel-india.in/

ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ... తాత్కాలిక ప్రాతిపతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,22,543, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,47,986, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,27,141.

ప్రదేశం: డీన్ ఆఫీస్, 5వ ఫ్లోర్, ఎంఎస్ ఆఫీస్ బిల్డింగ్, ఈఎస్ఐ-పీజీఐఎమ్ఎస్ఆర్, బసాయిదరాపూర్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://esic.gov.in/

లిటిల్స్



పొగరు జింక.. ప్రమాదం!

ఒక అడవిలో ఓ జింక ఉండేది. ఆ జింక అందంగా ఉండేది. దానికి తోడు రెండు కొమ్ములు చెట్ల కొమ్మల్లా ఉండేవి. చూడటానికి ఎంతో అందంగా ఉన్నాయా కొమ్ములు అని ఇతర జంతువులు అనేవి. దీంతో ఆ జింక కొన్నాళ్లకు 'నా లాంటి అంద్మైన జింకలే లేవు' అని అనుకునేది. ఆ తర్వాత తన లాంటి అందమైన కొమ్ములు మరెవరికీ లేవని రూఢీ చేసుకుంది. దీంతో అతి నమ్మకం కాస్త పొగరుగా మారింది. తన లాంటి కొమ్ములు ప్రపంచంలోనే ఎవరికీ ఉండవని భ్రమతో ఉండేది. ఆ గర్వంతోనే తాను మరింత గొప్పదాన్నని. దైవ స్వరూపంలా భావించేది.

ఒక రోజు ఉదయాన్నే సూర్యోదయం అయ్యాక ఒక సరస్సు దగ్గరకు వచ్చింది. అక్కడి నీళ్లు శుభ్రంగా ఉన్నాయి. దీంతో ఆ నీళ్లను తాగటానికి వెళ్లింది. తన శరీరంతో పాటు కొమ్ములు నీటిలో నీడలా కనపడ్డాయి. మరింత పొంగిపోయింది. కొమ్ములంటే నావే.. అనుకుంది. ఈ చిన్న కాళ్లు ఉపయోగం లేదు.. సన్నగా ఉన్నవి అనుకుంది. కొమ్ములే అందం..



కాళ్లు విహీనం అనుకుంది. క్షణాల్లో తన వెనుకల ఓ పులి ఉందనే విషయం అర్థం చేసుకుంది. చెంగుమని ఎగిరి అక్కడి నుంచి పారిపోయింది. సన్నని కాళ్ల వలన జింక వేగంగా పరిగెత్తింది. పులి కూడా వెంటనే పరిగెత్తింది.


అడవిలోకి వెళ్తానే పులికి కనపడలేదు. జింక జాడను పులి కనుక్కుని వేగంగా పరిగెత్తింది. దీంతో దట్టమైన అడవిలోకి జింక పరిగెత్తింది. తన కాళ్ల గొప్పతనమేంటో పులికి తెలీదు కాబోలు అనుకుంది. ఎదురుగా చూస్తే చెట్లు. కొమ్ములు అడ్డొస్తున్నాయి. దీంతో ఎంత పరిగెత్తినా కొమ్ములకు చెట్లు అడ్డువస్తున్నాయి. జింకకు ఆయాసం వచ్చింది. జింకలా పరిగెత్తటం కష్టం. దాని కాళ్లలా నాకూ ఉంటే అనుకుంది పులి. అయితే జింక తన అందమైన కొమ్ములు పోతే ఎలా? అనుకుంది. జాగ్రత్తగా అడవిలో పరిగెత్తుతోంది. దీంతో పులికి చిక్కింది. పులి మీద పడిన తర్వాత జింకకు అర్థమైంది ఓ విషయం. 'కొమ్ములు బావున్నాయని విర్రవీగాను. కాళ్లు సన్నగా ఉన్నాయి కాబట్టి ఇంత సమయం పరిగెత్తాను' అనుకుంది. ఆ క్షణంలో తన కొమ్ములు ఉపయోగం లేదని చెప్పినా.. ఉపయోగం లేదు. కొమ్ములు ఉన్నందుకు గర్వంగా ఉన్నాను. కొమ్ములే లేకపోతే ఈ ప్రాణాలు దక్కేవి అనుకుంది మనసులో.


నీతి- ఏది మంచో, ఏది చెడో గుర్తించటమే విజయం.

చుక్కలు కలిపి రంగులు వేయండి



చుక్కలు కలిపి రంగులు వేయండి





డైలీ సుడోకు - 221

	5		8			4		7
		6			2		9	
4			9					
		4	2					
	6	9				2	1	
					8	5		
					4			5
	2		1			7		
7		3			6		2	

సుడోకు - 220 సమాధానం

1	6	4	3	2	9	5	8	7
3	2	9	7	8	5	6	4	1
5	8	7	6	1	4	3	9	2
4	9	3	8	5	7	1	2	6
7	5	2	4	6	1	8	3	9
6	1	8	9	3	2	4	7	5
2	4	6	5	9	3	7	1	8
9	7	5	1	4	8	2	6	3
8	3	1	2	7	6	9	5	4


ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.


సంక్రాంతి గురి తప్పింది
పోన్లే ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకొద్దామని సర్దుకుపోయారు. తీరా చూస్తే ఇక్కడా సంక్రాంతి సీనే రిపీట్ అయ్యింది. మళ్లీ డేట్లు క్లాష్. తాము వెనక్కు వెళ్లబోమంటూ నిర్మాతల మంకుపట్లుతో వాతావారణం వేడెక్కింది. అయితే పరిశ్రమ పెద్దల సలహాలు, సంప్రదింపులు ఫలించడంతో కొత్త రిలీజ్ డేట్స్‌ను మేకర్స్ ప్రకటిస్తున్నారు. దీంతో ఫిబ్రవరి బరిలో వాయిదా పడిన చిత్రాలదే హవా అనే పరిస్థితి కనిపిస్తోంది.





వాయిదా చిత్రాలదే హవా







సంక్రాంతికి బరిలో దిగేందుకు సిద్ధమైన చాలా సినిమాలకు నిరాశే ఎదురైంది. తగినన్ని థియేటర్లు దొరికే పరిస్థితి లేకపోవడంతో మేకర్స్ ఫిబ్రవరిపై దృష్టి పెట్టారు. అయితే అనూహ్యంగా ఈ నెల్లోనూ సినిమాల రిలీజ్ డేట్ల విషయంలో సంక్రాంతి తరహాలోనే కంగాళి మొదలైంది. చదరంగంలో పావుల్లా సినిమాల విడుదలను ముందుకు వెనక్కు జరుపుతూ వచ్చారు. దీంతో అటు ఇండస్ట్రీలో ఇటు ప్రేక్షకుల్లో ఏ సినిమా ఎప్పుడు రిలీజవుతుందో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. అయితే ఎట్టకేలకు పరిశ్రమ పెద్దలు, నిర్మాతల మండలి చొరవతో ఇప్పుడు సమస్య పరిష్కారమైనట్లే అనిపిస్తోంది. వరుసగా ఒక్కో చిత్రం రిలీజ్ డేట్‌ను ప్రకటించడంతో ఫిబ్రవరి బరిలో నిలిచే చిత్రాలపై స్పష్టత వస్తోంది. దీంతో చిత్రబృందాలు ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నాయి.

ఈగల్‌తో మొదలై...

అగ్రహీరోలు నటించిన, పెద్ద నిర్మాణ సంస్థలు నిర్మించిన చిత్రాలకు సైతం సంక్రాంతికి థియేటర్లు దొరక్క విడుదల వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ కోవలో ముందుగా చెప్పుకోవాల్సింది రవితేజ 'ఈగల్' చిత్రం గురించే. రవితేజ లాంటి స్టార్ హీరో నటించిన చిత్రం సంక్రాంతికి సందడి చేస్తే ఆ కిక్కే వేరు. మేకర్స్, అభిమానులు కూడా అదే అనుకున్నారు. కానీ వీలుపడలేదు. రిలీజ్ డేట్ ప్రకటించి కూడా చివరి నిమిషంలో విడుదల వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సోలో రిలీజ్ డేట్ హామీ ఇవ్వడం, పరిశ్రమ బాగుకోసం అనే కోణంలో ఆలోచించి తమ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వాయిదా వేసుకొంది. ఈ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. ఇప్పటి వరకూ విడుదలైన ప్రచార చిత్రాలు 'ఈగల్'పై అంచనాలు పెంచాయి. అయితే రజనీకాంత్ 'లాల్‌సలామ్' రూపంలో 'ఈగల్'కు బలమైన ప్రత్యర్థే ఉన్నాడు. తొలుత ఈ చిత్రాన్ని కూడా సంక్రాంతి బరిలో దింపాలని చూసినా వీలుకాలేదు. దీంతో ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. రజనీకాంత్ కూతురు ఐశ్వర్య దర్శకత్వం వహించిన చిత్రమిది. ఇందులో రజనీకాంత్ అండర్‌వరల్డ్ డాన్ పాత్రలో కనిపించనున్నారు. విష్ణు విశాల్, విక్రాంత్ కీలకపాత్రలు పోషించారు. అలాగే సందీప్ కిషన్ హీరోగా నటించిన 'ఊరుపేరు భైరవకోన' చిత్రం కూడా ఫిబ్రవరి 9న విడుదలవ్వాల్సి ఉంది. చేసేదేం లేక 'ఈగల్' సినిమా కోసం మరో వారం వెనక్కు జరిపి ఫిబ్రవరి 16న విడుదల చేస్తున్నారు.



కావ్యాథాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లు. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఉత్కంఠభరితంగా వీఐ ఆనంద్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు.

మార్చికి మారాయి

ఇక 'ఈగల్', 'లాల్‌సలామ్' చిత్రాల దెబ్బకు ఫిబ్రవరి 9న రావాల్సిన 'టిల్లూ స్క్వేర్' చిత్రం వెనక్కుతగ్గాల్సి వచ్చింది. మార్చి 29కు ఈ సినిమా రిలీజ్ డేట్ మారింది. 'డీజే టిల్లు' చిత్రానికి ఇది సీక్వెల్. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించారు.

ఆపరేషన్ వాలెంటైన్


వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయాలనే నిర్ణయం చాలా ముందుగానే జరిగింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే అనూహ్యంగా మేకర్స్ ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను మార్చారు. మార్చి 1న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. గోపీచంద్ హీరోగా నటించిన 'భీమా' చిత్రం కూడా ఫిబ్రవరి 16నే విడుదల కావాల్సి ఉంది. మారిన పరిస్థితుల్లో మార్చి 8న వస్తోంది. భారీ అంచనాలతో వస్తున్న సినిమాలతో పాటు కొన్ని చిన్న సినిమాలు కూడా ఫిబ్రవరిలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. ఈ నెల 23న విడుదలవుతోంది. ఆర్‌టీటీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా పతాకంపై హీరో రవితేజ నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్యశ్రీ ప్రధాన తారాగణం. ఓ మారుమూల గ్రామంలో స్కూల్ టీచర్ విద్యార్థుల జీవితాల్లో తాను కోరుకున్న మార్పు కోసం ఎలాంటి కృషి చేశాడనేది వినోదాత్మకంగా తెరకెక్కించారు. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది.

తెలుగులోనూ అభిమాన గణం దండిగా ఉన్న కథానాయకుడు మమ్ముట్టి. ఈనెల 15న 'బ్రమయుగం' చిత్రంతో వస్తున్నారు. హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకుడు. భిన్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కినట్లు ప్రచార చిత్రాలను చూస్తుంటే అర్థమవుతోంది.











బుర్జ్ ఖలీఫాలో గ్రాండ్‌గా..

సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పదవ సీజన్‌ను శుక్రవారం దుబాయ్‌లో అద్భుతమైన షోతో కిక్ స్టార్ట్ చేశారు. బుర్జ్ ఖలీఫాపై ఈ సీజన్ ప్రోమోను లాంచ్ చేశారు. మొత్తం ఎనిమిది జట్ల నుంచి కెప్టెన్లు కిచ్చా సుదీప్ (కన్నడ), సోహైల్ ఖాన్ (హిందీ), ఆర్య, జీవా(తమిళం), తమన్, సుధీర్‌బాబు (తెలుగు), జిస్సు సేన్ గుప్తా(బెంగాలీ), బన్ను థిల్లాన్, సోనూ సూద్ (పంజాబీ), ఇంద్రజిత్ సుకుమారన్, ఉన్ని ముకుందన్ (మలయాళం) పాల్గొన్నారు.

సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ ఇందూరి మాట్లాడుతూ 'ప్రతి సంవత్సరం లీగ్ అభివృద్ధి చెందడం.. లీగ్‌లో ఆడే క్రికెట్ ప్లేయర్స్ ప్యాషన్‌కు ప్రతిబింబం. ఈ ఏడాది గతంలో కంటే భారీ స్థాయిలో ఉంటుంది' అని తెలిపారు.

'మన గొప్పదేశంలోని ఎనిమిది పవర్‌ఫుల్ ఫిల్మ్ ఇండస్ట్రీలు ప్రాతినిధ్యం వహిస్తున్న సూపర్ స్టార్స్‌తో కలసి పాల్గొనడం ఈ లీగ్ విశేషం. భారతదేశం ఉద్వేగభరితంగా వీక్షించే క్రికెట్ మ్యాచ్‌లివి' అని చెప్పారు సోనూ సూద్.

ఛత్రపతి శివాజీ పాత్రలో షాహిద్ కపూర్



మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత కథను భారీ స్థాయిలో తెరపై చూపించడానికి ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించడానికి నిర్మాత అశ్విన్ వర్దే సన్నాహాలు జరుపుతున్నారు. 'ఓ మైగాడ్ 2' చిత్ర దర్శకుడు అమిత్ రాయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో షాహిద్ కపూర్ నటించనున్నారు. ఇప్పటికే సచిన్ రవి దర్శకత్వంలో జాకీ, విష్ణు భగ్నానీ నిర్మించే బిగ్ బడ్జెట్ ఫిల్మ్‌లో నటించడానికి సైన్ చేసిన షాహిద్‌కు వెంటనే వచ్చిన మరో మంచి అవకాశం ఛత్రపతి శివాజీ చిత్రం. అయితే ఈ చిత్రం షూటింగ్ వెంటనే ప్రారంభమయ్యే అవకాశాలు లేవు. ఆకాశమే హద్దు అన్నట్లుగా అపరిమితమైన బడ్జెట్‌తో తీయాలనుకుంటున్న ఛత్రపతి శివాజీ చిత్రం కోసం మంచి పార్టనర్ ను వెదుకుతున్నారు అశ్విన్. ఫండింగ్ చేసే స్టూడియోలు కానీ సంస్థలు కానీ ముందుకు వస్తే షూటింగ్ ప్రారంభించడమే తరువాయి అంటున్నారు అశ్విన్. పలు సంస్థలతో ఆయన చర్చలు జరుపుతున్నారు.

ఎస్వీఆర్ మత్తు.. గమ్మత్తు!

ఫ్లాష్‌బ్యాక్





ఏవీఎం సంస్థ తమిళంలో నిర్మించిన చిత్రం కళత్తూర్ కన్నమ్మ'. ఈ సినిమా విజయం సాధించడంతో తెలుగులో 'మూగనోము' (1969) పేరుతో రీమేక్ చేశారు ఏవీయం చెట్టియార్. అక్కినేని నాగేశ్వరరావు, జమున ఇందులో జంటగా నటించారు. అక్కినేని తండ్రిగా జమిందార్ పాత్రలో ఎస్వీ రంగారావు నటించారు. ఆయన మూడ్ డిస్టర్బ్ అయితే షూటింగ్స్ అన్నీ వదిలి పెట్టి తోటలో ఉన్న గెస్ట్ హౌస్‌కు వెళ్లిపోయేవారు. గదిలో తలుపులు వేసుకుని బాటిల్ మూత తెరిచేవారు. వారం, పది రోజుల వరకూ ఇదే పరిస్థితి. ఆ సమయంలో ఆయన్ని చూసి 'గురువుగారు సమాధిలోకి వెళ్లారు' అనేవారు ప్రొడక్షన్ సిబ్బంది. ఆయన ఎప్పుడు బయటకు వస్తారా అని ఓపికతో ఎదురు చూసేవారు. ఆయన షూటింగ్‌కు హాజరైన తొలి రోజున కాస్త దిమ్ముగా ఉంటుంది కనుక షాట్‌లో డైలాగులు మరచిపోయేవారు. అయితే రంగారావు దగ్గర ఓ కిలాడీతనం ఉండేది. ఇలా డైలాగులు మరచిపోయినప్పుడల్లా ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ డైలాగుల్ని గుర్తుకు చేసుకొనేవారు. అవి గుర్తుకు రాగానే అదే ఫ్లోలో చెప్పేసేవారు. రంగారావు పద్ధతి తెలుసు కనుక ఎదుట ఉన్న ఆర్టిస్ట్ చాలా అలెర్ట్‌గా ఉండేవారు.

'మూగనోము' షూటింగ్‌లో ఒకసారి ఇలాగే జరిగింది. దేవాలయంలో గౌరి పాత్రధారిణి జమునతో జమిందారు పాత్రధారి రంగారావు ప్రమాణం చేయించే సీన్ చిత్రీకరిస్తున్నారు దర్శకుడు యోగానంద్. రంగారావు సమాధి నుంచి బయటకు వచ్చిన తొలి రోజు అది. అందుకే మొదట్లో డైలాగులు మరిచిపోయారు రంగారావు. రకరకాల ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తున్నారు కానీ డైలాగులు నోటి వెంట రావడం లేదు. ఆ షాట్‌లోనే ఉన్న జమునకు పరిస్థితి అర్థం అయింది టేకుల మీద టేకులు తింటున్నారు రంగారావు. చివరకు ఆయనకు డైలాగులు గుర్తుకు రావడంతో ఎలాగోలా ఆ సీన్ పూర్తి చేశారు. ఏ రోజు తీసిన సన్నివేశాలు ఆ రోజు రష్ చూడడం ఏవీయం మెయ్యప్పన్‌కు అలవాటు. ఆయనకు ఈ సీన్ చూపించారు. 'అబ్బే బాగోలేదు.. చాలా డల్‌గా వచ్చింది. రీ షూట్ చేయండి' అన్నారాయన. దర్శకుడు యోగానంద్, సంభాషణల రచయిత డి.వి. నరసరాజు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. మెయ్యప్పన్‌కు తెలుగు రాదు కనుక స్క్రిప్ట్ తయారైన తర్వాత డైలాగుల్ని ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేసి వినిపించేవారు. 'రీ షూట్ ఎందుకు? నేను మీకు వినిపించిన డైలాగులే కదా.. చిన్న మార్పు కూడా చేయకుండా అలాగే చెప్పించాం' అని మెయ్యప్పన్‌కు వివరించారు నరసరాజు. 'ఏమో.. సీన్ చాలా నీరసంగా ఉంది. అందుకే రీ షూట్ చెయ్యమంటున్నా' అని చెప్పారు మెయ్యప్పన్. ఆయనకు సీన్ ఎందుకు నచ్చలేదో అప్పుడు వీరిద్దరికీ అర్థమైంది. ఆ మర్నాడు షూటింగ్ ఉందని రంగారావుకి కబురు చేసి ఆ సీన్ మళ్లీ తీశారు. మెయ్యప్పన్ అప్పుడు బాగుందని ఓకే చేశారు.

ఓటీటీ స్పెషల్

ఈ వారమే విడుదల
ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఒన్ డే	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 08
గుంటూరు కారం	తెలుగు చిత్రం	ఫిబ్రవరి 09
భక్షక్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 09
అమెజాన్ ప్రైమ్		
కెప్టెన్ మిల్లర్	తమిళ చిత్రం	ఫిబ్రవరి 09
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఆర్య	హిందీ సిరీస్ 3	ఫిబ్రవరి 09
ఆహా...		
బబుల్‌గమ్	తెలుగు చిత్రం	ఫిబ్రవరి 09
బుక్ మై షో		
ఆక్వామాన్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 05
జియో సినిమా		
ది ఎగ్జార్సిస్ట్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 06
ది నన్ 2	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 07
హాలో	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 08
సన్ నెక్స్ట్		
అయలాన్	తమిళ చిత్రం	ఫిబ్రవరి 09

